ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

30-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 268 పేజీలు: 10+4 వెల: 6.50

ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ: రాహుల్

ట్రంప్‌కు దక్షిణ కొరియా అత్యున్నత పురస్కారం 5లో



బుధవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే చేస్తున్న సిఎం చంద్రబాబు

విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ 3లో

# ముంచేసిన మొంథా



భారీవర్షాలకు నీట మునిగిన ఒంగోలు పట్టణం

## నరసాపురం వద్ద తీరందాటిన తుఫాన్

పెనుముప్పు నుంచి బయటపడిన కోనసీమ

ధ్వంసమైన ఉప్పాడ బీచ్‌రోడ్డు

క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన సిఎం చంద్రబాబు

# ఇది పెను విపత్తు

- ముందస్తు చర్యలతో వేలకోట్ల నష్టాన్ని నివారించగలిగాం
- ముంపు ప్రాంతాలను ఏరియల్ సర్వేద్వారా పరిశీలించిన సిఎం చంద్రబాబు
- నష్టం అంచనాలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- బాధితులకు తక్షణ సాయం అందించాలని సూచన
- మొత్తం 249 మండలాలు, 1434 గ్రామాలు, 48 మునిసిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం



భారీ వర్షాలకు నెల్లూరులో ఇంటిపై కూలిన చెట్టు

**విజయవాడ,అక్టోబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాను పెనువిపత్తు అని, రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తుఫాన్‌ల సమయంలో పనిచేసిన అనుభవం నాకుందని తెలిపారు. ఈ మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని అందువల్ల ముందు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చూశామని అన్నారు. ఆస్తి నష్టం కూడా చాలావరకు తగ్గేలా చర్యలు తీసుకున్నామన్నారు. పలుజిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీవర్షం నమోదైందని అన్నారు. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని అలానే కౌలురైతులకు పరిహారం అందిస్తామని వెల్లడించారు. తుపాను సమయంలో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు కొనియాడారు. జిల్లా కలెక్టర్లు,అధికారులు,మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశంలో మాట్లాడుతూ ముందస్తు చర్యలతో తుఫాను ప్రభావం నుంచి రూ.వేల కోట్ల నష్టాన్ని నివారించగలిగామని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి >>2

## భారీగా పంటనష్టం

కోనసీమలో నేలకొరిగిన వరి, అరటి పంటలు

పలు గ్రామాల్లో తెగిన రోడ్లు, కూలిన వంతెనలు, పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**విజయవాడ, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని వణికించిన మొంథా తీవ్ర తుపాను ఎట్టకేలకు తీరం దాటింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత నరసాపురం వద్ద తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మధ్యాహ్నానికి ఇది భూభాగంపైనే బలహీనపడనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధవారం కూడా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని గంటకు వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులుహెచ్చరించారు. ఇది ఉత్తర వాయ >>2



నీటమునిగిన వరిచేలు



బుధవారం కోనసీమలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుపాన్ గత మూడు రోజులు నుండి గడగడలాడించింది. ఎట్టకేలకు మంగళవారం రాత్రి కోనసీమ జిల్లాలోని అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకి, నర్సాపురం వద్ద తీరాన్ని దాటింది. ఈ సమయంలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో కదిలి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య నరసాపురం సమీపంలో తీవ్ర తుపాన్‌గా కొనసాగుతుంది. తుపాన్ కారణంగా కాకినాడ, కోనసీమ జిల్లాలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదయింది. గాలులతీవ్రత ఇంకాకొనసాగుతుంది. గంటకు 85 నుంచి 95 కిలోమీటర్ల >>2

# రహదార్లకు తీరని నష్టం



బుధవారం తుఫాను ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నాం

నేటినుంచి మళ్లీ 100% ఆర్టీసి సర్వీసులు

బియ్యం, నిత్యావసరాలకు ఎలాంటి లోటు లేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి. అక్టోబరు 29. ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాన్ ముందుగా ఊహించినంత తీవ్రత కనబరచకపోయినా, విద్యుత్ సరఫరా మరియు రహదారి రవాణా వ్యవస్థలకు ఇబ్బందులు కలిగించిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డైరి, రీడెవలప్‌మెంట్ మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.తుఫాన్ ఈదురుగాలుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగాసుమారు 300 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వాటి పునరుద్ధరణ పనుల్లో 80 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన 20 శాతం పనులు రాబోయే రెండు గంటల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎంఇడి పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలి అని సూచించారని, ఆ దిశగా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం వంటి ప్రాంతాల నుండి మానవ వనరులను తరలించి విద్యుత్పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్లమేర రహదారులపై కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలను పూర్తిగా పునరుద్ధరించామని, నేటి నుండి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం పునరావాస కేంద్రాలలో భోజన వసతి పొందిన వారందరికీ బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పించి, రాత్రి భోజనం అనంతరం స్వగృహాలకు పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాలని అధికారులు ఆదేశించారని వెల్లడిం >>2



## యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

-డి.సిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాను ప్రభావంతో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మొంథా ప్రభావంపై క్షేత్రస్థాయి నుంచిసమాచారం తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్దరణ చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను బలహీనపడినా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రదేశాల్లోనే ఉంచాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి కల్పించాలని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పారిశుద్ధ కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈదురు గాలులు,భారీ వర్షాల మూలంగా కలిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ, నెల్లూరు జిల్లాలో పెన్నానది, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.పునారావాస కేంద్రాల్లో ఉన్న ఆశ్రితులందరికి సహాయక చర్యలు అందాలన్నారు. పరిస్థితులు చక్కబడిన తరువాతనే వారిని ఇంటికి పంపించాలన్నారు.తుఫాన్ ప్రభావంతో నెలకొరిగిన చెట్లు తొలిగించాలన్నారు. నేలకు ఒరిగిన విద్యుత్తు స్తంభాలను,తెగిన తీగలను సరిదిద్దాలన్నారు. ఈ కారణాలతో ఆగిన విద్యుత్తు సరఫరాను పునరుద్దరించాలన్నారు. గ్రామాల్లో వరద నీటిని తొలిగించి,దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రతిపదికన మరమ్మత్తులు చేయాలన్నారు. గ్రామాల్లో తుఫాన్ బాధితులకు నిత్యావసర వస్తువులు,ఇతర సహాయక చర్యలు అందించాలన్నారు.

# విహెచ్‌ఎల అర్హత ప్రక్రియ మార్చడం సబబు కాదు..




## స్పష్టం చేసిన హైకోర్టు

**విజయవాడ.అక్టోబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ఉద్యాన సహాయకుల (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్) నియామక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అర్హతలను మార్చడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆట మొదలయ్యాక క్రీడా నిబంధనలను మార్చేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలో వీహెచ్ఎ ఉద్యోగాల 'అర్హత' విషయంలో కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. దీన్ని పూర్వ తేదీ నుంచి (రెట్రాస్పెక్టివ్) అమలు చేసేందుకు చట్ట విరుద్ధమంది. రాత పరీక్షలో అర్హత సాధించిన పిటిషనర్లను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే, తాజా మెరిట్ లిస్ట్ ప్రచురించి, ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.ప్పటికే ఎంపికైన వారి కంటే కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఎక్కువ మెరిట్ సాధించి ఉంటే గనక భవిష్యత్తు పదోన్నతుల్లో వారికి ఎటువంటి నష్టం జరగకుండా నోషనల్ సీనియారిటీ కల్పించాలి. ఈ ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ మేరకు కీలక తీర్పును వెలువరించారు.

**పోస్టుల నియామకానికి ప్రకటన జారీ:** 2019లో గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ సంవత్సరం జులైలో కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా 4 వేల వీహెచ్ఎ పోస్టుల నియామకానికి ప్రకటన జారీ చేసింది. బీఎస్సీ (హార్టికల్చర్)/(హానర్స్), హార్టికల్చర్/బీటెక్, హార్టికల్చర్ డిప్లొమా చేసిన వారు, తదితర అభ్యర్థులు అర్హులుగా పేర్కొంది. 4,000 పోస్టుల్లో 2,217మాత్రమే భర్తీఅయ్యాయి. హార్టికల్చర్‌శాఖలో పని చేస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ అధికారి (ఎంపిఇఒ), మైక్రో ఇరిగేషన్ >>2



బుధవారం నియోజకవర్గాల పునర్విభజనపై మంత్రి మండలి ఉప సంఘం సమావేశ దృశ్యం

జిల్లాల పునర్విభజనపై వారంలో

# మళ్లీ చర్చలు

ప్రజా అభ్యంతరాలకు అనుగుణంగానే నిర్ణయం: మంత్రులు

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లాల పునర్విభజనపై రెండోరోజు సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం వారం రోజుల్లో మరోసారి చర్చించి సిఎం చేసిన ప్రతిపాదనలపై తుది నిర్ణయానికి రావాలని నిర్ణయించారు. మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు అనగాని సత్యప్రసాదు, పి.నారాయణ, ఎన్.మనోహర్, సత్యకుమార్‌యాదవ్, నిమ్మల రామానాయుడు బుధవారం సమావేశమయ్యారు. మంగళవారం నాటి సమావేశంలో సిఎం చేసిన పలు సూచనలపై సుదీర్ఘంగా చర్చించారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని, ప్రస్తుతం పోలవరం నియోజకవర్గం పరిధిలోకి వెల్లిన పునరావాసులతోపాటు ప్రజల నుండి అభిప్రాయ సేకరణ అనంతరం వారిని ఏ జిల్లాలో ఉంచాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నివేదికను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించింది, వాటిల్లో మార్కాపురం, మదనపల్లె కొత్త నియోజకవర్గాలతోపాటు పలు డివిజన్లకు సంబంధించి వారి భౌగోళిక స్వరూపం నేపథ్యంలో కొన్నిటిని జిల్లాలు మార్చాలని ప్రతిపాదించారు. అయితే అల్లూరి సీతారామరాజు గిరిజన జిల్లాలో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నిర్ణయించారు. దీనిపై సిఎం పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు పోలవరం నియోజకవర్గం పరిధిలో పునరావాసం కల్పించామని, వారి అభిప్రాయం తీసుకుని అవసరమైతే వారిని కూడా తూర్పుగోదావరిలో కలిపే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు రెండు జిల్లాల పరిధిలో ఉన్న నేపథ్యంలో ఈ >>2

## పిపిపి విధానంపై ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు 2లో



బుధవారం అమరావతిలో జస్టిస్ సుభేందు చేత ప్రమాణం చేయిస్తున్న సిజె ధీరజ్‌సింగ్ ఠాకూర్

## హైకోర్టు జడ్జిగా జస్టిస్ సుభేందు ప్రమాణం

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. ఆ మేరకు బుధవారం నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ సుభేందుతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కలకత్తా హైకోర్టు నుండి జస్టిస్ సుభేందు ఎపి హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్‌జనరల్ దమ్మాలపాటి >>2


భారీ వర్షాలకు ఒంగోలులో నీట మునిగిన కార్లు


బుధవారం రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు


భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉప్పాడ రోడ్డు

# ఇది పెను విపత్తు

>> మొంథా తుఫాన్ విషయంలో సమర్థవంతంగా వ్యవహరించి నష్టనివారణ చర్యలు చేపట్టామన్నారు.సీఎం నుంచి సచివాలయ సిబ్బంది వరకు జిల్లా అడ్మినిస్ట్రేషన్‌తో సహా అంతా కలిసి టీంగా పనిచేశామన్నారు.కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు.మరో రెండు రోజులు ఇదే విధంగా పనిచేస్తే...బాధిత ప్రజలను మరింత ఊరట ఇవ్వగలం.తుఫాను వెళ్లిపోయింది.కాబట్టి వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు పని చేయాలి. మంత్రులు,అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. వారికేమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలి. మొంథా తుఫాను వల్ల వివిధ విభాగాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలి. కేంద్రానికి నివేదిక అందివ్వాలి. తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలి. నిర్వాసితులను ఆదుకోవాలి అన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగాం. సచివాలయాల్లోకి మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టంను ఏర్పాటు చేసి కింది స్థాయి వరకూ ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం. ఇదొక నూతన విధానం తీసుకొచ్చాం. తుఫానును ఎవరూ నివారించలేరు. కానీ ముందు జాగ్రత్తతో నష్టాలను నివారించగలుగుతాం. కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూంలో కూర్చుని రియల్ టైం సమాచారం తెప్పించుకుని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా, విద్యుత్ వైర్లు తెగిపడినా యుద్ధప్రాతిపదికన తొలగించారు. అన్ని మున్సిపాలిటీలో డ్రెయిన్లు క్లీన్ చేయడం వల్ల కాలనీలను ముంపు బారిన పడకుండా చేశామన్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను కూడా పునరుద్ధరించేందుకు 10 వేల మందిని అందుబాటులో పెట్టుకున్నామన్నారు. నేడు మధ్యాహ్నానికి సాధారణ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరుగుతుందన్నారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్లు,అధికారులు,మంత్రులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. తుఫాను నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సినచర్యలపై అధికారులు, మంత్రులకు సూచనలు చేశారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా,విద్యుత్ తీగలు తెగి పడినా యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మున్సిపాలిటీల్లో డ్రెయిన్ల శుభ్రం వల్ల ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 10 వేల మందిని అందుబాటులో ఉంచాం. ఇవాళ మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుఫాను కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై ప్రజలకు భరోసా పెరిగిందని'అని చంద్రబాబు తెలిపారు.ఈ నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగించుకుని రాష్ట్ర సచివాలయానికి సిఎం చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. తిరిగి తుఫాన్ వల్ల వచ్చిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షనిర్వహించారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని స్పష్టం చేశారు.ఎక్కడా వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పరచాలని, పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సిఎం ఆదేశించారు.

తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.1.16 లక్షల మందికి ఆశ్రయం కల్పించామన్నారు.రాష్ట్రంలో మొత్తం 249మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. తుఫాన్ నష్టంపై తాజా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు.రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంటకు నష్టం జరిగిందన్నారు. 59 వేలకుపైగా హెక్టార్లలో నీటమునిగిన వరిపంట, పత్తి, మొక్కజొన్న, మినుము పంట లకు నష్టం కలిగిందన్నారు. భారీవర్షాలతో నష్టపోయిన 78,796 మంది రైతులు.రాష్ట్ర వ్యాప్తంగా చని పోయిన 42 పశువులు....రాష్ట్రంలో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు, 14 బ్రిడ్జిలు, కల్వర్టులుదెబ్బతిన్న 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు.. రూ.1,424 కోట్ల నష్టం రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ.36 కోట్లు వరకు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల మేర నష్టం కలిగిందన్నారు. సురక్షిత ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీల తరలింపు.. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహణ297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలురాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించామని ప్రభుత్వ యంత్రాంగం వివరించింది.

# నరసాపురం వద్ద తీరందాటిన తుఫాన్

>> వేగంతో గాలులు వీసాయి. వాతావరణ శాఖ అధికారులు ముందుగా ప్రకటించిన విధంగా అందరూ భావించినట్లు కాకినాడ- మచిలీపట్నం మధ్య తీరం దాటింది. తీరాన్ని తాకిన సమయంలో పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీసాయి. అల్లకల్లోలంగా మారిన సముద్రం నుండి పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడ్డాయి. అంతర్వేది వద్ద సముద్రం ముందుకు రావడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలడంతో మంగళవారం ఉదయం నుండి బుధవారం వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అనేక ప్రాంతాలు అంధకారమయంగా మారాయి.మొంథా తుఫాన్ కారణంగా నష్ట వాటిల్లినప్పటికీ కోనసీమ ప్రాంతం పెను ముప్పు నుండి బయటపడింది. అందరూ కోనసీమ వద్ద తుఫాను తీరం దాటుతోందని, హెచ్చరిక నేపథ్యంలో 1996 నవంబర్ 6న హరికేన్ సృష్టించిన నష్టాన్ని జ్ఞాపకం చేసుకుంటూ కోనసీమ వాసులు వణికిపోయారు. అయితే తీరాన్ని తాకే సమయానికి ట్రైక్షన్ విచ్ఛిన్నమై క్రమేపీ బలహీనపడుతూ అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకడంతో భారీ నష్టం తప్పింది. మొంథా తుఫాను కోనసీమ వద్ద తీరాన్ని తాకినప్పటికీ చిన్నపాటి నష్టంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. భారీ వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పాడ బీచ్ రోడ్ తుఫాన్ తాకిడికి ధ్వంసం అయింది. సముద్రం నుండి రాకాసి అలలు ఎగిసిపడుతూ భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.

**ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తత**

మొంథా తుపాన్ పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాన్ ప్రభావం ఉండే ప్రాంతాల నుండి జనాలను పునరావాస కేంద్రాలకు తరలించి ప్రాణ నష్టాన్ని నివారించడంలో అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసింది. ఎప్పటికప్పుడు సిఎం సమీక్షలు చేసి అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎక్కడ ప్రాణ నష్టం జరక్కుండా అధికారులు జాగ్రత్త వహించారు.

**క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సిఎం చంద్రబాబు నాయుడు**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓడలరేవుకు హెలికాప్టర్‌లో వచ్చారు. అక్కడి నుండి రోడ్డు మార్గాన తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. కౌలు రైతులను ఆదుకుంటామన్నారు. నష్ట పరిహారాన్ని త్వరలో అందజేస్తామన్నారు. ప్రతి రైతుకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఓడలరేవు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపి హరీష్ మాథుర్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మెట్ల రమణబాబు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు.

# భారీగా పంటనష్టం

>> వ్యంగా తెలంగాణ మీదుగా ప్రయాణించి ఈ మధ్యాహ్నానికి ఛత్తీస్‌గఢ్ వద్ద మరింత బలహీన పడుతుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాతీరాల్లో సముద్రఅలలు 3మీటర్ల ఎత్తుకుపైగా ఎగసిపడే ప్రమాదముందని మత్స్యకారులు గురువారం వరకు వేటకు వెళ్లొద్దని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. ఈ మధ్యాహ్నం వరకు తీరం వెంబడి గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మధ్యాహ్నానికి 80 కిలోమీటర్లకు, సాయంత్రానికి 65 కిలోమీటర్లకు తగ్గుతాయని అంచనా వేస్తోంది. మొంథా తీరం దాటినప్పటికీ గాలుల ప్రభావం కొనసాగుతోంది. గంటకు 85నుంచి 95, గరిష్టంగా 105 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. విశాఖ, మచిలీపట్నంలోని డాప్లర్ వెదర్ రాడార్ల, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మొంథా ప్రభావంతో ఏపిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ధాటికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు అల్లకల్లోలంగా మారాయి. భారీ వర్షాలు కురవటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక చోట్ల అంధకారం నెలకొంది.

తుఫాన్‌ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నదులు, చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారపుపాడు, తోటరావులపాడు, చందాపురం వద్ద నల్లవాగు క్యాజ్‌వేలపై పొంగి ప్రవహించాయి. భీమవారిపాలెం, సూర్యలంక రోడ్, మూలపాలెం, కర్లపాలెం, పార్లీ, పిట్లవాని పాలెం, కొండబోట్లవారిపాలెంలో అనేకచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో బాపట్ల అంతా అంధకారమైంది.

బాపట్ల జిల్లా యద్దనపూడిదేగరమూడి వద్ద పర్చూరు వాగు వంతెనపై నీటి ప్రవాహం పొంగిపొర్లుతుంది.చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, కారంచేడు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పర్చూరు మండలం ఉప్పుటూరు, వేటపాలెం మండలం కొత్తపేటలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణా జిల్లాలో తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. గుడివాడలోని ప్రధాన మార్గాల్లో చెట్లు పడిపోయాయి. నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం, కృత్తివెన్ను, గన్నవరం తదితర మండలాల్లో చెట్లు నేల కూలాయి. విద్యుత్తు తీగలు తెగిపడటంతో సరఫరా నిలిచింది. మచిలీపట్నంలోని మంగినపూడి తీరంలో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. నిజాంపట్నం నుంచి రేపల్లె మార్గంలో పడిన చెట్లను బృందాలు తొలగించాయి. మచిలీపట్నం మంగినపూడి రహదారిపై పడిన వృక్షాన్ని సిబ్బంది తొలగించారు. అనకాపల్లి, మచిలీపట్నంలో పడిన చెట్లను సహాయ బృందాలు తొలగించారు. నాగాయలంక, హంసలదీవి, చినగొల్లపాలెం, పెదపట్నం తదితర తీర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముంపు, తీర గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

మొంథా ప్రభావంతో నేడు భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఇవాళ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురవవచ్చుని మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 35వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. కోనసీమలో వరి, అరటి పంటల రైతులకు భారీగా పంటనష్టంవాటిల్లింది. రాజోలు, పి. గన్నవరం, రావులపాలెం, చాకలిపాలెం, కనకాయలంక గ్రాయమాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విజయనగరం జిల్లా జామి మండలంలో పంట చేతికి వచ్చే సమయంలో వరిపంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతన్నలు వాపోతున్నారు. ప్రకాశం జిల్లాలో వేరుశనగ, పొగాకు, మిర్చి పంటలు సైతం దెబ్బతిన్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో విస్తృత పర్యటించారు.

## జస్టిస్ సుభేందు ప్రమాణం

>> శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్. ద్వారకానాథ్‌రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ నారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు ఉద్యోగులు, ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జ్యుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రహదార్లకు తీరని నష్టం

>> చారు. జిల్లా వ్యాప్తంగా 400 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 10,150 మందికి ఆశ్రయం కల్పించామని, వీరిలో ప్రతి కుటుంబానికి రూ.3,000 చొప్పున, ఒంటరి వ్యక్తులకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా ఉపాధి కోల్పోయినందున వారికి 50 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా నేటి నుండే ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిశాంతిని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల వరి పంట తుఫాన్ ప్రభావంతో నష్టపోయిందని, అలాగే ఉద్యాన పంటలైన అరటి తదితర పంటలు కూడా నష్టానికి గురైనట్లు తెలిపారు. ఈ నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పంటల నష్టాలను తగ్గించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఆర్థిక సహాయం పారదర్శకంగా అందజేయాలని సూచించారు. బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకోవాలని ఆదేశించారు.

మొంథా తుఫాను తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆంధ్రా, తెలంగాణ, చత్తీస్‌గఢ్ భూభాగంపై ఇది కొనసాగుతోంది. దీని ప్రభావంతో తీరం వెంట 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. 'మొంథా' క్రమంగా బలహీనపడుతోందని ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆసంస్థ ఎండి ప్రఖర్‌జైన్ ఓ ప్రకటన విడుదలచేశారు. తుఫాను ప్రభావంతో నేడు ఎపిలో విస్తారంగా వర్షాలుకురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే వీలుంది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది' అని అధికారులు తెలిపారు. కోస్తాంధ్రలో ఈదురుగాలులు వీస్తాయని...ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.


అల్లురు జిల్లా బొర్రా-చిమిడిపల్లి రైల్వేస్టేషన్ మధ్య ట్రాక్‌పై పడిన బండరాళ్లు


తుఫాన్ ధాటికి లంబసింగి ఘాట్‌రోడ్‌లో విరిగిపిడిన చెట్లు



భారీ వర్షాలకు నెల్లూరు జిల్లా సోమశిల రామాలయంలో విరిగిపడిన ధ్వజస్తంభం

## వారం - వర్జ్యం

30-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.10.03
శ్రవణ సా.6.28
వర్జ్యం : రా.10.31-12.05
దు.ఉ.9.56-10.42, 2) మ.2.34-3.20
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో పలుకూడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు.

**మిథునం:**పొదుపు పథకాలు అవలంభిస్తారు. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

**కర్కాటకం :** మీ తొందరపాటుతనం వల్ల కాంట్రాక్టులు చేజారిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**సింహం:**ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి.

**కన్య :** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :**బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** దైవ సంబంధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఒకానొక బాధ్యతను పూర్తి చేసి బరువు దించుకుంటారు.

**మకరం:** అప్పు చేయడం, అప్పు ఇవ్వడం రెండు చేయకండి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కుంభం:**కార్యాలయంలో పనిభారం పెరిగినప్పటికి సమర్థతతో నిర్వహిస్తారు.

**మీనం :** ఆర్థికంగా లాభ పడకపోయినా మీ శ్రమను అధికారులు గుర్తిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వెలుగొండ సొరంగంలో చేరిన వరద నీరు

## ప్రాజెక్టు రెండో సొరంగంలో చిక్కుకుపోయిన 200 మంది కార్మికులు

## కార్మికులను సురక్షితంగా కొల్లం వాగు వద్దకు తరలింపు

## అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపిన అధికారులు

**పెద్దదోర్నాల, అక్టోబరు 29, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు సొరంగంలో పెను ప్రమాదం తప్పింది. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలతో నిర్మాణంలో ఉన్న రెండో సొరంగంలోకి అకస్మాత్తుగా వరద నీరు చేరడంతో అక్కడ పని చేస్తున్న 200 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. నీటి ప్రవాహం వేగంగా పెరగడంతో వెంటనే సమాచారం అందుకున్న అధికారులు రక్షణ చర్యలు చేపట్టి సురక్షితంగా వెలుపలకి తీసుకొచ్చారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు సమీపంలో వెలుగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. బుధవారం కార్మికులు పనిలో నిమగ్నమై ఉండగా ఒక్క సారిగా సొరంగంలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో లోపల ఉన్న 200 మంది కార్మోకులు బయటకు వచ్చే మార్గం లేక సొరంగంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ప్రాజెక్టు అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. సొరంగం లోపల ఉన్న వారిని గట్టిగా ధైర్యపరుస్తూ నియంత్రిత మార్గంద్వారా సొరంగంలో చిక్కుకున్న కార్మికులందరిని కృష్ణానది సమీపంలోని కొల్లంవాగువద్దకు సురక్షితంగాచేర్చారు. వారంతా క్షేమంగా ఉన్నారని, వెలిగొండ ప్రాజెక్టు ఇఇ కృష్ణారెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా వారిని కట్టుదిట్టంగా అక్కడ నుండి ప్రత్యేక బోట్ల ద్వారా శ్రీశైలానికి తరలించారు.

# అర్హత ప్రక్రియ మార్చడం సబబు కాదు..

>> అసిస్టెంట్ అధికారి (ఎంఐఏవో) అభ్యర్థన మేరకు అర్హతలో సవరణలు తీసుకు వచ్చింది. బీఎస్సీ (బీజెడ్‌సీ) లేదా బీఎస్‌సీ, ఎంఎస్సీలో హార్టికల్చర్‌ను ఒక సబ్జెక్ట్ చదివిన వారు, 10+2తో ఒక సంవత్సరం హార్టికల్చర్ డిప్లొమో, బీఎస్సీ (అగ్రి) చేసినవారు, తదితరులను రాత పరీక్షకు అనుమతించింది.2020 జూన్‌లో రాత పరీక్షకు 5 రోజుల ముందు ఏపీ హార్టికల్చర్ సబార్డినేట్ సర్వీసు నిబంధనలను ప్రభుత్వం సవరించింది. తద్వారా గతంలో ఇచ్చిన అర్హతల సడలింపును రద్దు చేశారు. దీని వల్ల ప్రభావితులైన అభ్యర్థులు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు జీవి శివాజీ, వై. మల్లికార్జునరెడ్డి, ఆర్. హరీష్‌కుమార్ వాదించగా, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కల్యాణ్ చక్రవర్తి వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలూ విన్న న్యాయమూర్తి, చట్టపరమైన నిబంధనలు లేనప్పుడు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టవచ్చని స్పష్టత నిచ్చారు. 'ప్రస్తుత వ్యాజ్యాల విషయంలో 2020 జనవరి 10న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హతల్లో సవరణ చేస్తూ 2020 జూన్‌లో తెచ్చిన నిబంధనలను అంతకు ముందు ఇచ్చిన నోటిఫికేషన్‌కు వర్తింపచేయడం సముచితం కాదు' అని తీర్పులో పేర్కొన్నారు.

# వారంలో మళ్లీ చర్చలు

>> నిర్ణయం ద్వారా ఒక జిల్లాకు పరిమితం చేయాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజల అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. వీటిపై బుధవారం మరోసారి సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం ఇదే అంశంపై చర్చించింది. సిఎం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనికోసం అభిప్రాయ సేకరణ తీసుకుని పూర్తి నివేదికను సమర్పించాలని అభిప్రాయపడింది. గుంటూరు జిల్లాలోని చుందూరను బాపట్లఓ విజయవాడలో కలిసిపోయిన గన్నవరం, పెనుమలూరు నియోజకవర్గాలను కృష్ణాజిల్లాలో కలపడంపట్ల ఈ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి, అలాగే గిరిజన జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని అభిప్రాయ పడ్డారు. అలాగే బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రులు ప్రతిపాదించారు. బుధవారం సమావేశంలోనూ ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. గూడూరు రెవెన్యూ డివిజన్‌ను నెల్లూరులో కలపాలని ప్రతిపాదించారు. గతంలో ఒక నియోజకవర్గంలోని మండలం పరిధిలో ఉన్న గ్రామం మరొక నియోజకవర్గంలోకి వెళ్లిందని, దీనివల్ల అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడ్డాయని భవిష్యత్‌లో అలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నిర్ణయించినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం అనంతరం బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల తలెత్తిన ఇబ్బందులపై చర్చించి సరిదిద్దాలని నిర్ణయించామని తెలిపారు. విభజన హామీలకు అనుగుణంగా జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, వాటిపై చర్చించామని తెలిపారు. వచ్చేవారంలో మరోసారి సమావేశం అయిన తరువాత పూర్తిగా నివేదిక ఇస్తామని మంత్రి తెలిపారు.

# పిపిపి విధానంపై ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని.. అది చట్టవిరుద్ధం అయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని హై కోర్టు స్పష్టం చేసింది. టెండర్ ప్రక్రియను అడ్డుకుంటూ ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు క్లారిటీ ఇచ్చింది. థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలని పిటిషనర్ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది.కౌంటర్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి మరికొంత సమయం ఇచ్చింది. హైకోర్టు. తదుపరి విచారణని నాలుగు వారాలకు న్యాయస్థానం వాయిదా వేసింది. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 590ని సవాల్ చేస్తూ తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కొర్రా వసుంధర హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. హైకోర్టులో వేసిన పిల్‌పై ఇవాళ విచారణ జరిగింది. ఈ వ్యాజ్యంపై పిటీషన్ తరఫున హైకోర్టులో సీనియర్ న్యాయవాది శ్రీరాం, మరో న్యాయవాది అశోక్ రాం వాదనలు వినిపించారు. టెండర్లు ఖరారు చేయకుండా స్టే ఇవ్వాలని న్యాయవాదులు అభ్యర్థించారు. న్యాయవాదుల అభ్యర్థనని తిరస్కరించింది హైకోర్టు.

# అమరావతి రైతులకు ప్లాట్‌ల కేటాయింపు రిజిస్ట్రేషన్లపై అసత్య ప్రచారం చేస్తున్నారు

- తుదిదశకు చేరిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- రాబోయే నాలుగు నెలల్లో ప్లాట్ ల కేటాయింపు మొత్తం పూర్తి చేస్తాం
- సచివాలయంలో మీడియాతో మంత్రి నారాయణ

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని రైతులకు ప్లాట్ ల కేటాయింపు,రిజిస్ట్రేషన్ల పై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు.. .రైతులను ,ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు...రాబోయే నాలుగు నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్ లతో పాటు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేసారు మంత్రి.. సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.అమరావతి విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని అన్నారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ,2014 19 మధ్య కాలంలో,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్ ల కేటాయింపు,రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహ మీడియా ముందు వివరించారు మంత్రి నారాయణ. అమరావతి కోసం భూసమీకరణ కింద మొత్తం 30,635 మంది రైతుల నుంచి 34,911.23 ఎకరాలను సీఆర్డీఏ ద్వారా తీసుకోవాలని నిర్ణయించామన్నారు.. వీటిలో ఇప్పటివరకూ 29,644 మంది రైతులకు సంబంధించిన 34,192.19 ఎకరాలకు ప్లాట్ ల కేటాయింపు పూర్తయిందన్నారు...గత టీడీపీ ప్రభుత్వంలోనే 26,197 మంది రైతులకు సంబంధించిన 31,003.38 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తి కాగా...కూటమి ప్రభుత్వం వచ్చిన ఇప్పటివరకూ 2727 మంది రైతులకు సంబంధించిన 3188.81 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు...ఇంకా 991 మంది రైతులకు సంబంధించిన 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు..వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం,లంక భూములు,కోర్టు కేసులు,పీఓటీ కేసులు,12 సెంట్ల లోపు ఉన్న భూములు ఉన్నాయన్నారు. ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగంగా జరుగుతుందని మంత్రి తెలిపారు...మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా....ఇప్పటివరకూ 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్ లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని మంత్రి నారాయణ తెలిపారు..ఇంకా 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు...వీటిలో కోర్టు కేసులున్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు,ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు,వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు,పీఓటీ కుసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు,దేవాదాయ శాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు,లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు,ఎస్ ఆర్ ఐలు 210 మందికి చెందిన 444 ప్లాట్లు ఉన్నాయి...ఆయా పెండింగ్ ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.



## వైఎస్సార్సీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి సిబిఐ కోర్టులో ఊరట

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి సీబీఐ కోర్టులో ఊరట లభించింది. లండన్ పర్యటనపై సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు డిస్మిస్ చేసింది. తన పెద్ద కుమార్తెను చూసేందుకు ఇటీవల వైఎస్ జగన్ లండన్ వెళ్లారు. అయితే బెయిల్ షరతులను ఉల్లంఘించారని, అలాగే తన సొంత ఫోన్ నంబర్‌ను వెల్లడించలేదని సీబీఐ పిటిషన్ చేసింది. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో మూడు సార్లు జగన్‌కి కాల్ చేసినా నెంబర్ పని చేయలేదని పిటిషన్‌లో తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే పని చేయని నెంబర్ ఇచ్చారని సీబీఐ వాదనలు వినిపించింది. అయితే ఈ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. జగన్ తన కుమార్తెను కలిసేందుకు లండన్ వెళ్లారు. 10 రోజుల పాటు లండన్ టూర్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. ఎప్పటిలాగే బెయిల్ షరతుల్లో భాగంగా తాను అందుబాటులో ఉండే మొబైల్ ఫోన్‌నంబర్‌ను కూడా సీబీఐకి ఇచ్చారు. గతంలో ఇచ్చిన మొబైల్ నంబర్, ఈసారి ఇచ్చిన నంబర్‌కూ మధ్య వ్యత్యాసం ఉండటంతో సీబీఐ దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

# విద్యుత్ సరఫరా వ్యవస్థ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

## ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

**విశాఖపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. బుధవారం కోనసీమ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పృథ్వీతేజ్ ఇమ్మడి విద్యుత్ పునరుద్ధరణ చర్యల పురోగతిని వివరించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్ సాలు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు వంటి అవసరమైన సామగ్రి, సిబ్బందిని ముందస్తుగా అందుబాటులో ఉంచడం వలన పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఏపీఈపిడిసిఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్వయంగా పరిశీలిస్తూ, తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలన్నిటిలో పర్యటించి త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణ పూర్తిచేసేందుకు సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తున్నారు. అమలాపురం డివిజన్ పరిధిలోని ఉప్పలగుప్తం, ఐనవోలు, అమలాపురం సబ్‌స్టేషన్లను సందర్శించి, జరుగుతున్న పునరుద్ధరణ పనులను సమీక్షి ంచారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై కోనసీమ జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎండీ పాల్గొని పునరుద్ధరణ చర్యల స్థితిని తెలియచేసారు. మొంథా తుఫాన్ ప్రభావానికి సంస్థ పరిధిలోని 11 సర్కిళ్లలో 10 కోట్ల 47లక్షల నష్టం సంభవించిందని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. 7,973 మంది విద్యుత్ సిబ్బంది 523 బృందాలుగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రధానంగా ఎక్కువ నష్టం జరిగిన కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 13 టౌన్లకు 13, 67 మండలాలకు 67, 1,234 గ్రామాలకు 1,059, 13,56,415 సర్వీసు కనెక్షన్లకు 13,02,948, 33కెవి సబ్ స్టేషన్ల 255 కు 255, 33కెవి ఫీడర్లు 192 కి 192, 11కెవి ఫీడర్లు 1,147 కి 1,125, 33కెవి లైన్లు 5.43 కిలోమీటర్లకు 4.43, 11కెవి లైన్లు 76.1 కిలోమీటర్లకు 43.7, ఎల్ టి లైన్లు 45.6 కిలోమీటర్లు 29.8, 33కెవి స్తంభాలు 47 కి 46, 11కెవి స్తంభాలు 1,128 కి 806, ఎల్ టి స్తంభాలు 1,226 కి 703, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు 25,719 కి 9,367, వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు 17,700 కు 16,822 సర్వీసులను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. రేపటికి విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసే దిశగా అన్ని బృందాలు సమష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స ఫార్మర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సంబందించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు కార్పొరేట్ ఆఫీసు 8331018762, కాకినాడ 9490610856, పెద్దాపురం 9493178728, జగ్గంపేట 9490610097, అమలాపురం 9490610101, రామచంద్రపురం 9493178821, నరసాపురం 7382050943, నరసాపురం 9490610151, భీమవరం 9490610143, సంభందిత సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

# ఇసుక అక్రమ మైనింగ్ కేసు

## సుప్రీంకోర్టులో మరోసారి విచారణ వాయిదా

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్ కు వ్యతిరేకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుచ్చింది. ఈ మేరకు సదరు సంస్థపై దాదాపు రూ.18 కోట్ల జరిమానాను విధించింది. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ 2023 మే 15న జేపీ వెంచర్స్ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. అయితే, మరోసారి ఆ పిటీషన్‌పై ఇవాళ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే, ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం కేసులో తదుపరి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేసింది. కాగా, సెప్టెంబరు 3న జరిగిన విచారణలో భాగంగా జేపీ వెంచర్స్‌పై గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన ఎన్జీటీ రూ.18 కోట్ల జరిమానా నగదును 2 వారాల్లో డిపాజిట్ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్జీటీ జరిమానాపై గతంలో విధించిన స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. నాగేంద్రకుమార్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. అక్రమ ఇసుక తవ్వకాలపై కొంతకాలంగా నాగేంద్రకుమార్ న్యాయ పోరాటం చేస్తున్నారు.

# ఫలించిన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల న్యాయపోరాటం

**విజయవాడ,అక్టోబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఆర్టీ నంబరు 1207 కింద నియమితులైన 1200 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల సుమారు 14 ఏళ్ళ న్యాయపోరాటం ఫలిచింది, వారి నియామకాలను కొనసాగించాలంటూ సుప్రీంకోర్టులో ఆదేశాలు జారీ చేసిందిజ జులై 20న జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా నియమితులైన వీరంతా ఆ తర్వాత కోర్టులు జారీ చేసిన ఉత్తర్వుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో దాదాపు 11 ఏళ్ళ ఉద్యోగ అనుభవం సాధించిన వీరిని రాష్ట్రప్రభుత్వం మానవతా ధృక్పథంతో 2013లో మళ్ళీ కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకుంది. దీనిపై దాఖలైన పిటీషన్‌లపై విచారణ జరిపిన జస్టిస్ అరవింద్‌కుమార్ జస్టిస్ ఎన్వి అంజారియాలతో కూడిన ధర్మాసనం ఆ నియామకాలను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2,324 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం 2002 జులై 20న అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నియామకాలను సవాల్ చేస్తూ దాఖలైన కేసులను విచారించిన హైకోర్టు వాటన్నింటినీ కొట్టేస్తూ 2003 సెప్టెంబరు 111న ఉత్తర్వులు జారీ చేసింది. మళ్ళీ మెరిట్‌లిస్ట్ తయారుచేసి కొత్తగా నియామకాలు చేపట్టాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టేటస్‌కో సుప్రీంకోర్టు విధించింది తర్వాత 2011 వరకు కేసుపై విచారణ కొనసాగించింది. దాంతో 2002 నోటిఫికేషన్ ప్రకారం నియమితులైన వారు 2011 వరకు కొనసాగారు. అయితే వీరి నియామకాలను కొట్టేస్తూ 2003లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ సుప్రీంకోర్టు 2011 ఆగస్టు 9న తీర్పు వెలువరించింది. దీంతో ఈ 1200 మంది ఉద్యోగాలు కోల్పోయారు. సుదీర్ఘకాలం ఉద్యోగాల్లో పనిచేసిన అనుభవంతో పాటు ఉద్యోగార్హత వయస్సు మీరిన నేపథ్యంలో మానవతా ధృక్పథంతో తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ వారు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2013 ఆగస్టు 19న జీవోఆర్టీ నంబరు 1207 ప్రకారం మానవతా ధృక్పథంతో వీరందరినీ కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకొంది. అయితే 2002 నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన పరీక్షల్లో వీరికంటే ఎక్కువ అర్హత మార్కులు సంపాదించిన అభ్యర్థులు ఈ నియామకాలను సవాల్ చేస్తూ ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. దాంతో హైకోర్టు వీరికంటే ఎక్కువ మెరిట్ ఉన్నవారిని తీసుకొని, తక్కువ మెరిట్ ఉన్నవారిని తొలగించాలని ఆదేశించింది. దాన్ని సవాల్ చేస్తూ జీవో ఆర్టీ నంబరు 1207 కింద నియమితులైన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ జీవో కింద జరిపిన నియామకాలను ఆమోదించాలని సుప్రీంకోర్టుకు విన్నవిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. అలాగే 2002 నోటిఫికేషన్ ప్రకారం పరీక్ష రాసినవారు మెరిట్ ప్రాతిపదికన మళ్ళీ ఉద్యోగాలు క్లెయిమ్ చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించింది. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేస నియామకాలకు రక్షణ కల్పించింది.

# సీనియర్ సైంటిఫిక్ అధికారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్ర లేబొరేటరీలో సీనియర్ సైంటిఫిక్ అధికారిగా పనిచేస్తున్న కె.యాదగిరిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారులుగా డ్రగ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయ జెడీని, మరో సీనియర్ సైంటిఫిక్ అధికారిని నియమించింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలను యాదగిరి ఎదుర్కొంటున్నారు. 2021 అక్టోబరు 20న ఒంగోలుకు చెందిన కె.శ్రీనివాస్, ఇతర ఫార్మాసిస్టుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం శాఖా పరమైన విచారణకు ఆదేశించింది. పదోన్నతికి విచారణ అడ్డంకిగా మారుతోందని యాదగిరి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నిర్దేశిత సమయంలో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## రాష్ట మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హసీం బేగ్





**విజయవాడ, అక్టోబరు 29 ,ప్రభాతవార్త** రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ హసీం బేగ్ బుధవారం భాధ్యతలను స్వీకరించారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సాహెబ్, వీసీ మరియు ఎండి యాకూబ్ భాషా, ఏపీ సచివాలయం డిప్యూటీ సెక్రటరీ సుధాకర్, స్టేట్ మైనార్టీ అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం 156వ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలపై ఎజెండాలో చర్చించి ఆమోదం తెలిపినట్లు డాక్టర్ హసీం బేగ్ పేర్కొన్నారు.

# సత్యసాయి జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించడంలో తప్పేమిటి: హైకోర్టు

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని కూటమి సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ఈ ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించడంపై ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య.. ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులను ఇలా మతపరమైన కార్యక్రమాలకు మళ్లించడానికి వీలు లేదంటూ ఆ పిటిషన్‌లో వెంకట సుబ్బయ్య స్పష్టం చేశారు. ఈ పిల్‌పై బుధవారం ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. సత్యసాయి జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తే తప్పేముందని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. సత్యసాయి ట్రస్ట్ ద్వారా మూడు జిల్లాలకు తాగు నీరు అందించారంటూ పిటిషనర్‌కు హైకోర్టు గుర్తు చేసింది. అంతే కాదు.. ఆసుపత్రులు, విద్యాసంస్థలు సైతం స్థాపించి ప్రజలకు సేవ చేస్తున్నారని పిటిష నర్‌కు ఈ సందర్భంగా హైకోర్ట్ వివరించింది. ఇలాంటి విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేమందంటూ పిటిషనర్‌ను హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. ఈ పిల్ ఉపహరించుకోవాలని పిటిష నర్‌ను హైకోర్టు ఆదేశించింది. లేకుంటే ఖర్చులు విధిస్తామని పిటిషనర్‌ను హెచ్చరించింది. ఈ నేప థ్యంలో తన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పిటిషనర్ వెంకట సుబ్బయ్య వెంటనే ఉపసంహరించుకున్నారు.

## బెంగుళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ జగన్ ఫేక్ ప్రచారాలు : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,అక్టోబర్29,ప్రభాతవార్తప్రతినిధి:** విపత్తుల సమయంలో మానవత్వం ఉన్న ఎవరైనా ప్రజలకు సాయం చేస్తారని వైకాపా అధ్యక్షుడు జగన్ మాత్రం ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తూ విష రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెంగుళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ దొంగ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాకినాడ జిల్లా కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు లోని పునరావాస కేంద్రంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడ ఉన్న వారికి ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకున్నాం. వదంతులు నమ్మొద్దు. ఇది ప్రజల ప్రభుత్వం.

## తుఫాను బాధితులకు రోజుకు 10వేల ఆహార పొట్లాలు

**విజయవాడ,అక్టోబరు 29, ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఆత్మకూరు 'అక్షయపాత్ర' నుంచి రోజుకు 10 వేల ఆహారపొట్లాలు అందిస్తున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట సెంట్రల్ రీజియన్ ఉపాధ్యక్షుడు విలాసదాస తెలిపారు.

గుంటూరు జిల్లా మంగళగిరి అక్షయపాత్రలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వాధికారులు, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్, అన్న క్యాంటీన్ నెట్‌వార్క్ ద్వారా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఆహార పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు.

# తిరుమల సమాచారం

## నేడు మలయప్పకు పుష్పయాగం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో (నేడు) గురువారం పుష్ప యాగమహోత్సవం ఆగ´మోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు బుధవారం సాయంత్రం అంకురార్పణ శాస్రోక్తంగా చేపట్టారు. నేటి ఉదయం ఆలయంలో ఉదయం రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి సంపంగి ప్రాకారంలోని కల్యాణమండపానికి వేంచేపు చేస్తారు, అక్కడ విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1గంట నుండి చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆరురకాల ఆకులతో 12రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయమాడవీదుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో నేడు ఆర్జితసేవలు తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి. వేకువజామున తోమాల, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు.

## శాస్రోక్తంగా కాలభైరవ హోమం



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ప్రముఖ శైవాలయం తిరుపతి కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా బుధవారం కాభైరవహోమం జరిపించారు. యాగశాలలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పూజ, అష్ట భైవరహోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. నేటి నుండి నవంబర్ 7వతేదీ వరకు చండీహోమం జరుగుతుంది. గృహస్థ భక్తులు 500 రూపాయలు చెల్లించి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. కార్తీకమాసాన నెలరోజులపాటు హోమాలను ఏకాంతంగా జరిపించడం సంప్రదాయం.

## ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాలు

### - ఆధ్యాత్మికత పెంపొందించేలా టిటిడి కార్యాచరణ



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో, ఎస్సీ ఎస్టీకాలనీల్లో మతమార్పిడులను అరికట్టేందుకు, ఆధ్యాత్మికభావం పెంపొందించేందుకు ఆలయాలు నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఐదువేల ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ప్రజల్లో ఆధ్యాత్మికచింతన పెంపొందేలా,, భక్తిభావం కలిగించేలా ఆలయాలు అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదే విషయంగా టిటిడికి సూచనలు చేయడంతో ఎస్సీ, ఎస్టీ ఆలయాల్లో భగవంతుని ఆలయాలను నిర్మించాలని టిటిడి ధర్మకర్తలమండలి తీర్మానించింది. శ్రీవాణి నిధులతో బాటు దాతల సహకారంతో ఈ ఆలయాల నిర్మాణం చేపట్టనుంది. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్‌ద్వారా కూడా నిధులు రెండువేలకోట్లరూపాయలవరకు ఆదాయం చేరింది. ఈ నిధులతో దేశవ్యాప్తంగా టిటిడి ఆలయాలు నిర్మిస్తోంది. చాలావరకు కొన్ని ప్రాంతాల్లో ఆలయాలను నిర్మించి ధూపదీపనైవేద్యాలకు నిధులు కేటాయిస్తోంది. ఇప్పుడు ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఆలయాలు నిర్మించి హిందూ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తంచేయడమేగాక మతమార్పిడిలను పూర్తిగా అరికట్టాలనే సదుద్దేశ్యంతో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. దేశవ్యాప్తంగా ఆలయాలు ఇప్పటికే నిర్మించింది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టిటిడి చర్యలు చేపట్టింది.


## అలిపిరి టోల్‌రోడ్డు గుంతలమయం

### కుండపోత వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** మొంథా తుఫాన్ ప్రభావంతో నాలుగురోజులు కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి టోల్‌గేట్ వద్ద రోడ్డు గుంతలమయమైంది. రోడ్డుపై కంకర తేలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు దిగుతుండటంతో మరమ్మతులకు గురవుతున్నాయి. అలిపిరి టోల్‌గేట్‌లో 12 వరుసలు ఉన్నాయి. ఈ వరుసల్లో 9,10,11 వరుసల రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. యాత్రికుల వాహనాలు వెళ్ళే ఈ మార్గంలో రోడ్లు గుంతలమయంగా మారడంతో వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## శేషాచలంలో 'హెమిఫిల్లోడాక్టిలస్ ఎస్పీ.ఎన్‌ఐవి' అరుదైన బల్లి



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅడవులు వైవిధ్యంగా ఎన్నో రకాల జంతువులు, వృక్షజాతులు, ఔషధమొక్కలకు నిలయంగా ఉంది. ఇప్పుడు జీవావరణం పరిధిలో శాస్త్రవేత్తలు "హెమిఫిల్లోడాక్టిలస్ ఎస్పీ.ఎన్‌ఐవి" అరుదైన బల్లి జాతిని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జడ్‌ఎస్‌ఐ)కోల్‌కత్త శాస్త్రవేత్తల బృందం తిరుమలకొండపై పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం సమీపంలోని దట్టమైన శ్రీగంధం వనంలో ఈ బల్లిని కనుగొన్నారు. ఈ కొత్తబల్లిజాతి పలుచగా తొండను పోలి ఉందని పేర్కొన్నారు. చందనపు చెట్టు బెరడుక్రింద నివసిస్తున్న సమయంలో దీన్ని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ ఈ జాతికి చెందిన మరో మల్లి హెచ్ అరకు యెన్సిస్ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని తెలిపారు. ద్వీపకల్పంలో వీటి దగ్గరి జాతులతో పోల్చినపుడు జన్యువైవిధ్యం కలిగిఉంటాయని వివరించారు.

### రెండోఘాట్‌లో ద్విచక్రవాహనాలు ఢీ!

**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** అసలే బలమైన వర్షాలు కురిసి రోడ్డు పటిష్టత లేకపోయినసమయంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో బుధవారం ఉదయం ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. తిరుపతికి చెందిన చంద్రమౌళి, చంద్ర ఇద్దరూ తిరుమలలో వ్యాపారాలు చేసుకుని జీవనంసాగిస్తున్నారు. బుధవారం ఉదయం తిరుమలకు వస్తుండగా వినాయకుని గుడి దాటిన తరువాత ఘాట్‌లో మలుపువద్ద అదుపుతప్పి తొలుత చంద్రమౌళి పడ్డాడు. ఆ వెనుకనే వచ్చిన చంద్ర ద్విచక్రవాహనాన్ని ఢీ కొని క్రిందపడ్డాడు. వెనుక వచ్చిన వాహనదారులు పరిస్థితిని గమనించి వెంటనే అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు.

వార్త

మనం స్వీకరించే ఆనందం కన్నా మరొకరికి ఆనందం పంచడం వల్ల మనకు మరింత ఆనందం లభిస్తుంది.

-ఎ.బెర్గ్

# మరో అగ్ని పరీక్ష!

ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ అంశంల అపప్రథ మూటగట్టుకున్న ఎన్నికల సంఘంఅన్ని ఆటంకాలు, అనుమానాలను, అవమానాలను తట్టుకొని తాము నడిచే దారే అన్ని రాష్ట్రాలకు శ్రీరామరక్షగా నిరూపించుకోబోతోంది. దీనిపై విపక్షాలు సుప్రీంకోర్టు కెక్కడం, దానాదీనా అన్ని సలహాలు సూచనలను మార్గదర్శకాలను అనుసంధానం చేసుకుంటూ బీహార్‌లో 65 లక్షల మంది అన్య ఓటర్లను జాబితా నుంచి తొలగించడంలో ఎన్నికల సంఘం కృతకృత్యురాలైంది. నవంబరు 4 నుంచి దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాల్లో ఓటర్ల ముమ్మర జాబితా సవరణ (ఎస్ఐఆర్) చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెల్లడించారు. ఆయన నేతృత్వంలో ఇది అతికీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా జాబితా సర్వే వెనుక ప్రత్యేక అజెండా ఉంటుంది. కనుక అలాంటి సర్వేను తాము అంగీకరించబోమని, కాంగ్రెస్ తృణమూల్ కాంగ్రెస్ తమిళనాడులోని డిఎంకె పార్టీలు పూర్తిగా నిషేధించాయి. ఇప్పటికిప్పుడు అత్యవసరంగా ప్రత్యేక ముమ్మర సర్వే చేపట్టాల్సిన అవశ్యకత ఏముందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజల హక్కులను దోపిడీ చేసే ప్రయత్నమే ఇదని, ఇప్పటికే బీహార్‌లో విస్తృత జాబితా సవరణ కార్యక్రమాన్ని అసంబద్ధంగా చేసిందని వాపోయింది. తుది జాబితా కూర్పులో పారదర్శకత పాటించలేకపోయిందని విపక్షాలు ఎద్దేవా చేశాయి. ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టే ముందు రాజకీయ పార్టీలను చర్చలకు పిలవాల్సి ఉందని అలా చేయకపోవడం వల్లనే అపోహలు తలెత్తాయని సుప్రీంకోర్టు కూడా గట్టిగాచెప్పిచూసింది. అనంతరం సజావుగానే జరిగిందని చెప్పాలి. విమర్శల దాడినుంచి బయటపడిన ఎన్నికల కమిషనర్'ఎస్ఐఆర్-2' కార్యక్రమాన్ని ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలే కాకుండా అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఓటర్ల ముమ్మర సవరణ చేపట్టనున్నారు. ఈసారి గతంలో ఉన్నటువంటి గత అనుభవాలతో ముందుకెళ్లేందుకు ఇ.సి సిద్ధమైంది. మునుపటి మాటేమో కాని సుప్రీంకోర్టు మందలింపులు విన్నాకఎన్నికల కమిషన్ మరింత జాగ్రత్తగా వ్యవహరించినట్లు నిరూపితమైంది. అయినా ఎందుకో విపక్షాలకు శంక వదల్లేదు. ప్రధానంగా బిజెపియేతర పార్టీల పాలనలో ఉన్నతమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అంగీకరించే పరిస్థితిలో లేవు. రెండో విడత సజావుగా జరిపేందుకు ఎన్నికల కమిషన్ ప్రతి ఇంటికీ తనిఖీకి బూత్ లెవెల్ అధికారులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. కనీసం మూడుసార్లు ఈ పరిశీలన ఉంటుంది కనుక సందేహించాల్సిన అవసరం ఉండదు. నవంబరు, డిసెంబరులలో నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, అసోంలలో వచ్చే యేడాది శాసన సభ ఎన్నికల జరగుతున్నాయి. ఇదే సమయంలో అసోంలో విడిగా జాబితాల ముమ్మర సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఇసి ప్రకటించడాన్ని చూసే మరోకొత్త అనుమానం రాకతప్పదు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్‌లో కేంద్రంలోని ఎన్డీయేయేతర పార్టీల పాలనలో ఉన్నాయి. ఆది నుంచి కేంద్రప్రభుత్వం ఏకార్యక్రమాన్ని చేపట్టినా సహకరించని రాష్ట్రాలుగాపేరుబడ్డాయి. అదే విధంగా కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలమాట వినేందుకు సిద్ధంగా లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీని తమ విద్యా విధానంలో చూపిస్తున్నారనే ఆరోపణతో కేంద్రం చర్యలను వ్యతిరేకిస్తున్నారు. ఇక అసోం విషయంలోపౌరసత్వం వంటి సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ ఆ విషయాన్ని ఇ.సి తమ తలకెత్తుకోవడం లేదు. పౌరసత్వం చట్టంలో విడిగాఉండే నిబంధనమాత్రమే అసోం రాష్ట్రానికి వర్తింపు చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ వివరించారు. కనుక ఈ అంశంలో పెద్ద అపోహలు తలెత్తారు. అసోం ఎన్డీఏ పాలనలో ఉన్నా అక్కడున్న పౌరసత్వ సమస్యలు వేరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంతవరకు 8సార్లు ఎస్ఐఆర్ చేపట్టగా ప్రస్తుతం9సవరణ జరుగుతోంది. ఇంతక్రితం బీహార్ జాబితా విషయంలో తప్పులు, లోపాలులేని జాబితాను రూపొందించగలిగామన్న సంతృప్తిని కమిషన్ వ్యక్తంచేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరునూ వదులుకోమనీ, అనర్హులైన వారిని వదిలిపెట్టబోమని ఎన్నికల కమిషన్ నిర్ధారిత లక్ష్యంతో ముందుకు కదలడం ఇకపై ఎలాంటి బేషజాలకు పోకుండా వ్యవహరించడం వలనఎన్నికల కమిషన్‌కు అభినందనలు పొందే అవకాశం ఉంది. ఎస్ఐఆర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి వ్యతిరేక కుట్రగా తమిలనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అభివర్ణించారు. ఎన్నో మార్పులు చేర్పులతో చేప్టిన జాబితా సవరణను కూడా ఆయన అంగీకరించినట్లు లేదు. కేవలం పరస్పర అనుమానాల కారణంగానే విపక్షాలు, ఎన్నికల కమిషన్ ఏకాభిప్రాయానికి రావడం లేదని సుప్రీంకోర్టు ఏనాడో అభిప్రాయపడింది. ఇంతపెద్ద కార్యక్రమాన్ని నిర్వహించదలచినప్పుడు విపక్షాలను విశ్వాసంలోఎకి తీసుకోవాల్సిన ఆవశ్యకత, బాధ్యతను ఎన్నికల కమిషన్ గుర్తించాలి. రాజ్యాంగ బద్ధమైన బాటలో తమవిధులు తాము నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ ఆత్మ విశాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోపభూయిష్ట విధానాలుంటే సరైన సమయంలో సరైన విధానంలో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంలో విపక్షాలు చొరవతీసుకోవాలే తప్ప అయినదానికీ, కాని దానికీ ఒంటికాలి మీదలేవటం సరైనపద్ధతికాదని తెలుసుకోవాలి.

ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యాసనకు మూడు ముఖ్య స్తంభాలు.



ఎమర్సన్

ఇతరుల్ని కష్టపెడుతూ నువ్వు కష్టపడకపోవచ్చు. కానీ సంతోష పెట్టేటప్పుడు మాత్రం నువ్వు తప్పక సంతోషంగా ఉంటావు.



సిసిరో

# ప్రజావాక్కు



## డిఏ బకాయిల ఉత్తర్వులను సవరించాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు 2024 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డిఏను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జి.వో.ఎంఎస్.నెం.60జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల్లో పెరిగిన 3.64శాతం కొత్త డిఏను అక్టోబర్ 2025 జీతంతో కలిపి చెల్లిస్తారు. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఇవ్వాల్సిన డిఏ బకాయిలను సదరు ఉద్యోగిపదవీ విరమణ సమయంలో చెల్లిస్తారు. ఈ కొత్త డిఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డిఏ 37.31శాతం అవుతుంది. మొత్తం నాలుగు డిఏ బకాయిలు ఉండగా ప్రభుత్వం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చింది. ఆ ఒక్క డిఏ బకాయిలు జనవరి 24 నుంచి సెప్టెంబర్ 25 వరకు చెల్లించాల్సినవి పదవీవిరమణ అనంతరం చెల్లిస్తామని చెప్పడందారుణం. చనిపోయినఉద్యోగికిఅయితే వారసులకు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనడం మరీ దారుణం.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## యువతకు రాజకీయ అవకాశాలు

**ఎంఎల్ఏ** ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు పరిమితిని 25నుండి 21సంవత్సరాలకు తగ్గించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదన ఎంతో సరికొత్త ఆలోచన. ఇది యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించే దిశగా తీసుకున్న ప్రగతిశీలమైన అడుగు. నేటి యువత సమాజంపై అవగాహన కలిగిన వారు, సాంకేతికంగా నైపుణ్యం ఉన్న వారు. వారికి ప్రజాప్రాతినిధ్యం లభిస్తే, ప్రభుత్వ వ్యవస్థలో కొత్త ఉత్సాహం, సృజనాత్మకత, పారదర్శకతను తీసుకురాగలరు. ఈప్రతిపాదన అమలులోకి వస్తే, భారత దేశ రాజకీయ వ్యవస్థలో యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే అనేక దేశాల్లో యువతను శాసనసభల్లోకి ప్రవేశపెట్టే విధానాలు ఉన్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

**తిరుపతి** తిరుమల ఘాట్ రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి పెద్ద బండ రాళ్ళు కిందికి పడినవి. ఈఘాట్ రోడ్‌లో రోజూ బస్సులు లక్షల ప్రయాణీకుల్నితీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణుల అభిప్రాయం ప్రకారం చర్యలు చేపట్టాలి.

- బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

## ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

**అమెరికాలో** నున్న 50రాష్ట్రాలలో అక్కడిప్రజలు లక్షల సంఖ్యలో వీధులలోకి వచ్చి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ తమ నిరసనను తెలియజేయడం బహుశ అమెరికాచరిత్రలో ఇంతకు ముందెప్పుడు జరిగి ఉండదేమో. దాదాపు ఏడినిమిది యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పానని తనకు తానే ప్రశంసలు చేసుకుంటున్న ఆ పెద్దమనిషి తన దేశంలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న అలజడులను నివారించక లేకపోవడం ఆశ్చర్యకరం. ఇజ్రాయెల్ గాజా, ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. రష్యా నుండి భారత్‌కు వచ్చే చమురు దిగుమతులనుఆపేశానన్నాడు. దీనిని భారత్ ధృవీకరించలేదు. ఇదొక అబద్ధం. అమెరికన్ కాంగ్రెసులో ఆయనపై అభిశంసన తీర్మానం పెట్టవచ్చును కదా. తగినంత సంఖ్యాబలం కన్సర్వేటివ్ పార్టీకి ఉన్నదేమో. చరిత్రలో నిలచిపోయేది చరిత్రకారులే కాదు, చరిత్ర హీనులు కూడా ఉంటారు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## సాదాబైనామా వర్తింప చెయ్యాలి

**2015లో** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 42 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనంచేయడం జరిగింది. 2020 అక్టోబర్, నవంబర్ నెలలో భూమి పాస్ బుక్ కానీ రైతులు, సదబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికీ, పాస్‌బుక్‌ల కోసం అప్లై చేసుకోమని అప్పటి ప్రభుత్వం చెపితే, మీ సేవలో కొన్నివేలమంది రైతులు, కొన్ని వేలఎకరాల భూమి పాస్‌బుక్‌లకోసం అప్లై చేసుకున్నారు. భూ భారతి వెబ్సైటులో అట్టి వివరాలు కూడా, ల్యాండ్ స్టేటస్‌లో నమోదు అయి ఉన్నవి. ఇప్పుడు కోర్టు స్టే ఎత్తి వేసిన పిదపెమో 42 గ్రామాల రైతులకు వర్తించదు, అని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. విలీనం ఐనా 42 గ్రామాలలోని, రైతుల వ్యవసాయ భూములకు కూడా సాధాబైనామా వర్తింపా చేయాలి.

-బీరం రాములు, వరంగల్

## నిప్పులేనిదే పొగ రాదు

నేపాల్, బంగ్లా, శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈజెన్‌జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి.

- భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదపు అంచున ప్రభుత్వ విద్య!

**తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తని ఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యం కల్పించాలి. గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పిం చాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపా ధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి.**

శ్రీశ్రీ కుమార్

ఒకప్పుడు బడి అంటే ప్రభుత్వ బడి, చదువు అంటే ప్రభుత్వ బడులలో చెప్పేదే చదువు. గత నాలుగు దశాబ్దాలలో ప్రభుత్వ రంగానికి సమాంతరంగా ప్రైవేట్, కార్పొరేట్ రంగాలలో పాఠశాలలు వెలిశాయి. అంతకు ముందు ప్రైవేటు పాఠశాలలను సేవా భావంతో నెలకొల్పితే తర్వాత రోజుల్లో స్థాపించడం వ్యాపారాత్మకమైనది. నేడు అది లాభసాటి వ్యాపారాల్లో ఒకటిగా వెలుగొందుతున్నది. దినదిన ప్రవర్ధమానమై ప్రభుత్వం ఇచ్చే ఉచిత చదువును కబళించింది. సంఖ్యాపరంగా చూస్తే ప్రభుత్వ బడుల సంఖ్యలో (24997) ప్రైవేట్ పాఠశాలలు సగానికి కూడా తక్కువ (11407) కానీ అడ్మిషన్ల పరంగా ప్రైవేటులో 60 శాతం విద్యార్థులు చదువుకొంటుండగా, ప్రభుత్వ బడులలో కేవలం 31 శాతం మంది చదువు నేర్చుకోవడం ప్రమాదకర సంకేతాలను ఇస్తున్నది. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో మిగిలిన శాతం విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి నానాటికి తీసికట్టు నాగంబొట్టు లాగుంది. ప్రభుత్వ పాఠశాలల ఉనికికి, మనుగడకు వాటి భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న పరిస్థితి నెలకొన్నది. అసలు జీరో అడ్మిషన్లున్న 1897 పాఠశాలలను గుర్తిందారు. పదిమందికన్నా తక్కువ విద్యార్థులను పాఠశాలలు 4325 ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. 250 నుండి 1000 లోపు విద్యార్థులు అడ్మిషన్ పొందిన పాఠశాలలు 2261 ఉండటం, వెయ్యికిపైగా విద్యార్థులున్న బడులు 26 ఉండడం ప్రభుత్వ విద్యకు ఆశా కిరణాలుగా ఉన్నాయి. ఒక రకంగా చెప్తే ఇవి ప్రభుత్వ విద్యకు ప్రాణం పోస్తున్నాయి అనవచ్చు. దాదాపు మూడున్నర లక్షలకు పైగా ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సమర్పించే న్యాస్ (నేషనల్ అచీవ్మెంట్స్ సర్వే) నివేదిక ప్రకారం 2021 లో 36వ స్థానంలో ఉండగా 2024లో అది 26వ స్థానానికి చేరింది. అంటే కొంత పురోగతి సాధించింది. అది విద్యార్థుల అభ్యసన స్థాయికి సంబంధించినవి. అంటే ఇంకా విద్యార్థుల్లో చదవడం రాయడం మామూలు లెక్కలు సాధించే స్థాయికి చేరలేకపోతున్నారు. చాలా దురదృష్టం ఏమంటే విద్యాశాఖ మంత్రులు కానీ సంబంధిత అధికారులు కానీ రాష్ట్రస్థాయిలో ఈ విషయమై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. చాలా తరచుగా డీఎస్సీలు, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేస్తున్నామని ప్రభుత్వం గర్వంగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కాదు కదా కనీస స్థాయిలో కూడా లేకపోవడం దారుణం. ఇంకా 20 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది టీచర్ల పదవీ విరమణ జరుగుతుండగా వారి స్థానాల్లో తిరిగి నియామకాలు జరగడం లేదు. దీంతో విద్యార్థులకు ఎంతో అన్యాయం జరుగుతున్నది. అదే ప్రైవేటు వ్యవస్థలో లేదా కార్పోరేట్ పాఠశాలల్లో ఎవరైనా రాజీనామా చేసినా మరి ఏ ఇతర కారణాలకైనా పాఠశాలకు హాజరు కాకపోతే వారి స్థానంలో కొత్తగా టీచర్లను తక్షణమే నియమించుకుంటారు. తద్వారా విద్యార్థులు ఆ సబ్జెక్టులో వెనుకపడకుండా యాజమాన్యాలు జాగ్రత్త వహిస్తాయి. ప్రభుత్వాలు ఈవిషయమై తమ క్యాలెండర్ లేదా తమప్రణాళిక, రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నియామకాలు చేస్తాయి. అయ్యవార్ల కోసం అమావాస్య ఆగదు. జరగవలసిన నష్టం అధికారులు అరికట్టలేరు. ఉచితంగా పుస్తకాలు అందజేసినా, యూనిఫామ్స్ ఇచ్చినా, మధ్యాహ్న భోజనం కల్పించినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడంలేదు. అభ్యసన స్థాయిలు కూడా రోజు రోజుకు తీసికట్టుగానే ఉంటున్నాయి. వీటిలో చదివే విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు. వారికి మరింత చేయూతనివ్వవలసిన బాధ్యత అందరి మీదఉంది. మొదట్లో సర్వశిక్ష అభియాన్, ఆ తర్వాత రాజీవ్ విద్యా మిషన్ ద్వారా చాలా బడులకు భవనాలు సమకూరినాయి. కానీ మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ సరఫరా నేడు అత్యవసరమైనాయి. ప్రభుత్వాలు ఎప్పుడు విద్య గురించి మాట్లాడినా ఒకాయన కంప్యూటర్ లిటరసీ, మరొకాయన డిజిటల్ ఎడ్యుకేషన్, ఇంకొకరు స్మార్ట్ బోర్డులు స్మార్ట్ తరగతి గదులు అంటూ ఊదరగొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. వీటి గురించి ఎవరూ పట్టించుకోరు. డిజిటల్ విద్య గురించి పెద్ద పెద్ద కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నారు. మౌలిక వసతుల గురించి ఎట్టి ఎంఓయూలు ఉండవు. అంటే ఇవన్నీ కేవలంప్రచార ఆర్భాటాలు మాత్రమే అనేది స్పష్టం. ఇక మూడవ తరగతినుండి ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధ నేర్పుతామంటున్నారు. ఎందుకు దానిపై ఇంత మోజు? కేవలం సాంకేతికత మీదనే ఆధారపడతారా? భవిష్యత్తులో సాంకేతికత అవసరబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యాశాఖ సిద్ధంగా ఉందా అనేది చర్చించుకోవాలి, సమీక్షించుకోవాలి. అందుకు తగిన వనరులను ఏర్పాటు చేసుకోవాలి. అదే నిజమైతే ఉపాధ్యాయ నియామకాలు ఎందుకుజరుపుతున్నట్లు? సిలబస్ పూర్తి చేయాల్సిన సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణల శిక్ష ఎందుకు? మంచి విద్యార్హతలు కలిగివున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి రోజురోజుకు విషమించడంపై తగిన సమీక్ష జరిగిదిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. రోబోలు తరగతి గదిని నియంత్రించలేవు. కంప్యూటర్లు పాఠం బోధించలేవు. అవి కేవలం బోధనోపకరణాలు మాత్రమేనని గుర్తించనంతకాలం మన విద్యా విధానం మెరుగుపడదు. సాంకేతికతను విచక్షణతో ఉపయోగించుకోవాలి. అంతేకానీ దానికి బానిస కాకూడదు. దానిపైనే పూర్తిగా ఆధారపడితే ఉపయోగం శూన్యం. సాంకేతిక పరిజ్ఞానం కేవలం సమాచార సేకరణకు సమీక్షలకు పనికి వస్తుంది కానీ తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధనను ప్రభావితం చేయలేదు. సాంకేతిక పరికరాల కొనుగోళ్ల మీద చేసే ఖర్చుపాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలపై చేస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనంచేకూరుతుంది. ఇక అనేక జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు లేరు. మండల శాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డైట్ కళాశాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ పదోన్నతి ద్వారా నింపితే ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంది. పాఠశాలల పైన ఆజమాయిషి లోపించింది. తనిఖీలు జరగడం లేదు. వృత్యంతర శిక్షణలు మొక్కుబడిగా సాగుతున్నాయి. నూతన విద్యా విధానంలో చేరుతున్నామో లేదో స్పష్టం చేయకపోగా మనకు ఒక విలక్షణమైన విద్యా విధానాన్ని రూపొందించబోతున్నట్లు ప్రకటించి ఉపాధ్యాయ లోకాన్ని ప్రభుత్వం మరింత గందరగోళంలో పడవేయడం జరిగింది. బోధన ప్రభావవంతంగా జరగడంలేదని, అరకొరగా సాగుతున్నదని అధికారుల అభిప్రాయం. అందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 20 వేల పోస్టులు ఖాళీగా ఉండగా, ఉన్న వారిలో చాలామందిని తనిఖీల పేరుతో కమిటీల ఏర్పాటు చేసి వారిని బోధనకు దూరం చేస్తున్నారు. 168 కమిటీలు రాష్ట్రంలోని 16,474ప్రాథమిక పాఠశాలలో తనిఖీలుచేయాలట. అదేవిధంగా 300ప్రాథమిక ఉన్నత పాఠశాలల తనిఖీకి 35కమిటీలు, 4672 సెకండరీ పాఠశాలలకు 96 కమిటీలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయినాయి. ఈ కమిటీలలో ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయ సభ్యులుంటారు. ఈ కమిటీల ఏర్పాటులో జూనియర్లు కొన్నిచోట్ల సీనియర్ల బోధనను పరిశీలించడం, సలహాలు సూచనలు ఇచ్చి నివేదిక సమర్పించడం ఏమాత్రంఆమోదయోగ్యంకాదు. అసంబద్ధంగా ఉంటుంది. తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తనిఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యంకల్పించాలి. గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పించాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి. ●



# అప్పులతోనే అభివృద్ధి.. ఆనందమెలా?

ప్రసాద రావు

ఒకప్పుడు అప్పు అంటే భయం. నేడు ప్రియంగా మారింది అంటే అతిశయోక్తికాదు. దేశ జి.డి.పి 2023 24లో 173.82 లక్షల కోట్లు కాగా, దాదాపు దీంట్లో సగ సమానమైన మొత్తం అప్పులు రూపంలోవివిధ బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు నుంచి మనదేశ ప్రజలు వ్యక్తిగతంగా అప్పులు తీసుకున్నట్లు కేంద్ర గణాంక శాఖ నివేదిక పేర్కొంది. ఈ అప్పుల్లో మన తెలుగు రాష్ట్రాలు మొదటి రెండు స్థానాల్లో నిలువుగా, ఒక అడుగు ముందుకేసి ఆంధ్రప్రదేశ్ 43.7 శాతంతో మొదటి వరుసలో నిలబడింది. రెండో స్థానంలో 37.2 శాతంతో తెలంగాణా ఉంది. పూర్వం అనగా ఒక రెండు దశాబ్దాల క్రితం వరకూ, డబ్బులు ఉంటేనే ఏవస్తువు అయినా కొనడం, ఇల్లు కట్టుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగేది. అయితే ఇటీవల కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్న ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడానికి అలవాటు పడ్డారు. దీనికి తోడు, బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇక ప్రైవేటు బ్యాంకులు, సంస్థలు నియమనిబంధనలు సరళీకృతం చేసి మరీ ఇంటి వద్దకే అప్పులు ఇచ్చే సదావకాశం కల్పించాయి. ఆన్లైన్ సిస్టం ద్వారా, వ్యక్తిగత గ్యారంటీ ద్వారా ఋణాలు ఇవ్వడం ద్వారా అప్పులేని వ్యక్తి లేడు అన్నట్లు అయిపోయింది. గృహాలు, కార్లు, స్థలాలు, పొలాలు, గ్రహోపకరణాలు, గోల్డ్ వంటివి కొనడానికి సుముఖంగా ఉంటే చాలు. ఋణాలు సులభంగా అందిస్తున్నారు. కొంతమంది వాస్తవంగా ఈ ఋణాలు ద్వారా అభివృద్ధి చెందుతుంటే, మరెందరో ఋణగ్రస్థులుగా మారిపోతున్నారు. ఆదాయానికి మించి అప్పులు చేయడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. ఇక పెళ్ళిల్లు, బర్తడే వేడుకలు, ఇంట్లో జరిగే అనేక వేడుకలు, విందులు వినోదాలు కోసం అప్పులు చేయడంతో చాలా కుటుంబాల్లో చీకటి అలుముకుంటున్న పరిస్థితి. 'క్రెడిట్ కార్డు' అందుబాటులోకి రావడంతో ఎక్కువ మంది అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. ఇక జీవితం అంతా అప్పులు, వడ్డీలు కట్టడం సరిపోతుంది. ఆన్లైన్ షాపింగ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మీసో, జొమోటో, స్విగ్గీ, బ్లింకిట్ ఇలా వివిధ రకాల సంస్థలు ఆన్లైన్ ద్వారా వస్తువులు, సరుకులు ఇంటి వద్దకే అందిస్తుంటే, చాలా మంది సుఖజీవులుగా మారి అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తద్వారా ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నశిస్తున్న పరిస్థితి. " వినిమయతత్వం ( కన్జురిజం) నిత్యజీవితంలో భాగం అయింది. దీంతో ఎంత సంపాదించినా, సరిపోని పరిస్థితి నెలకొంది. విలాసాలు, వినోదాలు, పార్టీలు, గెట్ టుగెదర్, వీకెండ్ పార్టీలు, రకరకాల టూరిజం పర్యటనలు చేస్తూ అనవసరమైన ఖర్చులతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న పరిస్థితి. మరోవైపు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, డి మార్ట్, రిలయన్స్, విజేత, మోర్, విశాల్, డిపార్ట్మెంట్ స్టోర్స్, వస్త్ర వ్యాపార సంస్థలు, లూలు మాల్స్, రెడిమేడ్ వస్త్రాలు, అలంకరణలు, లగ్జరీ బైక్, కార్లు, పెర్ఫ్యూమ్ అందుబాటులోకి రావడంతో అవసరానికి మించి కొనడం, అన్నిటికీ మించి ' సెల్‌ఫోన్లు, టీ.వీలు, ఫ్రిజ్, ఏ.సిలు' ఇలా అనేక వస్తువులపై ఆకర్షణ ఏర్పడి, ఆదాయంతో సంబంధం లేకుండా ఖర్చు చేసికొనడంతో దాదాపు అన్ని కుటుంబాలు అప్పులు ఊబిలో కూరుకు పోతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అప్పుల్లో మునిగి తేలుతున్న వైనం పట్టణ ప్రజలు కంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ అప్పుల్లో ఉన్నట్లు సర్వేతెలిపింది. 'జెన్‌జెడ్‌యువత, ప్రజలు' అప్పుల్లో ఎక్కువగా ఉంటున్నారు. వివిధ రకాల లగ్జరీ అలవాట్లు కలిగి ఉండటం వల్ల అప్పులు కుప్పలుగా చేయడం జరుగుతుంది. మరి కొందరు'స్టాక్ మార్కెట్'లో పెట్టుబడులు పెట్టేందుకు అప్పులు చేసిమరీ పెట్టుబడి పెడుతున్న పరిస్థితి.. ఆన్లైన్ గేమ్స్, విలాసవంతమైన ఇళ్ల నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, విలాసవంతమైన జీవితం కోసం ఆదాయానికి మించి ఖర్చు చేయడం, అప్పులు చేయడంతో జీవితాన్ని నరకప్రాయం చేసుకోవడం జరుగుతుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో అప్పు తక్కువ ఉన్న ప్రజలు ఎక్కువగా ఉండుట గమనించదగిన విషయం. ●

# ప్రజాస్వామ్య ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు

మేకిరి దామోదర్

సత్యం, అసత్యం మధ్య తేడా మసకబారిన యుగంలో మన ఆలోచన స్వేచ్ఛే అత్యంత విలువైనదిగా మారింది. అబద్ధాలకు శబ్దం ఎక్కువ, కానీ సత్యానికి శక్తి అపారమని తెలుసుకునే బుద్ధి అవసరం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు, ప్రశ్నించే హక్కును వినియోగించడం కూడా. మన ఆలోచనా స్వాతంత్ర్యం క్షీణిస్తే, ప్రజాస్వామ్యం శ్వాస ఆగిపోతుంది. ప్రస్తుత కాలంలో మనం సత్యానంతర సమాజంలో జీవిస్తున్నాం. రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక వక్రీకరణలు దైనందిన జీవితంలో మమేకమైపోతున్నాయి. నకిలీ వార్తలు, అబద్ధాలు, పాక్షిక వాస్తవాలు ఇప్పుడు సమాచారం కంటే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఒకప్పుడు దౌర్జన్యాలు దైవలీలల పేరుతో జరిగేవి; ఇప్పుడు అవే 'ఇదే మీకు మంచిది" అంటూ సాంకేతిక ముసుగులో సోషల్ మీడియా ద్వారా ప్రజల మనసుల్లోకి చొరబడుతున్నాయి. ప్రశ్నించని సమాజం మౌనంలో మునిగిపోతుంది. ఆ మౌనం మన ఆలోచనా శక్తిని మంటించిన మంటల్లా దహిస్తుంది. సగటు మనిషి స్వతంత్రంగా ఆలోచించే, వాస్తవాలను విచారించే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. హేతుబద్ధతకు బదులు భావోద్వేగాలు, శాస్త్రీయ దృష్టికి బదులు ఆరాధనాత్మక దృష్టి చోటు దక్కుతోంది. ఫలితంగా, విలువల వ్యవస్థ పతనమవుతోంది. నీతి, నిజాయితీ, మర్యాదలు అన్నవి ఇప్పుడు ప్రదర్శనాత్మక పదాలుగా మారాయి. సత్యానికి విలువ లేని దేశంలో సత్యవంతుడు సులభంగా దోషిగా మారుతాడు. ఇలాంటి స్థితినే పాశ్చాత్య సమాజంలో 'పోస్ట్ ట్రూత్" అని పిలుస్తారు. ఇక్కడ వాస్తవాల కంటే వ్యక్తిగత నమ్మకాలు, భావోద్వేగాలే ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. నకిలీ వార్తల ప్రభావం వల్ల ప్రజలు తమకు నచ్చినది నిజమని నమ్ముతున్నారు. వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం అలవాటైపోతోంది. ఫలితంగా సమాజంలో తప్పుడు సమాచారమే 'ప్రజాజ్ఞానం' గా మారుతోంది. సోషల్ మీడియా వేదికలపై అబద్ధాలకు లైకులు ఎక్కువ, సత్యానికి నిశ్శబ్దం ఎక్కువ. ఆ పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని సున్నితంగా, కానీ ఘోరంగా దెబ్బ తీస్తోంది. ప్రశ్నే ప్రగతికి పునాది. ఏ వైజ్ఞానిక ఆవిష్కరణైనా, సామాజిక సంస్కరణైనా, ఆధ్యాత్మిక అన్వేషణైనా ఒక ప్రశ్నతోనే మొదలవుతుంది. కానీ ఆధునిక సమాజంలో విమర్శనాత్మక ఆలోచన శక్తి తగ్గిపోతోంది. విశ్లేషణకు బదులు నమ్మకాలు, విచారణకు బదులు మూస భావాలు, ఆలోచనకు బదులు వ్యక్తి ఆరాధన పెరుగుతోంది.



విమర్శను విరోధంగా చూడటం, భిన్నాభిప్రాయాలను ద్రోహంగా పరిగణించడం – ఇవి ప్రమాదకరమైన ధోరణులు. ప్రభుత్వాల నుండి మీడియా వరకు అన్నీ భావోద్వేగాల ఆధారంగా నడుస్తున్నట్లున్నాయి. సమాచార హక్కు కోసం పోరాడిన ఉద్యమకారులపై దాడులు, వారి హత్యలు – ఇవన్నీ ప్రజాస్వామ్యపు ఆత్మను గాయపరుస్తున్న దృశ్యాలు. సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేక్‌న్యూస్ ఛానెల్స్ వల్ల ప్రజల్లో ఆలోచనకంటే ప్రతిస్పందన వేగం పెరిగింది. ఆలోచన తగ్గి, ఆక్రోశం పెరిగింది. భిన్న అభిప్రాయాలపై అసహనం రోజురోజుకూ పెరుగుతోంది. 'నేను అనుకున్నదే సత్యం' అనే భావం మన సామాజిక సంభాషణలను విషపూరితం చేస్తోంది. రాజకీయాల్లో వ్యక్తి పూజ పరాకాష్టకు చేరింది. నాయకుడు తప్పుడు నిర్ణయం తీసుకున్నా, ఆయన అభిమానులు దానిని సమర్థించడమే కాదు, దానిని సత్యంగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. విధానాలపై విమర్శలు చేయడం ప్రమాదకరమని భావించే వాతావరణం నెలకొంది. ఈధోరణి ప్రజాస్వామ్య ఆత్మను మెల్లగా హరింపచేస్తోంది. విద్యా వ్యవస్థ కూడా విచారణాత్మక దృష్టిని పెంపొందించడంలో విఫలమవుతోంది. ఎలా ఆలోచించాలి? అన్న ప్రశ్నను ప్రాధాన్యంగా బోధించాల్సిన చోట, కేవలం మార్కులు సాధించే విద్యకే ప్రాధాన్యం ఇచ్చింది. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా విద్య అంటే విషయాలు తెలుసుకోవడం కాదు, ఆలోచించడం నేర్చుకోవడం. అందుకే పాఠశాలల నుంచే 'క్రిటికల్ థింకింగ్" అనే అంశాన్ని బోధించాలి. పిల్లలు ప్రశ్నించడానికి, విశ్లేషించడానికి, వాస్తవాలను పరిశీలించడానికి ప్రోత్సహించాలి. మూఢనమ్మకాల నిరోధక చట్టాలు, సోషల్ మీడియా నియంత్రణ చట్టాలు వంటి సంస్కరణలు కూడా అవసరం. సమాజంలో ఆలోచనాత్మక దిశను బలోపేతం చేయడం అత్యవసరం. సత్యం కోసం నిలబడే ధైర్యం ప్రజాస్వామ్యానికి ఇప్పుడు అనువార్యం. 2+2=5" అని బలవంతం చేసే ఉపాధ్యాయుడి ముందు నిలబడి 'అది నాలుగు" అని రాసే విద్యార్థి ధైర్యం అదే విమర్శనాత్మక ఆలోచన జీవచిహ్నం. నియంతృత్వం తుపాకీతో భయపెట్టినా, సత్యం కోసం లేచిన ఆ విద్యార్థి మనసు ప్రతి మనిషిలో ఉండాలి. ఆ ధైర్యం సత్యానికి, ప్రజాస్వామ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించని మనిషి ఓ నిష్క్రియ పౌరుడుమాత్రమే. ఆలోచించని విద్యార్థి భవిష్యత్తుకే ప్రమాదం. విమర్శించని మేధావి జాతి దురదృష్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులను ఎంచుకోవడం కాదు, వారి పనిని ప్రశ్నించడం, విశ్లేషించడం, తప్పు అయితే సరిదిద్దమని చెప్పడం కూడా పౌరుని బాధ్యత. సత్యాన్ని తెలుసుకోవడమే కాదు, దాన్ని నిలబెట్టే ధైర్యం చూపడమే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం. మన సమాజం ప్రగతిపథంలో కొనసాగాలంటే విమర్శనాత్మక ఆలోచన సజీవంగా ఉండాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి, ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు, ఆలోచనే దారి చూపులు, సత్యమే శాశ్వతం. ●

# ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ!

**- ట్రంప్ బెదరింపులవల్లే నోరుమెదపడంలేదు**
**- బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ సర్కార్**
**- బీహార్ ఎన్నికల సభలో రాహుల్**



**ముజఫర్‌పూర్, అక్టోబరు 29:** ఓట్ల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏదైనా చేస్తారు, బీహార్‌లోని ప్రజలు అతడిని డ్యాన్స్ చేయమని అడిగితే, ఖచ్చితంగా డ్యాన్స్ చేస్తారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని బిజెపి రిమోట్ కంట్రోల్ ద్వారా నడుపుతోందని ఆరోపణలు గుప్పించారు. బుధవారం ముజఫరపూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్‌తో కలిసి రాహుల్‌గాంధీ పాల్గొని ప్రసంగించారు. "నరేంద్రమోడీ అన్ని రకాల డ్రామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ మీరు డ్యాన్స్ చేస్తే తాము మీకు ఓటేస్తామనండి. ఆ మరుక్షణమే భరత నాట్యం ప్రదర్శిస్తారు" అని ప్రధానిపై రాహుల్ విమర్శలు గుప్పించారు. బీహార్ ప్రజలు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే భ్రమలో ఉన్నారు, అదంతా తప్పు బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. నితీశ్ నాయకత్వం కేవలం ఒక ముసుగు మాత్రమే, నిజమైన అధికారం బిజెపి వద్ద ఉందని, అది కూడా ముగ్గురు నలుగురు వ్యక్తుల వద్దే ఉందన్నారు. పాలక ఎన్‌డిఏకు సామాజిక సమానత్వం పట్ల నిబద్ధత లేదని ఆరోపణలను పునరుద్ఘాటించారు. "ట్రంప్‌ను చూసి ప్రధాని మోడీ భయపడుతున్నారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందన్న ట్రంప్ వాదనపై మోడీ ఇంత వరకు నోరు మెదపలేదు. ఈసారి ఆయన బీహార్ వచ్చినప్పుడు అమెరికా అధ్యక్షుడు భారత్ – పాక్ వివాదాన్ని ఆపడం గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోడీ చెప్పాలి" అని రాహుల్ గాంధీ ప్రధానికి సవాల్ విసిరారు. 11ఏళ్లలో మోడీ సర్కార్ నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని రాహుల్ దుయ్యబట్టారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పట్టుబట్టడంతోనే మోడీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. మోడీ– నితీశ్ ప్రభుత్వాల దమననీతిని గుర్తెరిగి బీహార్ ప్రజలు ఈసారి స్పష్టమైన తీర్పు ఇవ్వాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు.

# సిఎం, పిఎం పోస్టులు ఖాళీ లేవు

**- సోనియా, లాలూపై అమిత్ షా సెటైర్లు**



**దర్భంగా, అక్టోబరు 29:** ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తమ కుమారులను బీహార్ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిని చేయాలని కలలు కంటున్నారని, కానీ ఆ పదవులు ఖాళీగా లేవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో ప్రస్తుతం ఏ సీటు ఖాళీగా లేదని ఆయన స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఉంటారని తేల్చి చెప్పారు. బీహార్‌లోని దర్భంగాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సభలో అమిత్ షా మాట్లాడుతూ, ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన తనయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తే, సోనియా గాంధీ తన కొడుకును ప్రధాన మంత్రిని చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చాలా మంది యువకులకు టిక్కెట్లు ఇచ్చింది, కానీ ఆర్‌జెడి, కాంగ్రెస్ ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. అది మహాఘట్ బంధన్ కాదు దొంగ బంధన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) సంస్థకు చెందిన కార్యకర్తలను మహాగట్ బంధన్ బీహార్‌లో అధికారంలోకి వస్తే జైలులోనే ఉంటారా? అని ప్రశ్నించారు. పట్నాలోని ఫుల్వారీ షరీఫ్‌లో పిఎఫ్ఐ కార్యకర్తలు చురుకుగా ఉన్నారని ఆరోపించారు. తేజస్వి, రాహుల్ బీహార్‌లో జంగిల్ రాజ్ తిరిగి తీసుకురావడానికి యత్నిస్తున్నారని, ఆ అవకాశం ఇవ్వొద్దని అమిత్ షా పిలుపునిచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వం బీహార్‌లోని 8.52 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నదని, మఖానా బోర్డును ఏర్పాటు చేసిందని అమిత్ షా తెలిపారు. గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని గుర్తు చేశారు. దర్భాంగాకు త్వరలో మెట్రో రైలు వస్తుందని, ఇప్పటికే విమానాశ్రయం నిర్మితమైందని పేర్కొన్నారు. ఎయిమ్స్ నిర్మాణ దశలో ఉందని వెల్లడించారు. మిథిలాలో సీతాదేవి ఆలయం నిర్మిస్తున్నామని, ఆమె సందర్శించిన అన్ని ప్రదేశాలు రామ్ సర్క్యూట్‌కు అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు.

# మాకు డబ్బు ముఖ్యం కాదు

**విజయ్‌కు సొమ్ము తిప్పిపంపిన మృతుని భార్య**



**కరూర్, అక్టోబరు 29:** కరూర్ తొక్కిసలాటలో భర్తను కోల్పోయిన ఓ మహిళ టీవీకే అధినేత, నటుడు విజయ్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. తమకు డబ్బు ముఖ్యం కాదని చెబుతూ విజయ్ తమ ఖాతాలో జమ చేసిన రూ.20 లక్షలను తిప్పి పంపించింది. విజయ్ నుంచి తాము ఓదార్పు కోరుకున్నాం తప్ప డబ్బు కాదని చెప్పారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 27న కరూర్ లో నిర్వహించిన విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోయిన విషయం తెలిసిందే. మరణించిన వారిలో రమేశ్ కూడా ఒకరు. తొక్కిసలాట జరిగిన కొద్ది రోజులకు విజయ్ తమతో వీడియో కాల్ లో మాట్లాడారని రమేశ్ భార్య సంఘవి తెలిపారు. నేరుగా వచ్చి పరామర్శిస్తానని, ముందుగా పరిహారం తీసుకోవాలని విజయ్ కోరారన్నారు. ఈ నెల 18న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరఫున తమ బ్యాంకు ఖాతాలో రూ.20 లక్షలు జమ అయిందని వివరించారు. అయితే, తమకు డబ్బు ముఖ్యం కాదని, విజయ్ పరామర్శ కోసం ఎదురుచూశామని సంఘవి చెప్పారు. తాజాగా కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలను విజయ్ చెన్నైకి పిలిపించుకుని ఓ రిసార్ట్ లో సమావేశమయ్యారని సంఘవి గుర్తుచేశారు. ఆ సమావేశానికి తాము వెళ్లలేదని, తమ పేరు చెప్పుకుని తమ బంధువులు వెళ్లారని సంఘవి ఆరోపించారు. విజయ్ పరామర్శిస్తారని భావిస్తే డబ్బు పంపారని, ఆ డబ్బు తమకు అక్కర్లేదని తిప్పి పంపామని సంఘవి వివరించారు. డబ్బు తిప్పి పంపిన రశీదును ఆమె మీడియాకు చూపించారు.

# తప్పుడు అభియోగాలతో శిక్ష అనుభవిస్తే నిర్దోషులకు ప్రభుత్వ పరిహారం

## పరిశీలిస్తున్న సుప్రీం



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** తప్పుడు అభియోగాలతో అన్యాయంగా జైలు శిక్ష అనుభవించిన నిర్దోషులకు నష్టపరిహారం చెల్లించే అంశంపై సుప్రీంకోర్టు తీవ్రంగా దృష్టి సారించింది. వ్యవస్థ తప్పిదాల వల్ల బలిపశువుగా మారిన వ్యక్తి, విలువైన జీవితాన్ని కోల్పోయినప్పుడు పరిహారం అందించేందుకు ఒక పటిష్ఠమైన విధానాన్ని రూపొందించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న చట్టపరమైన సంక్లిష్టతలను అధిగమించేందుకు తమకు సహాయం చేయాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను కోరింది.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో తప్పుడు ఆరోపణలతో 12 ఏళ్ల జైలు జీవితం గడిపిన ఓ నిరుపేద వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ కేసులో థానే కోర్టు అతనికి 2019లో మరణశిక్ష విధించింది. అయితే, సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు అతన్ని నిర్దోషిగా తేల్చి ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తాను కోల్పోయిన 12 ఏళ్ల జీవితానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ బాధితుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. బాధితుడి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. ఇలాంటి కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. జైలు జీవితం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే. దీనిపై కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన కోరారు. ఈ అంశంపై ఒక స్థిరమైన ఏర్పాటు అవసరమని గతంలో లా కమిషన్ కూడా సిఫార్సు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ధర్మాసనం దేశంలో శిక్షలు పడుతున్న కేసుల శాతం కేవలం 54గా ఉండటాన్ని గుర్తుచేసింది.

తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం లేదా వ్యవస్థ బాధితుడిని బలిపశువును చేయడం వంటి సందర్భాల్లో పరిహారం అంశాన్ని పరిగణించాలని భావిస్తున్నట్లు ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది.

ఇదే ధర్మాసనం, మానసిక వైద్య చట్టం 2017 అమలుపై దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి బదిలీ చేసింది.

# కచ్చాతీవును రాజకీయం చేయొద్దు!

**శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్**



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** కచ్చతీవు సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్ కోరారు. 1974లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం కచ్చతీవును తమ దేశానికి అప్పగించారని గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ ఒప్పందం ద్వారా చట్టపరంగానే భారత్ తమ దేశానికి కచ్చతీవును అప్పగించిందని పేర్కొన్నారు. భారత్ నుంచి శ్రీలంక కచ్చతీవును బలవంతంగా లాక్కోలేదని వెల్లడించారు. ఎన్నికల సమయంలో కచ్చతీవు సమస్య గురించి మాట్లాడే రాజకీయ నాయకుల ప్రకటనలను ప్రజలు గ్రహించాలని కోరారు. భారత్, శ్రీలంక మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కచ్చతీవు వంటి సమస్యలు ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయకూడదని రెండు దేశాల మత్స్యకారులపై సముద్ర వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు కూర్చొని మాట్లాడుకోవడం ఉత్తమం. మత్స్యకారుల సమస్యను సోదర సమస్యలా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. శ్రీలంక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమకు సహాయం చేసిన తొలి దేశం భారత్. తమ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు కూడా భారత్ అండగా నిలిచింది. అందుకు భారత్‌కు మేం ఇప్పటికీ కృతజ్ఞులం. చర్చల ద్వారా మనం ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ప్రదీప్ అన్నారు. తమిళనాడు మత్స్యకారులపై దాడులు, వారి అరెస్టుల గురించి అడిగిన ప్రశ్నకు ప్రదీప్ సమాధానం ఇచ్చారు. రెండు దేశాలు చర్చలు జరిపితేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చాలా కాలంగా సరిహద్దు దాటి చేపలు పడుతున్న మత్స్యకారులను అరెస్టు చేస్తున్నాయని గుర్తు చేసుకున్నారు. భారత్, శ్రీలంక మత్స్యకారులు తమ మధ్య అవగాహన కుర్చుకోవాలని వెల్లడించారు.

'రాజకీయ లబ్ధి, ఎన్నికల కోసం మాట్లాడకుండా మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఏకైక మార్గం రెండు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపడమే. భారత్, శ్రీలంక మధ్య ప్రస్తుతం సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చర్చల ద్వారా మాత్రమే మత్స్యకారుల సమస్యను పరిష్కరించవచ్చు. సోదరసోదరి సమస్యలానే మత్స్యకారుల సమస్యను కూడా కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించాలి. బదులుగా, మనం రాజకీయాల కోసం ఏదైనా మాట్లాడితే, అది సమస్యను మరింత జఠిలం చేస్తుంది. "అని ప్రదీప్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోపే శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించాం. శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించిన ప్రపంచంలోని ఏకైక దేశం శ్రీలంక. అంతే కాదు, తమిళ ముస్లింల సంస్కృతి, మత స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇస్తున్నామని శ్రీలంక మంత్రి పదీప్ అన్నారు.

# అబూదాబి లాటరీలో భారతీయుడికి రూ.240 కోట్లు







**అబూదాబి, అక్టోబరు 29:** అబుదాబిలో నివసిస్తున్న ఏపీకి చెందిన ఓ తెలుగు యువకుడిని అదృష్టం వరించింది. అమ్మపై ఉన్న ప్రేమ అతడిని రాత్రికి రాత్రే కోటీశ్వరుణ్ని చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద జాక్‌పాట్‌గా నిలిచిన 100 మిలియన్ దిర్హామ్‌లను (సుమారు రూ. 240 కోట్లు) గెలుచుకుని వార్తల్లో నిలిచారు. ఆ అదృష్టవంతుడి పేరు అనిల్‌కుమార్ బోళ్ల (29). చాలాకాలంగా అబుదాబిలో ఉంటున్న అనిల్‌కుమార్‌కు లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో ఆయన విజేతగా నిలిచారు. తనకు జాక్‌పాట్ తగిలిన విషయాన్ని మొదట నమ్మలేకపోయానని ఆయన తెలిపారు. జాక్‌పాట్ గెలిచారంటూ కాల్ వచ్చినప్పుడు వెంటనే నమ్మలేకపోయాను. ఈ రోజుకూ ఇది నిజమా కాదా అనిపిస్తోంది అని అనిల్ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తన విజయ రహస్యాన్ని పంచుకుంటూ, ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను అని చెక్కు అందుకున్న సందర్భంగా అనిల్ వివరించారు. ఈ భారీ మొత్తాన్ని ఏం చేయబోతున్నారని అడగ్గా, తెలివైన పెట్టుబడులు పెట్టడంతో పాటు తన చిరకాల కోరికైన సూపర్ కారు కొంటానని చెప్పారు. కుటుంబసభ్యులను యూఏఈకి తీసుకొచ్చి వారితో కలిసి ఇక్కడే స్థిరపడతానని, వారి కోరికలు తీరుస్తానని తెలిపారు.

అలాగే, గెలిచిన డబ్బులో కొంత భాగాన్ని ఛారిటీలకు విరాళంగా ఇస్తానని తన దాతృత్వాన్ని చాటుకున్నారు. యూఏఈలో లాటరీపై ఎలాంటి ఆదాయపు పన్ను ఉండదు. దీంతో అనిల్ పూర్తి మొత్తాన్ని, అంటే రూ. 240 కోట్లను పన్ను చెల్లించకుండానే అందుకుంటారు. అదే భారత్‌లో ఎవరైనా ఇంత పెద్ద మొత్తం గెలిస్తే, దాదాపు 30 శాతం ఫ్లాట్ పన్ను, సర్‌చార్జ్, సెస్ రూపంలో సుమారు రూ. 86 కోట్లకు పైగా ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. పన్నులన్నీ పోగా, విజేతకు దాదాపు రూ. 154 కోట్లు మాత్రమే చేతికి అందేవి. కాగా, ఇదే డ్రాలో మరో 10 మంది కూడా తలా 10 వేల దిర్హామ్‌లు (రూ. 24 లక్షలు) గెలుచుకోవడం విశేషం.

# ప్రపంచశాంతికి భారత్, జపాన్ సంబంధాలు కీలకం

**- జపాన్ కొత్త ప్రధాని తకైచితోఫోన్‌లో అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**






**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత్ –జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగంలో సహకార సంబంధాలను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. భారత్–జపాన్ సంబంధాలు ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధికి కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్ ప్రధాని సనాయి తకైచితో జరిగిన సంభాషణను ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన తకైచికి అభినందనలు తెలియజేశారు. "జపాన్ ప్రధాని సనాయె తకైచితో ఆత్మీయ సంభాషణ జరిగింది. దేశంలో అత్యుననత పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమెకు అభినందనలు తెలియజేశాను. న్యూఢిల్లీ– టోక్యో మధ్య లోతైన భాగస్వామ్యాన్ని నొక్కిచెప్పిన ఈ చర్చ, ఆర్థిక భద్రత, రక్షణ సహకారంపై సాగింది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధి కోసం ఇరుదేశాల సంబంధాలు చాలా ముఖ్యమని అంగీకరించాం" అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. మరోవైపు "జపాన్– భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం మీతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నాం" అని సనాయె తకైచి పోస్ట్ చేశారు. "భారత ప్రధానమంత్రితో ఆహ్లాదకరమైన సంభాషణ జరిగింది. జపాన్ ప్రధానమంత్రిగా నా నియామకంపై ఆయన అభినందన సందేశానికి చాలా కృతజ్ఞుడను. ఆయనతో కలిసి జపాన్– భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ బాగస్వామ్యంలో ఒక కొత్త సువర్ణ అధ్యాయాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నా" అంటూ తకైసి రాసుకొచ్చారు.

# ట్రంప్‌కు దక్షిణకొరియా అత్యున్నత పురస్కారం

**సిల్లా చరిత్రకు ప్రతీకగా నిలిచిన బంగారు కిరీటం బహూకరణ**



**సియోల్, అక్టోబరు 29:** స్వదేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వ్యతిరేక పవనాలు ఎదుర్కొంటుంటే విదేశాల్లో మాత్రం ఆయనకు పట్టం కడుతున్నారు. నోకింగ్స్ ఏరిట అమెరికాలో ట్రంప్ నిరసనలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఆసియా పసిఫిక్ ఆర్థికసహకార సంఘ సమావేశాల్లో పాల్గొనేందుకు దక్షిణకొరియాకు వచ్చిన అమెరికా అధ్యక్షుడికి ఆదేశ అత్యున్నత పురస్కారం అందించింది. దేశ అధ్యక్షుడు లీజాయ్ మ్యూంగ్ అమెరికాతో 350 బిలియన్ డాలర్ల వాణిజ్య డీల్ సక్సెస్ అయిన సందర్భంగా దక్షిణకొరియానేత ఈ అత్యున్నత పురస్కారం అందించారు. అమెరికా, దక్షిణకొరియాలమధ్య సుదీర్ఘ పెట్టుబడులతోకూడిన వాణిజ్య ఒప్పందం కుదిరిందని, పెట్టుబడులు, నౌకా నిర్మాణాలకు డీల్ కుదిరినట్లు దక్షిణకొరియా ప్రకటించింది. అలాగే అమెరికాకు దక్షిణకొరియా ఆర్థికపరంగా 350 బిలియన్ డాలర్లమేర పెట్టాలని నిర్ణయించింది. 200 బిలియన్ డాలర్లునగదు పెట్టుబడులు, 150 బిలియన్ డాలర్లు నౌకా నిర్మాణంలో సహకారం అందిస్తుందని కిమ్‌జాయే మ్యూన్ తెలిపారు. ప్రస్తుతంఅమెరికా అధ్యక్షుడికి బహూకరించిన కిరీటం గతంలో ప్రాచీన సిల్లా సామ్రాజ్యంలో శాంతిస్థాపనకు బహూకరించిన కిరీటానికి ప్రతిరూపంగా ఉంటుంది. ప్రాచీనకాలంలో గ్యాయంగ్‌ఝు రాజధానిగా సిల్లా సామ్రాజ్యం నడిచింది. ఈ కిరీటాన్ని 'గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వా'గా అందిస్తారు. కొరియాకు సంబంధించి అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. కొరియా అధికారిక పుష్పం ఎర్ర మందారంకూడా ఈ పురస్కారంపై చెక్కుతారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పినందుకుగాను సిల్లా సామ్రాజ్య చరిత్రకాలంలో ఈ పురస్కారం ప్రధానంచేసేవారు. ఎనిమిదియ యుద్ధాలు నివారించానని చెపుతున్న ట్రంప్ శాంతిస్థాపనకు విశేష కృషిచేసారని గుర్తింపుగా ఈ అత్యున్నత కిరీట పురస్కారం ప్రధానంచేస్తున్నట్లు దక్షిణకొరియా ప్రకటించింది. అలాగే అమెరికా అధ్యక్షుడి పర్యటన సందర్భంగా భారీ ఎత్తున విందును కూడా ఏర్పాటుచేసింది.

ఈ విందుకు వియత్నాం, ఆస్ట్రే లియా, న్యూజిలాండ్, కెనడా, థాయిలాండ్, సింగపూర్‌నేతలు కూడా హాజరవుతున్నారు.

## సంక్షిప్తంగా..

### కర్ణాటక పోలీసులకు కొత్త టోపీలు



**బెంగళూరు, అక్టోబరు 29:** రాష్ట్రంలో పోలీసులు వాడుతున్న క్యాప్‌ను మార్చాలని నేనే సూచించానని సీఎం సిద్ధరామయ్య అన్నారు. విధానసౌధలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త టోపీల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. పీక్ క్యాప్‌ను కానిస్టేబుళ్లకు ధరింపచేసి ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1956 నుంచి స్లోచ్ క్యాప్‌లను వాడుతున్నారన్నారు. 70ఏళ్లుగా ఉన్న విధానంలో మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, పోలీసులు ఒకే విధమైన క్యాప్ ధరించడం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనేది తన ఆశయమని సీఎం సిద్ధరామయ్య అన్నారు.


### బిజెపి నేత హత్యకేసులో నిందితుల అరెస్టు

**భోపాల్, అక్టోబర్ 29:** బీజేపీ నేతను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటకీయ ఎన్‌కౌంటర్ తర్వాత వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కాల్పుల్లో గాయపడిన హంతకులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాట్ని జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ జిల్లా పిచ్డా మోర్చా మండల అధ్యక్షుడు నీలేష్ రజక్ మంగళవారం హత్యకు గురయ్యారు. కైమోర్‌లోని మార్కెట్ వద్ద బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపి రజక్‌ను హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అక్రమ్ ఖాన్, ప్రిన్స్ జోసెఫ్‌లను నిందితులుగా గుర్తించారు. కాట్నిలోని కజ్రావారా సమీపంలో హైస్పీడ్ ఛేజింగ్ తర్వాత పోలీసులు వారిని చుట్టుముట్టారు. నిందితులు కాల్పులు జరుపగా ప్రతిగా కాల్పులు జరిపారు.

### భారత్, పాక్ ఘర్షణల్లో కూలిపోయిన ఏడు కొత్త విమానాలు

**టోక్యో, అక్టోబరు 29:** భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణల్లో ఏడు కొత్త విమానాలు కూలిపోయినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ విమానాలు ఏ దేశానికి చెందినవో ఆయన స్పష్టం చేయలేదు. రెండు న్యూక్లియర్ పవర్ దేశాల మధ్య రగిలిన చిచ్చును వాణిజ్యంతో ఆపేసినట్లు ట్రంప్ మరో సారి పేర్కొన్నారు. టోక్యోలో వ్యాపారవేత్తలతో జరిగిన డిన్నర్ పార్టీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏడు విమానాలను కూల్చేశారని, ఏడు విమానాలు కొత్తవే అని, అందమైన ఆ విమానాలను నేలకూల్చారని, రెండు అణ్వాయుధ దేశాలు ఆ ఫైట్‌లో నిమగ్నమైనట్లు ట్రంప్ చెప్పారు. అయితే పాకిస్థాన్, భారత్ మధ్య మొదలైన యుద్ధానికి వాణిజ్యంతో బ్రేక్ వేసినట్లు ట్రంప్ తెలిపారు. భారత్‌తో ట్రేడ్ డీల్ చేస్తున్నానని, ప్రధాని మోదీ పట్ల తనకు ప్రేమ, గౌరవం ఉందన్నారు. తమ మధ్య మంచి రిలేషన్ ఉందన్నారు.

### రజనీకాంత్ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నారా?



**చెన్నై, అక్టోబరు 29:** భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్ అనే పదానికి చిరునామాగా నిలిచిన రజనీకాంత్ సినిమాల నుంచి తప్పుకోనున్నారంటూ ఆయన రిటైర్మెంట్‌పై కోలీవుడ్ వర్గాల్లో మరోసారి జోరుగా చర్చ జరుగుతోంది.

75 ఏళ్ల వయసులోనూ యువ హీరోలతో పోటీపడుతూ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న తలైవా, త్వరలోనే నటనకు స్వస్తి పలకనున్నారనే వార్తలు ఆయన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం రజినీకాంత్ జైలర్ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న జైలర్ 2 షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గతంలో అరుణాచలం వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో ఓ ప్రాజెక్టుకు అంగీకరించినట్లు సమాచారం.

### కాంగ్రెస్ సమావేశంలో బంగ్లా జాతీయ గీతం ఆలాపన!

**గువాహతి, అక్టోబరు 29:** అసోంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆ పార్టీ నేత బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని ఆలపించడం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కరీంగంజ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. కరీంగంజ్‌లో జరిగిన కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ నేత బిదు భూషణ్ దాస్ బంగ్లాదేశ్ జాతీయ గీతమైన అమర్ సోనార్ బంగ్లాను పాడారు. ఈ దృశ్యాలు వీడియో రూపంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమను తెలియజేస్తోందని ఘాటుగా విమర్శించింది. ఈ ఘటనపై అసోం మంత్రి కృష్ణేందు పాల్ స్పందిస్తూ, ఇది చాలా వింతైన సంఘటన అన్నారు.

## కాలువలు, డ్రైన్లు ఆక్రమాణలుతొలగింపు -ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు

ఉండి(భీమవరం)అక్టోబర్ 29(ప్రభాతవార్త : రైతులకు ఇబ్బంది లేని విధంగా సాగునీరు సాఫీగా పారేందుకు రానున్న రెండు నెలల్లో కాలువలు, డ్రెయిన్లు ఆక్రమణలను నూరు శాతం తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు. బుధవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా బలమైన గాలుల ప్రభావంతో నేలకొరిగిన వరి పంటను రాష్ట్ర శాసనసభ ఉపసభావతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాండ్రం గ్రామంలోని 600 ఎకరాలకు సంబంధించిన నీరు ఇసుక డ్రెయిన్ ద్వారా వెళ్లవలసి ఉంటుందని, డ్రెయిన్ కుంచించుకుపోవడంతో సాగునీరు సాఫీగా పారుదల లేక పంట నష్టపోతున్నామని ఉ



పసభాపతి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకురాగా ఈ సమస్య పరిష్కారానికి ఆక్రమణలను తొలగించి వాస్తవంగా డ్రెయిన్ ఎంత ఉండాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ వాండ్రం గ్రామంలో వరి పంట దెబ్బతిన్నదన్న సమాచారంతో నేడు పరిశీలనకు జిల్లా కలెక్టర్ తో కలిసి రావడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న 900 ఎకరాలకుగాను సుమారు 50 ఎకరాలు మేర వరి చేను నేలకొరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉండి నియోజకవర్గంలో 80 శాతం మేర డ్రెయిన్లు, కాలువలపై ఆక్రమణలు తొలగించి నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించడం జరిగిందని, రానున్న రెండు మాసాలలో నూరు శాతం ఆక్రమణలు తొలగించి రైతు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆక్రమణలు తొలగించేందుకు ఇదే విధానం మార్గదర్శకం కావాలన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# నష్టపోయిన ప్రతి ఎకరాకు సాయం

### -ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తాము - జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్



**ఏలూరు/ పెదపాడు, అక్టోబరు 29: ప్రభాత వార్త :**పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నేలకొరిగిన వరిచేలను రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి మరియు ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు లు కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేశారు. 1318 వరి రకం వేశామని ఒక ఏకరాకు 42 నుండి 44 బస్తాలు దిగుబడి వస్తాయని, గడ్డి కూడా ఎక్కువ వస్తుందని, పశువులకు పనిచేస్తుందని ఆశించామని తెలిపారు. విపత్తులను తట్టుకునే శక్తి 1318 రకానికి ఉందని అయితే రాత్రి కురిసిన భారీ వర్షాలు, భారీ ఈదురు గాలితో వరి పంటలు నేలకొరిగాయని రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఏకరాను పారదర్శంగా నష్టం అంచనాలు వేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని రైతులకు భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, కూటమి ప్రభుత్వం రైతులు ప్రభుత్వం అని మీకు అండగా ఉంటామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతులు ఖాతాలో నగదు జమ చేస్తామని, ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి పంటలకు గిట్టుబాటు ధర అందించటమే మా ప్రథమ కర్తవ్యం అన్నారు. నేలకొరిగిన వరిపంటను దుబ్బులుగా కట్టుకుని వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను డ్రోన్ల ద్వారా స్ప్రే చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు పాటించి పంటలను చేతికి వచ్చేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. దెందులూరు ఎమ్మెల్యే



చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 1318 వరి రకం ఎటువంటి విపత్తులను తట్టుకునే శక్తి ఉందని ఇక్కడ ఎక్కువ మంది రైతులు1318 వరి రకం వేసుకున్నారని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు, అధిక గాలులు వీచటవలన రాత్రికి నేలకొరిగాయని తెలిపారు. ఈ ప్రాంత రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, ఏడిఇ ఇ.అనిత కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ ఖాసీమ్, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కూలిన నల్లి క్రీక్ వంతెన - పరిస్థితి చక్కదిద్దేందుకు కృషి



**నరసాపురం, అక్టోబర్ 29:** నరసాపురం మండలంలోని చిన్న మైనవానిలంక గ్రామాన్ని ఈ రోజు ఉదయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ , జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి తో కలిసి సందర్శించారు. ఇటీవలి మొంథా తుఫాను ప్రభావంతో వేములదేవి పశ్చిమ గ్రామం పరిధిలోని చినమైనవనిలంక నల్లి క్రీక్ వంతెన కూలిపోవడంతో ఆక్వా రైతులు ,గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయకర్ , కలెక్టర్ చదరవాడ నాగరాణి తో కలిసి ప్రత్యక్షంగా పరిస్థితిని పరిశీలించారు.గ్రామ ప్రజలు ప్రధానంగా చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సముద్రంలో తుఫానులు సంభవించినప్పుడు మత్స్యకారులు తీవ్రమైన భయాందోళనకు గురవుతున్నారని ఎమ్మెల్యే నాయకర్ తెలిపారు. అదేవిధంగా గ్రామ రైతాంగం ప్రధానంగా ఆక్వా రంగంపై ఆధారపడినందున, ఇటువంటి తుఫానులు చిన్న ఆక్వా రైతులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ గ మాట్లాడుతూ, ఈ సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రికి వివరించి, తీర ప్రాంత ప్రజలకు శాశ్వత ఉపాధి అవకాశాలను కల్పించే పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే తుఫాను ప్రభావిత రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, వారికి తగిన



పరిహారం మరియు సహాయం అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలోని ఇతర తుఫాను ప్రభావిత గ్రామాలను కూడా ఆయన ప్రత్యక్షంగా సందర్శించి, రైతులు మరియు మత్స్యకారులు ఎదుర్కొన్న నష్టాలను పరిశీలించారు. ప్రభుత్వం వారందరికీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నాయకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘాల చైర్మన్ మైల వసంతరావు, మండల అధ్యక్షులు అకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్, వాతడి రమేష్, బెల్లంకొండ నాయుడు, కోప్పడి కనకరాజు, ఇంటి మురళి, పెమ్మాడి కిరణ్, గన్న వత్తుల ప్రసాద్, వల్లభరెడ్డి రామకోటి, అలాగే జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రస్తుత సీజన్లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం

**ఏలూరు, అక్టోబర్, 29 : ప్రభాతవార్త** : ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతుల నుండి రికార్డు స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం తుఫాన్ సహాయక చర్యలు గురించి పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తుఫాన్ వలన నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశామని, ప్రస్తుత సీజన్లో రికార్డు స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమును సేకరించేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రస్తుత





వ్యవసాయ సీజన్లో ముందుగా వరి పంట పంటను కోతలు చేసి తుఫాన్ కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లతో చర్చించామన్నారు. తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టాలపై ఈనెల 30వ తేదీ లోగా నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలోని ప్రతీ రైతు సేవా కేంద్రంలో రైతుల వినియోగార్థం 10 నుండి 30 టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, అవసరం ఉన్న రైతులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా 95 చెట్లు, 29 విద్యుత్ స్థంబాలు కూలిపోయాయన్నారు. విద్యుత్ స్తంభాలను గంట నుండి రెండు గంటలలోగా తిరిగి ఏర్పాటుచేసి, విద్యుత్ సరఫరా అందించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టరేట్లో 24 గంట పాటూ పనిచేసే కంట్రోల్ రూమ్ ని ఏర్పాటుచేసి, ప్రజలు ఫోన్ ద్వారా తెలియజేసిన ప్రతీ సమస్యను పరిష్కరించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రివర్యులు తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలు, సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారన్నారు.

# పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాలను శిరసావహిస్తూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ అహర్నిశలు కృషి చేస్తూ తుఫాన్ బారిన పడకుండా ప్రజలందరును సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారని రాష్ట్ర విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా తాడేపల్లిగూడెం పట్టణం 6వ వార్డ్ నకు చెందిన సుమారు 20 కుటుంబాలకు చెందిన యానాదులను తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతి, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను శిరసావహిస్తూ అన్ని శాఖల అధికారులు గత 48 గంటలుగా నిద్రహారాలు మరచి విధులను నిర్వహించారన్నారు. ప్రజలు తుఫాన్ నుండి బయటపడ్డారని, కానీ రైతులు తమ తమ పొలాలను నష్టపోయిన దాఖలాలు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు. తుఫాను వల్ల నిరాశ్రయులైన కుటుంబాలను గుర్తించామని వారందరికీ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తామని తెలిపారు. కృష్ణయ్య పాలెం అలంపురం, రావిపాడు తదితర గ్రామాలలో పర్యటించగా ఇప్పటివరకు రైతుల నష్టాన్ని 1400 ఎకరాలను అధికారులు గుర్తించారని మరింత రైతుల నష్టాన్ని గుర్తించవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయాన్ని ప్రకృతి విపత్తుల శాఖ ఆధ్వర్యంలో ఉంచుతామని ఆయన తెలిపారు.

# తుఫాన్ తో అన్నదాత అష్ట కష్టాలు

**చాట్రాయి, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** తుఫాను వల్ల పంటలు రక్షించుకునేందుకు అన్నదాత అష్ట కష్టాలు పడుతున్నారు. కొందరు కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకునేందుకు టార్పాలిన్ పట్టాలు వేసి ఏదో విధంగా పంటను రక్షించుకోవాలని రాత్రింబవళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి చేతికి వచ్చిన చేజారి పోతుందేమోనని రైతులు ఆందోళనతో పడుతున్న అవస్థలు ఇన్నిన్ని కాకుండా ఉన్నాయి. పంట పొలాలలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు వర్షం వస్తున్నప్పటికీ పొలాలలోనే జీవనం సాగిస్తున్నారు. ఒకపక్క వరి ఒరిగి పనికి పోగా మరోపక్క అధిక నీటితో ధాన్యం మొలకెత్తుతుందని భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు ఇస్తున్నప్పటికీ రైతులు పడుతున్న కష్టాలు చెప్పనలివి కాకుండా ఉన్నాయి. కొందరు రైతులు తుఫాన్ హెచ్చరికలు ఉన్నప్పటికీ సోమ మంగళవారాలలో కోసిన పంట కోసినట్లు కాటాలు వేయించారు. రేటు ఎలా ఉన్న ముందు ధాన్యం అమ్ముకోవాలనే ఉద్దేశంతో రైతులు ధాన్యం కాటాలు వేయించారు. ఏది ఏమైనా ఈ ఏడాది రైతులకు తుఫాన్ వల్ల పంట నష్టం ఉండక తప్పదని తెలుస్తోంది. మండలంలో అన్ని గ్రామాలలో వరి పంట కోతకు రాగా ఎకరానికి 40 నుండి 45 బస్తాలు అవుతాయి అని రైతులు ఆశపడ్డారు. కానీ అన్నదాత ఆశలు ఆడియోసులయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. వేలాది రూపాయలు కౌలు చెల్లించిన రైతులు లబోదిబోమంటున్నారు. తుఫాన్ ఈరోజుతో వీడిపోతే పంటలను కొంతమేర కాపాడుకునేందుకు అవకాశం ఉందని రైతులు తెలియజేస్తున్నారు.



తమ్మిలేరుకు వస్తున్న వరద



నీటిని బయటికి పంపేందుకు రైతు పడుతున్న పాట్లు



టార్బాలిన్ పట్టాలు వేస్తున్న రైతులు

# ఆత్మహత్య చేసుకున్న దంపతులు

### అనాధగా మిగిలిన కొడుకు
### ప్రేమ వలలో పడ్డ గృహిణి
### అందకారంగా మారిన కుటుంబం
### రిమాండ్ ఖైదీగా నిందితుడు



భీమడోలు ఏలూరు ప్రభాతవార్త :కలుపుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన భీమడోలు గ్రామానికి చెందిన దంపతులు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. భీమడోలు గ్రామంలోని యువదంపతులు గుండుమోలు సుధాకర్, భానుపూర్ణిమలు ఐదేళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వారికి మూడేళ్ళ కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల భార్య భానుపూర్ణిమను గ్రామానికి చెందిన యువకుడు కఠారి మోహన్ గ్రామాంతరం తీసుకెళ్లడంతో సుధాకర్ కుటుంబ సభ్యులు భీమడోలు పోలీస్ స్టేషన్ లో ఈనెల ఏడవ తేదీన కిడ్నాప్ కేసు పెట్టారు. 10రోజులు అనంతరం భానుపూర్ణిమ భర్త సుధాకర్ వద్దకు ఇంటికి తిరిగి రావడంతో భార్య భర్తలు భానుపూర్ణిమ, సుధాకర్ లను పెద్దలు తాత్కాలికంగా దూరంగా ఉంచారు. ఈనేపథ్యంలో అవమానభారంతో ఉన్న సుధాకర్ దంపతులు భీమడోలు శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం సాయంత్రం కలుపు మందుత్రాగి వీడియో సందేశం సోషల్ మీడియాలో పెట్టారు. ఈమేరకు భాను పూర్ణిమ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కఠారి మోహన్ తనకు కుంకుమలాంటిది పూసి మాయమాటలు చెప్పి గ్రామం నుంచి బలవంతంగా తీసుకెళ్లాడని, మోహన్ అనే వ్యక్తి తమ జీవితంలోకి రావటం వల్ల తాము మానసికంగా కుంగిపోతున్నామని, తమకు పోలీసులు న్యాయం చేయాలన్నారు. సుధాకర్ మాట్లాడుతూ తన బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని తలిదండ్రులను కోరారు. విషం తాగేముందు రాతపూర్వకంగా లేఖ రాసి, వీడియో తీసి సన్నిహితులకు పంపారు. లేక పై ఇరువురు సంతకాలు చేశారు. వెంటనే గమనించిన బంధువులు వీరిని గ్రామంలో ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఏలూరు అక్కడ నుంచి గుంటూరు అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భార్య భానుపూర్ణిమ సోమవారం రాత్రి, భర్త సుధాకర్ మంగళవారం అర్ధరాత్రి 2గంటలకు చికిత్స పొందుతూ విరిద్దరూ మృతిచెందడంతో భీమడోలు గ్రామంలో విషాదఛాయలు అలుకున్నాయి. ఇ ప్పటికే కేసు నమోదు కావడంతో రెండు రోజుల క్రితమే అరెస్టు చేసి మోహనన్ను రిమాండ్కు పంపారు. భీమడోలు ఎస్సై భాష కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుఫాను ప్రభావిత గ్రామాలలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణికి చినలంక గ్రామంలో నల్లిక్రీకు వంతెన, ఆక్వా రైతులు, మత్స్యకారుల ఇబ్బందులను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు **ప్రభాతవార్త నరసాపురం రూరల్**



**అంబేద్కర్ కోనసీమ జిల్లా దక్షిణ కాశీగా పిలవబడే అంతర్వేది నరసింహ స్వామి కొలువుతీరి ఉన్న అంతర్వేది సముద్రం తీర ప్రాంతంలో మొందా తుఫాను తీరం దాటినా పరిమిత నష్టంతో బయటపడినందుకు స్వామివారి కరుణాకటాక్షాలే కారణమని నెగ్విజన్లో రకరకాల క్లిప్పింగ్స్ పెడుతున్నారు. ప్రభాతవార్త నరసాపురం**





## మొంథా తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి.

### -నష్టపోయిన ఉద్యాన పంటల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ముసునూరు, నూజివీడు, అక్టోబర్29 ప్రభాతవార్త: మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన ఉద్యాన పంటల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. నూజివీడు నియోజకవర్గం లోని ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు రూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో సాగుచేసిన మినుము, వరి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. బుధవారం ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, ముసునూరు, కాట్రేన్పాడు గ్రామాలలో ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను రైతులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. బాధిత రైతులు మాట్లాడుతూ మొంథా తుఫాన్ కు తీవ్ర నష్టాన్నిరైతులకు తీవ్ర నష్టాన్ని, విషాదాన్ని మిగిల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంగిడిగూడెంలో రూ.50 వేలు పెట్టుబడి పెట్టి బంతిపూలు సాగు చేసిన రైతు నష్టపోయారని చెప్పారు. ముసునూరులో అరటి గెలలు తయారీ దశలో తోటలు పడిపోయాయన్నారు.




ఇతర ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయి అప్పుల ఊబిలోకి కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## తుఫాన్ ధాటికి పంటలు నేలమట్టం:

## పెనుగొండ మండల రైతులు ఆవేదన:

పెనుగొండ అక్టోబర్ 29 (ప్రభాతవార్త): సిద్ధాంతం, ములపర్రు, దేవా ఇలపర్రు, గ్రామాలు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన శ్రమించి సాగుచేసిన వరి పంటలు కులీనుతున్న పొలాలు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు.రైతులు చెబుతూ



పెనుగొండ మండలం పరిధిలోని వడలి, కొటాలపర్రు, దొంగరావుపాలెం తదితర దెబ్బతిన్నాయి. గత కొన్ని రోజులుగా ఈదురుగాలుల కారణంగా రైతులు ఎంతో నేలమట్టమయ్యాయి. పచ్చగా తళు వాలిపోవడంతో రైతులు మానసికంగా తీవ్ర "మేము రోజూ చెమటోడ్చి, అప్పులు చేసి సాగు చేశాం. ఇప్పుడు తుఫాన్ గాలులతో పంట మొత్తం నేలకూలిపోయింది. కోతకు దగ్గర్లో ఉన్న పంటలు కూడా నీటమునిగిపోయాయి. మాకు భారీ నష్టం జరిగింది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం మాకు సాయం చేయకపోతే ఎలా బతుకుతామో తెలియదు," అని వేదన వ్యక్తం చేస్తున్నారు.వరి పంటతో పాటు మిరప, పంటలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. తుఫాన్ కారణంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడగా, రహదారులు కూడాబురదమయమయ్యాయి. రైతులు ప్రస్తుతం తమ పొలాల వద్ద పంట పరిస్థితిని పరిశీలిస్తూ, నష్టాన్ని అంచనా వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాలను సందర్శించి రైతులకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దయతలచి తుఫాన్ ప్రభావిత రైతులకు న్యాయం చేయాలి. పంటలు నాశనం అయిన ప్రాంతాల్లో తక్షణమే అధికారులు పర్యటించి నష్టాన్ని నమోదు చేయాలి" అని రైతులు కోరుతున్నారు. పెనుగొండ రైతాంగం ఎదుర్కొంటున్న ఈ దుర్భర పరిస్థితి ప్రభుత్వం దృష్టికి వెళ్లి తగిన సాయం అందిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## యర్రావారిగూడెం లోపుడి రాకపోకలు బంద్

### -పోలీస్ పికిటింగ్ ఏర్పాటు

చాట్రాయి, అక్టోబర్ 29, ప్రభాతవార్త : చాట్రాయి మండలం కొత్తగూడెం శివారు యర్రావారి గూడెం నుండి లోపూడి వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పువాగుకు వరద ఉధృతి ఎక్కువగా వస్తుండటంతో వాగుపై ఉన్న బ్రిడ్జి మీద నుండి నీరు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు రెవెన్యూ అధికారులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి ఎవరు వెళ్లకుండా కాపలా కాస్తున్నారు. మంగళవారం ఉదయం నుండి వరద పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. యర్రావారి గూడెం ప్రజలు నిత్యం లోపుడి మీదగా ధర్మాజీగూడెం ఇతర ప్రాంతాలకు నిత్య అవసరాల నిమిత్తం వెళ్లి వస్తూ ఉంటారు. తుఫాన్ కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# చాట్రాయి మండలంలో అయ్యప్పల సందడి



**ప్రభాతవార్త, చాట్రాయి :** కార్తీకమాసం వచ్చిందంటే అయ్యప్ప స్వాములు సందడి మొదలవుతుంది. అయితే ఈ ఏడాది కార్తీక మాసం కన్నా ముందుగానే స్వాములు మాలలు వేసుకొని భారీగా పడిపూజ నిర్వహింస్తున్నారు.వందలాది మంది భక్తులు పడిపూజ కార్యక్రమలలో పాల్గొని ప్రాంగణం అంతా అయ్యప్ప స్వామి నామస్వరణతో మారుమోగిపోతున్నాయి. చాట్రాయి మండలంలో పలు గ్రామాలలో వందలాది మంది భక్తులు మాలలు వేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం గత 35 సంవత్సరాలుగా ఆనువాయితీగా వస్తోంది. చాట్రాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో 40 రోజులు పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం వల్ల నిత్యం 300నుండి 500 మంది భక్తులకు పైగా అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. మండలంలో పోలవరం, జనార్ధన వరం, చీపురుగూడెం తదితర గ్రామాల్లో కూడా అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో అయ్యప్పలు అరటి చెట్టుతో అయ్యప్ప గుడిగా అలంకరించి పడి పూజలు నిర్వహిస్తూ ఉంటున్నారు. గ్రామాల్లో అయ్యప్ప సందడితో భక్తి వాతావరణం మరింత పెరిగగా కార్తీకమాసం కూడా కలిసి రావడంతో గ్రామీణ ప్రాంతాల మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలో అప్పారావు గురుస్వామి, శివ గురుస్వామి మల్లికార్జున గురుస్వామి చిట్టిబాబు గురుస్వామి శీను గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజల కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో అయ్యప్ప స్వాములు సంఖ్య రోజుకి పెరిగిపోతోంది. ఈ విధంగా అయ్యప్ప స్వాముల సందడి గ్రామాల్లో ఉండగా వీరికి తోడుగా దుర్గాభవాని,ఆంజనేయ స్వామి, శివ దీక్షలు చేపట్టారు. అయ్యప్ప మాల వేసుకుని 40 రోజులు దీక్ష చేసి అయ్యప్పను మనసారా పూజిస్తే మోక్షం లభిస్తుందని భక్తులు విశ్వాసంగా చెప్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కూడా అయ్యప్ప స్వామికి ఆదరణ మరింత పెరిగిందనే చెప్పాలి. ఈ విధంగా అయ్యప్ప స్వాముల సందడి మండలంలో అన్ని గ్రామాలలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది.

## రైతులకు నష్టాన్ని మిగిల్చిన ముంతా తుఫాన్



మొగల్తూరు అక్టోబర్ 29( ప్రభాత వార్త) మొగల్తూరు మండలంలో ముంతా తుఫాన్ ప్రభావం వల్ల మామిడి సపోటా ఉసిరి, జీడి, కొబ్బరి తోటల రైతులకు అపారమైన నష్టాన్ని కలిగించింది.మంగళవారం రాత్రి తుఫాన్ ప్రభావం వల్ల మొగల్తూరు మండలంలో ఈదురు గాలులు మరియు భారీ వర్షం కురవడంతో తోటల గల రైతులకు ఎక్కువ నష్టాన్ని కలిగించడంతో రైతులు లబోదిబోమంటూ గగ్గోలు పెడుతున్నారు. గాలి వాన వలన కలిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం గుర్తించి వెంటనే ఆదుకోవాలని పలువురు రైతులు ఏక కంఠంతో కోరుతున్నారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగు దిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా: జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి, పెదపాడు, పోలవరం, కొయ్యలగూడెం
ప.గో జిల్లా: ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్: 9704502377

# పూడిపోయిన తూములకు మరమ్మతులు



చాట్రాయి, అక్టోబర్ 29, ప్రభాతవార్త మండలంలోని జనార్ధనవరం గ్రామంలో రామయ్య గారి చెరువు వద్ద తుమ్మగూడెం వెళ్ళు బీటీ రోడ్డులో ఉన్న తూములు పూడిపోయి రోడ్డుపై వరద ఎక్కువగా ప్రవహించడంతో ప్రజలకు రాకపోకలు స్తంభించడంతో పూడిక తీసే పనులను చేపట్టినట్లు జనార్ధనవరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదాసు పుల్లయ్య చెప్పారు. తూములు పూడి పోవటంతో సదరు సమాచారాన్ని గృహనిర్మాణ శాఖ , సమాచార శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. దీనితో నీటి సంఘం అధ్యక్షులు వంగల సుబ్బారావు సహకారంతో జేసీబి తీసుకువచ్చి తూములలో పేరుకుపోయిన పూడికను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండ చేసినట్లు ఆయన వివరించారు. రైతుల వెళ్ళే దారిలో రోడ్డు గండిపడటం వలన గండిని పరిశీలించగా తూములు వేయించమని రైతులు కోరినట్లు వారు తెలియజేశారు.పూడిక తీయటం పట్ల రైతులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి బలుసాని రత్తయ్య మరియు ఎస్ఐ డి రామకృష్ణ రెవెన్యూ కార్యదర్శి శోభన్ బాబు, పంచాయతీ సెక్రటరీ హనుమంతురావు,ఏఈఓ మరియు రైతులు పాల్గొన్నారు.

# అన్నదాత... గుండెకోత... వరి సాగుపై మొంథా తుపాను ప్రభావం

## నేలనంటిన వరి సాగు... రైతుల్లో కలవరం...



తణుకు, అక్టోబర్ 29(ప్రభాత వార్త): మొంథా తుపాను తీరం దాటింది... తీరం దాటిన సమయంలో భారీ ఎత్తున గాలులు వీచాయి... ఇదే సమయంలో వరి పంటపై విరుచుకుపడిన తుపాను ఇప్పుడు రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. తణుకు పరిసర ప్రాంతాల్లో ఖరీఫ్ పంట ప్రస్తుతం చివరి దశకు చేరింది. మరో వారం పది రోజుల్లో కోతకు వచ్చే దశలో తుపాను ప్రభావంతో నేలనంటింది. ఎకరాకు రూ. 20 నుంచి రూ. 25 వేలు వరకు పెట్టుబడి పెట్టిన రైతులు చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాత కన్నీటి పర్యంతమవుతున్నాడు. తణుకు నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టుపై ఇప్పటికే సుమారు రూ. 90 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు.

**40 వేల ఎకరాల్లో...**

తణుకు నియోజకవర్గ పరిధిలోని ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో 40,100 ఎకరాల విస్తీర్ణంలో 22,500 మంది రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. సాధారణంగా 145 రోజులకు పంట కోతకు వస్తుంది. ఈదురు గాలులకు తట్టుకుంటుందనే ఉద్దేశంతో ఎక్కువ ఆయకట్టు పరిధిలో స్వర్ణ రకం విత్తనం సాగు చేశారు. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో, కొంత మేర గింజ గట్టిపడే దశలో ఉంది. ఇప్పటి వరకు సగటున ఎకరాకు రూ. 20 నుంచి రూ. 25 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే బలమైన ఈదురు గాలులకు చేలలో కొంత భాగం వరి నేలకొరిగింది. దీంతోపాటు చేలల్లో నీరు వచ్చి చేరింది. 10 సెంట్ల భూమిలో పడిన వరిని నిలబెట్టి కట్టాలంటే నలుగురు కూలీలు అవసరమవుతున్నారని, రూ. 3 వేలకు పైగా అదనపు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

**మరింత భారం...**

గింజ పాలు పోసుకొనే దశలో పడిన వరిని అంచనా ప్రకారం నిలబెట్టి కట్టలు కట్టినా పెద్దగా ప్రయోజనం ఉండదని పైగా వాపోతున్నారు. గింజ నాణ్యత కోల్పోవడం, తాలు గింజలు వంటి సమస్యల కారణంగా దిగుబడి బాగా తగ్గుతుందని ఈ చెబుతున్నారు. సొంత భూమి కొంత ఉంటే మరో నాలుగైదు ఎకరాలు కౌలుకి తీసుకొని సాగు చేస్తున్న రైతులే 80 శాతం మంది ఉన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. తుపాను ప్రభావం చూపితే ఇప్పటికే చర్యలతో పెట్టిన పెట్టుబడితో పాటు కౌలు చెల్లింపు మరింత భారమవుతుందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల భద్రతకు భరోసా కల్పించిన యంత్రాంగం

## అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే రాధాకృష్ణ ధన్యవాదాలు

**తణుకు, అక్టోబర్ 29 ( ప్రభాత వార్త) :**మొంథా తుపాను పేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ నిరంతరం అందుబాటులో ఉండి ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్న అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధన్యవాదములు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి తుపాను తీరం దాటే వరకు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలానే ఉద్దేశంతో మొంథా తుపాను మొదలైన నాటి నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు ఏర్పాటు చేయడంలో కృషి చేశారన్నారు. ముఖ్యంగా తుపాను ప్రభావంతో వీచిన తీవ్రమైన గాలులకు తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడి అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పటికీ మున్సిపల్ అధికారులతోపాటు ఫైర్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, ఎంపీడీవోలు, తహసీల్దార్లు స్పందించి రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు చెట్లు తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు రానీయకుండా చూశారన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం వారి వారి నివాసాలకు పంపించివేశారని చెప్పారు. తుపాను ప్రభావంతో మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
ఏలూరు బ్రాంచ్, డి.నెం.25-5-116, ఫైర్ స్టేషన్ దగ్గర, ఎన్.ఆర్.పేట, ఏలూరు - 534002. పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 8812 223487
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)
[illegible] శ్రీ వేమూరి [illegible] (అప్లికెంట్) మరియు శ్రీమతి వేమూరి లక్ష్మి (కో-అప్లికెంట్), నివాసం: డోర్ నెం.27-20-60, 17వ లైన్, [illegible], ఏలూరు, ఆంధ్రప్రదేశ్-534002 [illegible] తేది.11.08.2025 నాటికి రూ.58,11,067.67 పై [illegible] + తేది.12.08.2025 నుండి [illegible] తేది. 12-08-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.
[illegible] సెక్షన్ 13(4)కు [illegible] రూల్ 8 ప్రకారము తేది.28-10-2025న [illegible]
[illegible] తేది.28.10.2025 నాటికి రూ.59,37,938.12 పై [illegible] + తేది:28.10.2025 నుండి [illegible] బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు మెయిన్ బ్రాంచ్ [illegible]
[illegible] సెక్షన్ 13 (8) [illegible]
స్థిరాస్తి వివరములు:
ఆంధ్రప్రదేశ్, ఏలూరు [illegible], 13వ [illegible] నెం.1075027084, డోర్ నెం.26-1-38, ఆర్.ఎస్.నెం.98/10, 98/11లోని 130 [illegible] శ్రీమతి వేమూరి లక్ష్మి గారి [illegible] డోర్ నెం.26-4-36 [illegible] 28.6 [illegible] 40 [illegible] 22.0 [illegible] 51.3 [illegible] 51.9 [illegible]
తేది : 28-10-2025
ప్రదేశం : ఏలూరు
సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా


# ఇంటిపై కూలిన భారీ వృక్షం



మొగల్తూరు అక్టోబర్ 29 (ప్రభాతవార్త) ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ముంతా తుపాన్ గా మారి ఈదురుగాలులు భారీ వర్షంతో విజృంభించడంతో మంగళవారం అర్ధరాత్రి మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి నక్క వారి పాలెం లో ఒక భారీ వృక్షం ఈదురు గాలులకు ఇంటిపై పడింది, దీని వలన పెను ప్రమాదం తప్పింది బుధవారం ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు మొగల్తూరు టౌన్ అధ్యక్షులు బొల్లా చంటి, ఏఎంసి డైరెక్టర్ డొల్ల రత్నం రాజు , వెలిది పుల్లారావు, మామిడి శెట్టి సత్యనారాయణ, కౌరునాగేశ్వరరావు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు

## రైతులెవరు అధైర్య పడవద్దు

### పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్సీ జయమంగళ



మండవల్లి,అక్టోబర్ 29(ప్రభాతవార్త): భారీ వర్షాలకు గాలివానల కారణంగా మండవల్లి మండలం లో అల్లినగరం పెరికేగూడెం గ్రామాలలో పడిపోయిన పంట పొలాలను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దనీ పడిపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే విధంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తో కలిసి ఎమ్మెల్సీ వెంకటరమణ కృషి చేస్తామన్నారు.కూటమి ప్రభుత్వం రైతులకు అన్నివేళలా అండగా ఉంటుందంటూ భరోసా ఇచ్చారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో అల్లినగరం సర్పంచ్ జంపాన వీరబాబు , ఎలికే రాంబాబు, ఖాదర్ బాషా, నారగాని కొండ మండల పార్టీ అధ్యక్షులు, పింటి ఆంజనేయులు, బాదిన వెంకన్న బాబు, విజయ్ కుమార్, మైగాపుల రామాంజనేయులు, చెన్నం శెట్టి నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి ప్రాణ నష్టాన్ని నిరోధించగలిగాం

## పునరావాస కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ



కైకలూరు అక్టోబర్ 30(ప్రభాతవార్త) :తుఫాన్ ప్రభావంతో రాత్రి సమయంలో ఈదురు గాలులు, కరెంటు అక్కడక్కడ స్తంభాలు కూలి కరెంటు స్తంభించడంతో గ్రామాల్లో అంధకారంగా మారి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు కైకలూరు నియోజకవర్గం రూరల్ సీఐ రవికుమార్, నాలుగు మండలాల ఎస్ఐలు కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ, వీరి ఆధ్వర్యంలో టౌన్ ఎస్సైలు వారి సిబ్బందితో కలిసి తక్షణ చర్యలు చేపట్టారు. నియోజకవర్గ పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగి సహాయ చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, మరియు కైకలూరు టౌన్ పరిధిలోని పెద్ద పెద్ద వృక్షాలు రోడ్డుకి అడ్డంగా విరిగిపడిన చెట్లను యంత్రాల సాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పునరుద్ధరించారు. కలిదిండి గ్రామం సంత మార్కెట్ వెనుక చెరువు పొంగి నీళ్లు ఇళ్లల్లోకి వెళ్లడంతో అక్కడ నివాసం ఉంటున్న 25 కుటుంబాల వారిని జెడ్ పి హెచ్ స్కూల్ పునరావసర కేంద్రాలకు తరలించారు. అలాగే తాడినాడ గ్రామంలో తుఫాను పునరావాసన కేంద్రాల్లో సుమారుగా 33 మందిని తరలించారు. కొల్లేరు ఉధృతంగా ప్రవహించటంతో కైకలూరు మండలం గోకర్ణ పురం నుండి పైడి చింతపాడు వెళ్లే రహదారి ముంపు బారిన పడటంతో అటువైపు ఎవరు వెళ్ళనివ్వకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ కైకలూరు పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇంత పెద్ద తుఫాను పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఉద్యోగ నిర్వహణ చేయటం వల్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రాణానికి కూడా హాని జరగకుండా కాపాడగలిగేమన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ చెట్లు మరియు కరెంటు స్తంభాలు విరిగిపడిన వెంటనే సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవడం వలన ఇటు ట్రాఫిక్ కు గాని ప్రజలకు గాని ఇబ్బందులు కలగకుండా తొలగించినట్లు తెలిపారు.

## పునర్వశ కేంద్రమును పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగారాణి



మొగల్తూరు అక్టోబర్ 29 (ప్రభాతవార్త) ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముంతా తుఫాన్ గా మారి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మొగల్తూరు మండలంలో పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన పునర్వశ కేంద్రములలో భాగంగా కేపీ పాలెం నార్త్ గ్రామపంచాయతీ పరిధి మెట్టిరేవు గ్రామంలో ఏర్పాటు చేసిన పునర్వశ కేంద్రమును బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు, అనంతరం పునర్వశ కేంద్రంలో ఉన్న ప్రజలతో మాట్లాడుతూ తుఫాన్ బాధితులు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతులు గురించి తెలుసుకున్నారు, వారితో పాటుగా మండల తాసిల్దార్ కి రాజ్ కిషోర్, ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## 38వ యోగాసన పోటీలలో సత్తా చాటిన ఏలూరు జిల్లా టీం

ఆగిరిపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త. :రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలలో జిల్లాలోని నూజివీడు, ఆగిరిపల్లి, శోభనాపురం, వడ్లమాను తదితర గ్రామాలకు చెందిన యోగ సాధకులు యోగా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు.విశాఖపట్నంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన యోగ అసోసియేషన్ 38వ యోగాసనా ఛాంపియన్షిప్ పోటీలకు ఏలూరు జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు యండూరు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, కోశాధికారి ఏపీవీ బ్రహ్మచారి, యోగ గురువులు టీవీకె కుమార్ నేతృత్వంలో సుమారు 35 మంది యోగ సాధకులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈనెల 25, 26 తేదీలలో జరిగిన ఈ పోటీలను16 డివిజన్లు గా విభజించి నిర్వహించగా, ఏలూరు జిల్లా యోగ అసోసియేషన్ నుండి యోగా సాధకులు పది డివిజన్లో పోటీపడ్డారు. ఏడు డివిజన్లో ఈ ప్రాంతం సాధకులు విజయం సాధించారు. ఈ పోటీలలో బొద్దూరు పద్మ శ్రీలత 3 స్థానంలో నిలిచి కాంస్యం సాధించగా, పత్రి కనక భూషణం రజిత పథకాన్ని సాధించారు. 6 వ స్థానంలో టి. ప్రసన్న సాయి,7వ స్థానంలో కే. శ్రీనివాసరావు,8వ స్థానంలో ఎం. జ్యోతి కుమారి, 9వ స్థానంలో యండూరు నరసింహమూర్తి, 10 వ స్థానంలో భావన నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన శ్రీ సాయి దివ్యామృత స్వామి (ఎస్ కోట మండలం విజయనగరం) ఇన్కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ కె. ప్రసాద్ (విశాఖపట్నం), ఆంధ్రప్రదేశ్ యోగ అసోసియేషన్ అధ్యక్షులు కోన కృష్ణదేవరాయలు. ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్ లు విజేతలకు షీల్డ్స్, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారని ఏలూరు జిల్లా యోగా ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు తెలిపారు.ఏలూరు జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ జిల్లాకు విచ్చేసిన, యోగా సాధకులు అందరికీ అసోసియేషన్ తరపున శుభాభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు యండూరు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, కోశాధికారి ఏపీవీ బ్రహ్మచారిలు తెలిపారు.

# స్వల్ప నష్టంతో తుఫాన్ నుండి బయట పడ్డాము.



ఆగిరిపల్లి అక్టోబర్ 29 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా తుఫాను నుండి ఎటువంటి నష్టం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తాసిల్దార్ పివిన్నీ ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మూడు రోజులుగా పునరావాసకేంద్రాన్ని నిర్వహిస్తున్నామని వారికి సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో చెరువులు విషయంలో అధికారులతో కలిసి పర్యవేక్షించడం జరిగిందని చెరువులు ఎక్కడ తెగటం గండ్లు పడటం జరగలేదనితెలిపారు. మండలంలోని కృష్ణావరంలో ఒక చెట్టు సగురు లో రెండు చెట్లు పడిపోయాయని వాటిని జెసిబి కట్టర్ సహాయంతో వెంటనే తొలగించామని తెలిపారు. నూగండపల్లిలో మంగళవారం రాత్రి కరెంట్ స్తంభం పడిపోయిందని దాన్ని వెంటనే తొలగించి విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని బుధవారం కొత్త స్తంభం వేయడం జరిగిందన్నారు. మండలంలో వరి మినుము ప్రతి పంటలు ఉన్నాయని తుఫాను వలన నష్టపోయిన వాటిని వ్యవసాయ శాఖ వారు పరిశీలించి నివేదిక తయారు చేస్తారని తెలిపారు.

## తుఫాన్ పునర్వశ కేంద్రాలని పరిశీలించిన కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు



మొగల్తూరు అక్టోబర్ 29 ( ప్రభాతవార్త) : పేరుపాలెం కేపీ పాలెం పాతపాడు గ్రామాలలో తుఫాన్ బాధితులకు ఏర్పాటు చేసిన పునర్వశ కేంద్రాలని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు బుధవారం రాత్రి సందర్శించారు. అక్కడ అధికారులతోనూ తుఫాన్ బాధితులతోనూ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ద్వారా బాధితులకు ఏర్పాటు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు అనంతరం తుఫాను బాధితులకు కొత్తపల్లి సుబ్బారాయుడు స్వయంగా భోజనం వడ్డించారు. వారితో పాటుగా కూటమి నాయకులు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు ఉన్నారు.

## పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్.

అత్తిలి- అక్టోబర్ 29( ప్రభాత వార్త) :అత్తిలి శివారు రామన్నపేటలో గుణ్ణం రామకృష్ణ ఇంటి వద్ద పేకాట ఆడుతున్న గుణ్ణం రామకృష్ణ తో పాటు మరో నలుగురిని అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు తెలిపారు. నిందితుల నుండి 2 150 రూపాయలు నగదు ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## పారా షూటింగ్ - రైఫిల్ సిట్టింగ్ లో సిల్వర్ మెడల్ సాధించిన యడ్లపల్లి.



అత్తిలి- అక్టోబర్ 28( ప్రభాత వార్త): విజయవాడ ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ వారు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర పారా షూటింగ్ ఛాంపియన్ షిప్ -2025 లో ఎస్ హెచ్ - సిట్టింగ్ విభాగములో అత్తిలి చెందిన యడ్లపల్లి సూర్యనారాయణ సిల్వర్ మెడల్ సాధించినట్టు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి. రామస్వామి తెలిపారు. సూర్యనారాయణ కు షూటింగ్ అకాడమీ డైరెక్టర్, చీఫ్ కోచ్ యన్. సుబ్రహ్మణ్యశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు కె. దయానంద్ చేతుల మీదుగా మెమంటో, సర్టిఫికెట్ అంద జేశారు. పారా స్పోర్ట్స్ లో దివ్యాంగులు ఉన్నతస్థాయి కి చేరుకునేలా కృషి చేస్తున్న రాష్ట్ర గ్రంధాలయాల శాఖా చైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ అంధ్రప్రదేశ్ అధ్యక్షులు గోనుకుంట్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామస్వామి కు సూర్య నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారిపై పడ్డ మర్రిచెట్టు, హుటాహుటిన తొలగింపు,



జీలుగుమిల్లి, అక్టోబర్-29, ప్రభాతవార్త: మండలంలోని లక్ష్మీపురం రహదారిపై మొంతా తుఫాన్ కారణంగా పడిన మర్రి చెట్టును అధికారులు బుధవారం సకాలంలో స్పందించి హుటాహుటిన తొలగించి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ ఆకుల సుబ్బరాయన్, ఇంచార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నిఖిల్ మధు శరన్, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# "మోంత" తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మాజీమంత్రి చెరుకువాడ పర్యటన,



పెనుమంట్ర-ప్రభాతవార్త :మండలంలోని నత్తా రామేశ్వరం, పెనుమంట్ర, గురువు, మాముదూరు, పాలమూరు గ్రామాల్లో మాజీ మంత్రి ఆచంట మాజీ శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు తుఫాన్ ప్రభావిత పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆలమూరు, బట్లమోటూరు, మార్టేరు, వెలగలేరు ప్రాంతాల్లో పంట నష్టాన్ని ప్రత్యక్షంగా గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. మురుగు నీరు పూడికతీత వెంటనే చర్యలు చేపట్టి నీట మునిగిన పంట పొలాలలో మురుగునీటి నుంచి రక్షించాలని కాలువ పూడిక తీతలు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ గూడూరు దేవేంద్రుడు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి కిరణ్, బిసి సెల్ అధ్యక్షులు దొంగ దుర్గాప్రసాద్, పోతుమూడి రామచంద్రరావు, చింతపల్లి గురు ప్రసాద్, తమనంపూడి వీర్ రెడ్డి, తమనంపూడి అయ్యప్ప రెడ్డి, ఎల్లారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, ముదునూరి నాగరాజు, పాలసత్తి రాజా రెడ్డి, భూపతి రాజు శ్రీనివాసరాజు, తాడి రాజారెడ్డి, భోగి రెడ్డి మారుతి రావు, తాతాజీ, వేణుమాధవ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బుర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాఠశాలలు ప్రారంభం

ఆగిరిపల్లి అక్టోబర్ 29 ప్రభాతవార్త :ఆగిరిపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి హేబేలు సూచనలు జారీ చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గడంతో గురువారం నుండి పాఠశాలలను యథావిధిగా పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల భవనం, ప్రాంగణం, పైకప్పు, చెట్లు, టైల్స్ పరిశీలించి ఎలాంటి ప్రమాదం లేకుండా చూసుకోవాలని సూచించారు. తాగునీటి వనరులు పరిశీలించి నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ లైన్‌లు, సాకెట్లు సురక్షితంగా ఉన్నాయా అని తనిఖీ చేయాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉండడం లేదా గోడ కూలే ప్రమాదం వంటి పరిస్థితులు ఉంటే పాఠశాలను తాత్కాలికంగా మూసి మండల విద్యా కార్యాలయానికి తెలియజేయాలని హేబేలు ఆదేశించారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీతో చర్చించి పాఠశాల సురక్షితం అని నిర్ధారించుకున్న తర్వాతే విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించాలని ఆయన సూచించారు. విద్యార్థులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి సంరక్షణ బాధ్యత ఆ స్కూల్ హెడమాస్టర్స్ దే అని స్పష్టం చేశారు.

# ఘనంగా 'మాస్ జాతర' ప్రి రిలీజ్ వేడుక




**మాస్ మహారాజా** రవితేజ అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జె.ఆర్.సి కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ వేడుకకు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. 'అభిమానుల మధ్యలో జరిగే ఇలాంటి వేడుకకు హాజరవ్వడం నాకిష్టం. నన్ను ఆహ్వానించిన నాగవంశీ గారికి కృతజ్ఞతలు. రవితేజ గారితో నాది 20 ఏళ్ల అనుబంధం. చాలాఏళ్లుగా రవితేజ గారిపై అభిమానులు ఎంతో ప్రేమని కురిపిస్తున్నారు. తన సహజ నటనతో పాత్రకు ప్రాణం పోస్తారు. ఇడియట్, కిక్ సహా రవితేజ గారు నటించిన పలు సినిమాలు తమిళ్‌లోనూ మంచి ఆదరణ పొందాయి. రవితేజ గారు ఇలాగే వినోదాన్ని పంచుతూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అక్టోబర్ 31న మాస్ జాతర రూపంలో రవితేజ గారి జాతర చూడబోతున్నాం. నాగవంశీ గారు వరుస సినిమాలు చేస్తున్నారు. ఆయన బ్యానర్‌లో నేను ఒక సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. అక్టోబర్ 31 విడుదలవుతున్న మాస్ జాతర సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. 'నాకిష్టమైన వ్యక్తుల్లో ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర గారు ఒకరు. ఆయన వేసిన సెట్స్ అద్భుతంగా ఉంటాయి. ఈ చిత్రంలో యాక్షన్ బాగుందంటే ఆ క్రెడిట్ మా ఫైట్ మాస్టర్స్ వెంకట్, పృథ్వీకి వెళ్తుంది. మా సంగీత దర్శకుడు భీమ్స్ ఇంకో చార్ట్ బస్టర్ ఇచ్చాడు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఇచ్చాడు. శివుడు పాత్ర చేసిన నవీన్ గురించి మాట్లాడాలి. నవీన్ ఇలా కూడా చేయగలడా అని ఆశ్చర్యపోయేలా చేశాడు. రాజేంద్రప్రసాద్ గారి పాత్ర అద్భుతంగా ఉంటుంది. నాది, శ్రీలీలది సూపర్ హిట్ జోడి. ఈ సినిమాలో కొత్త శ్రీలీలను చూడబోతున్నారు. ఈరోజు గెస్ట్ గా విచ్చేసిన సూర్య గారికి థాంక్యూ సో మచ్. భాను రూపంలో మన పరిశ్రమకి మరో మంచి దర్శకుడు వస్తున్నాడు. మాస్ మాత్రమే కాదు, అన్ని రకాల సినిమాలు చేయగలడు. రచయిత నందుకి మంచి భవిష్యత్తు ఉంది. మాస్ జాతర చిత్రం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. 'పెళ్లి సందడి విడుదలకు ముందు రవితేజ గారితో ధమాకా సినిమా చేశాను. భాను గారు అద్భుతంగా సినిమాని తెరకెక్కించారు. నాకు, రవితేజ గారి మధ్య వచ్చే సన్నివేశాలు, అలాగే రాజేంద్ర ప్రసాద్ గారి సన్నివేశాలు చాలా బాగుంటాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీ గారికి, సితార బ్యానర్‌కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ సినిమా చూసి ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు" అన్నారు. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. "అన్ని మసాలాలు సరిగ్గా ఉన్న మాస్ సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. ఆ లోటుని తీర్చే సినిమా ఈ మాస్ జాతర. ఇప్పటిదాకా ఎందరో హీరోలతో కలిసి నటించాను. కానీ, రవితేజతో నటించలేదు. 'మాస్ జాతర' లాంటి మంచి సినిమా చేయాలనే ఇంత సమయంపట్టినట్టుంది. దర్శకుడు భాను అద్భుతమైనసినిమాని రూపొం దించాడు. సినిమా ఎలా ఉంటుంది? నా పాత్ర ఎలా ఉంటుంది? అనేది ఇప్పుడు చెప్పను. మీరు ఖచ్చితంగా థియేటర్ లోచూసి ఆనందించాల్సిన చిత్రమిది. అద్భుతమైన మాస్ సినిమా ఇది. 'మాస్ జాతర' సినిమా చూసిన తర్వాత తెలుగు ప్రేక్షకులంతా మమ్మల్ని మెచ్చుకుంటారు." అన్నారు.

నటుడు నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "చాలారోజుల తర్వాత మాస్ జాతర రూపంలో శక్తివంతమైన పాత్ర లభించింది. రవితేజ గారు నా లాంటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. శివుడు అనే అద్భుతమైన పాత్రను నాకు ఇచ్చిన దర్శకుడు భాను గారికి ధన్యవాదాలు. 'అరవింద సమేత'లో బాలరెడ్డి పాత్ర తర్వాత నా కెరీర్ లో గుర్తిండిపోయే పాత్ర ఇది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌కి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. అక్టోబర్ 31న విడుదలవుతున్న ఈ సినిమా అసలు నిరాశ పరచదు. ముఖ్యంగా రవితేజ గారి అభిమానులు ఈ సినిమాని బాగా ఎంజాయ్ చేస్తారు." అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. 'వెంకీ, విక్రమార్కుడు, కిక్ చిత్రాల్లాగా రవితేజ గారి సినిమా అంటే ఏమి ఆశించి థియేటర్‌కి వస్తారో.. అన్ని అంశాలు మాస్ జాతరలో ఉంటాయి.ఈ వేడుకకు విచ్చేసిన సూర్య గారికి ధన్యవాదాలు' అన్నారు.దర్శకుడు భాను భోగవరపు మాట్లాడుతూ.. "రవితేజ గారు దర్శకులను పరిచయం చేసే ఒక యూనివర్సిటీ నెలకొల్పారు. ఆ యూనివర్సిటీలో సీట్ ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు.నా దగ్గర ఉన్న ఒకే ఒక అర్హత నా కథ. ఆ కథ నచ్చి రవితేజ గారు నాకు అవకాశమిచ్చారు. ఇందులో తులసి అనే పాత్ర శ్రీలీల పోషించారు. భీమ్స్ గారు అద్భుతమైన సంగీతం అందించారు. నటీనటులు, సాంకేతిక బృందం ఇచ్చిన మద్దతుని ఎప్పటికీ మరిచిపోలేను. నా దృష్టిలో నాగవంశీ గారి కంటే గొప్ప క్రిటిక్ లేరు. ఆయనకు సినిమా నచ్చిందంటే అది హిట్టే. వంశీ గారు ఈ సినిమా చూసి చాలా బాగుంది అన్నారు. అక్టోబర్ 31 కోసం మీ అందరిలాగే నేను కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నాను." అన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ.. "ధమాకా తర్వాత చిరంజీవి గారి సినిమాకి పనిచేసే అవకాశాన్ని దక్కించుకున్నాను. ఈరోజు నేను ఇక్కడ ఇలా నిలబడి ఉన్నానంటే దానికి కారణం రవితేజ గారు. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అన్నారు.

# హీరోయిన్‌గా 'జాన్వి ఘట్టమనేని' ఎంట్రీ



**సూపర్‌స్టార్ కృష్ణ** ఘట్టమనేని వారసత్వం తెలుగు సినీ పరిశ్రమలో విశిష్టమైనది. ఇప్పుడు ఘట్టమనేని లెగసీ నుంచి తొలిసారిగా హీరోయిన్‌గా వెలుగులోకి రానున్నది జాన్వి ఘట్టమనేని. ఆమె తన తాత కృష్ణగారి గ్రేస్, తన మామ మహేష్ బాబుగారి మాగ్నటిజం, తల్లి మంజుల ఘట్టమనేని గారి ఆత్మీయతను తనలో కలుపుకుని గొప్ప వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంది. జాన్వి ఘట్టమనేని క్లాసిక్ బ్యూటీ. ఇటీవల వెలుగుచూసిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇండస్ట్రీ వర్గాలు ఆమెను 'ఇటీవలి తెరపై కనిపించే అత్యంత అందమైన అమ్మాయి'గా అభివర్ణిస్తున్నాయి. దర్శకులు ఆమె నటనను చూసి 'మాటలకన్నా కళ్ళతోనే భావాలను చెప్పగల సహజ నటిగా' వర్ణించారు. ఆమె ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా ప్రత్యేకం. పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్, గేమింగ్ ప్రతి విషయంలోనూ సమాన ఆసక్తి చూపిస్తుంది. జిమ్‌లో ట్రైనింగ్ తో మొదలై తన డే, నైట్ తన ఆర్ట్ కార్నర్‌లో ముగుస్తుంది. కొత్తగా సినీ రంగంలోకి వచ్చే వాళ్లు సాధారణంగా ఒకే గుణంతో గుర్తింపుపొందుతారు. కానీ జాన్వి ఘట్టమనేని మాత్రం అందం, మాధుర్యం, ప్రతిభ, వారసత్వం.. ఈ నాలుగింటినీ కలగలిపిన ప్రత్యేక వ్యక్తిత్వం. బ్రాండ్ నిపుణులు ఆమెను 'దక్షిణాది శైలి, పాన్‌ఇండియా అప్పీల్ కలిగిన ఫేస్' అని పేర్కొంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణగారు, మహేష్ బాబు కుటుంబం నుండి వస్తున్న జాన్వి ఎంట్రీ ఒక విధంగా విధి నెరవేరుతున్న క్షణం. జాన్వి సంప్రదాయలుక్ నుంచి మోడరన్ గ్లామర్ వరకు సునాయాసంగా మెరిసిపోతుంది. ఇంకా సినిమా రిలీజ్ కాకముందే ఆమెకు గుర్తింపు వచ్చేసింది. ఒక అద్భుతమైన జ్యువెలరీ క్యాంపెయిన్ తర్వాత, జాతీయ స్థాయి బ్రాండ్లు, దర్శకులు ఆమెను సంప్రదించారు. నిర్మాతలు ఆమెను 'దశాబ్దంలో ఒక్కసారి దొరికే ఆర్టిస్ట్, మాట్లాడకముందే స్క్రీన్‌ను ఆక్రమించే ప్రెజెన్స్' అని చెబుతున్నారు. యాక్టింగ్ ట్రైనింగ్స్, డాన్స్ రిహార్సల్స్, ఫిట్‌నెస్ సెషన్‌లతో ఆమె షెడ్యూల్ ఇప్పటికే ఒక స్టార్ లా వుంటుంది. సినిమా కుటుంబంలో పుట్టినా, ఆమె నటనపైఉన్న ప్రేమ మాత్రం వారసత్వం కాదు ..సహజ స్వభావం. పదేళ్ల వయసులోనే తల్లి మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది' సినిమాలో కెమెరా ముందు కొచ్చిన జాన్వి తన సహజమైన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె నటించదు, ఫీల్ అవుతుంది. మంజులకి ఇది ప్రత్యేకమైన క్షణం. ఎన్నేళ్ల క్రితం ఆమెకూ నటనపై కలలు ఉండేవి, కానీ ఆ కాలం మహిళలకు అంత అనుకూలంగా ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ప్రపంచం సిద్ధంగా ఉంది, ప్రేమతోఉంది, ఎదురుచూస్తోంది. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వి కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వి చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం'అన్నారు మంజుల.



## 'చైనా పీస్' నుంచి సాంగ్ రిలీజ్

**నిహాల్ కోధాటి,** సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. యూనిక్ కాన్సెప్ట్, ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఇదేంటో జేమ్స్ బాండ్ సాంగ్ రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ ఈ సాంగ్‌ని ఎనర్జిటిక్‌గా కంపోజ్ చేశారు. స్ఫూర్తి జితేందర్, హారిక నారాయణ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. దినేష్ కాకర్ల లిరిక్స్ కాన్సెప్ట్‌ని చాలా ఫన్ ఫుల్ గా ప్రజెంట్ చేశాయి. ఈ చిత్రానికి సురేష్ రగుతు కెమరామ్యాన్. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'రాజు వెడ్స్ రాంబాయి' తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది: నిర్మాత వేణు ఊడుగుల

**అఖిల్, తేజస్విని** జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీవాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ చిత్ర రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూశాను. ఇది నా మనసుకు హత్తుకుంది. కొందరి లైఫ్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమా చేశారు. ఇది కాల్పనిక కథ అయితే మనం ఆ దర్శకుడి ఊహకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక ఎమోషనల్ ఫీల్ తో వస్తారు. అఖిల్ రాజు పాత్రలో బాగా నటించాడు. తేజస్విని తెలుగు అమ్మాయి. ఈ సినిమాలో తన స్క్రీన్ ప్రెజెన్స్, పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. హీరో సిద్ధు జొన్నలగడ్డ బ్రదర్ చైతన్య ఒక మంచి రోల్ చేశాడు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు అన్నారు. నటుడు చైతు జొన్నలగడ్డ మాట్లాడుతూ ఇది పక్కా తెలంగాణ సినిమా. తెలంగాణ నేటివిటీని, ఇక్కడి ప్రజల జీవితాలను ఈ చిత్రంలో చూస్తాం. తెలంగాణ నేటివిటీని ఇంత పర్ఫెక్ట్ గా చూపించిన సినిమా మరొకటి లేదు. ఈ చిత్రంలో ఒక ఇంపార్టెంట్ రోల్ చేయడం హ్యాపీగా ఉంది. అన్నారు. డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడుతూ '2016 నుంచి ఈ కథ పట్టుకుని తిరుగుతూ ఉన్నాను. ఒకే ఒక నెరేషన్‌లో వేణు ఊడుగులగారు మనం సినిమా చేస్తున్నాంరా తమ్ముడు అన్నారు. ఈటీవీ విన్ వారిని అప్రోచ్ అయితే వాళ్లకూ కథ నచ్చింది. సాయికృష్ణ, నితిన్ నాకు బ్రదర్స్‌లా సపోర్ట్‌చేశారు. సురేష్ బొబ్బిలి అన్న మ్యూజిక్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది'అన్నారు. ప్రొడ్యూసర్ వేణు ఊడుగుల మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్ మధ్య జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా ఈ చిత్ర కథను దర్శకుడు సాయిలు రాసుకున్నాడు. ప్రేమతో కూడిన విషాధభరితమైన ఈ సంఘటన ఆ ఊర్లోనే జరిగి అక్కడే సమాధి అయ్యింది. దాన్ని బేస్ చేసుకుని సాయిలు ఒక మంచి స్క్రిప్ట్ రాశాడు. ఈటీవీ విన్ వారి వల్లే నేను ప్రొడ్యూసర్ ను అయ్యాను. నవంబర్ 21న రాజు వెడ్స్ రాంబాయి రిలీజ్ అవుతుంది. నా డైరెక్షన్‌లో యూవీ క్రియేషన్స్‌లో ఓసినిమా చేయబోతున్నాను' అన్నారు. హీరోయిన్ తేజస్వినీ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమాలో రాంబాయి క్యారెక్టర్‌తో మీ ముందుకు రాబోతున్నాను. ఈ సినిమా, ఈ క్యారెక్టర్ నా మనసుకు ఎంతో దగ్గరయ్యాయి. సినిమా చూస్తున్నంత సేపు మీరు ఒక ఎమోషన్ కు గురవుతారు.తెలుగు ఆడియెన్స్ కు మా మూవీ బాగా నచ్చుతుంది'అన్నారు. హీరో అఖిల్ మాట్లాడుతూ 'నన్ను హీరోగా పరిచయం చేస్తున్న వేణు గారికి, ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్'అన్నారు. ఈటీవీ విన్ నితిన్ మాట్లాడుతూ 'మన ప్రాంతంలో జరిగిన ఒక నిజమైన ఘటన నేపథ్యంగా ఈ సినిమా ఉంటుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా రిలీజ్ అయ్యాక తెలుగు ఆడియెన్స్ అంతా ఒకసారి మా మూవీ గురించి మాట్లాడుకుంటారు' అన్నారు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమా గ్రేటెస్ట్ లవ్ స్టోరీ అని మేము అంటున్నాం. చిన్న సినిమా పెద్ద సినిమా అని చూడకుండా మంచి సినిమాలను రిలీజ్ చేస్తున్న వంశీ నందిపాటి, బన్నీ వాస్ గారికి థ్యాంక్స్' అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ లిటిల్ హార్ట్స్ మూవీ చేసిన వెంటనే మేము రిలీజ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమా రిలీజ్ తర్వాత ఇందులోని చాలా మందిని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ గుర్తుపెట్టుకుంటుంది' అన్నారు.






# 'ఆర్యన్' తెలుగులో నవంబర్ 7న రిలీజ్

**విష్ణు విశాల్** మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్టోబర్ 31న విడుదల చేయాలని ముందుగా అనుకున్న ఈ సినిమా నవంబర్ 7కి వాయిదా పడింది. అయితే, తమిళ వెర్షన్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 31న విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదలచేయనున్నారు. టీజర్, ట్రైలర్, ఫస్ట్ సింగిల్ అద్భుతమైన స్పందనను పొంది సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. వాయిదాకు గల కారణాలను స్పష్టం చేస్తూ విష్ణు విశాల్ ఒక అనౌన్స్‌మెంట్ విడుదల చేశారు. సినిమా అనేది రేస్ కాదు, అది ఒక వేడుకని నేను ఎప్పుడూ నమ్ముతాను. ప్రతి వేడుకకీ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం, వెలుగు ఉండాలి. మా చిత్రం 'ఆర్యన్' అక్టోబర్ 31న విడుదల కావలసి ఉంది. ఈ ప్రత్యేక తేదీ మాస్ మహారాజా రవితేజ గారి 'మాస్ జాతర', పవర్ ఫుల్ 'బాహుబలి ది ఎపిక్' మీ అందరినీ అలరించడానికి రావడంతో మరింత ప్రత్యేకమైనది. నేను ఎప్పటినుంచో రవితేజ గారిని గాఢంగా ఆరాధిస్తాను. స్క్రీన్‌పైన ఆయన ఎనర్జీకి మాత్రమే కాకుండా, మాకు ఆయన మద్దతు కూడా వుంది. అలాగే, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి గారికి నేను లైఫ్ టైం ఫ్యాన్‌ని. ఈ వారం వారి సినిమాలని సెలబ్రేట్ చేసుకోవడం సరైనదని భావిస్తున్నాను. 'ఆర్యన్' సినిమా తమిళ్ విడుదలైన ఒక వారం తర్వాత అదే పాషన్, థ్రిల్‌తో నవంబర్ 7న తెలుగులోకి వస్తుంది. మీ మద్దతుకు నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.నా నిర్ణయానికి అండగానిలిచిన మా డిస్ట్రిబ్యూటర్లు శ్రీ సుధాకర్ రెడ్డి గారు, మహేశ్వర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. నా సినిమా తనకంటూ ఒక మంచిస్థానం సంపాదించుకోవాలని నేను కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల కోసం విభిన్నమైన సినిమాలు అందించాలనే నా ప్రయత్నంలో ఇది ఒక మంచి ప్రారంభం అవుతుందని నేను నమ్ముతున్నాను అన్నారు.

# మాస్ అంశాలతో కూడిన చిత్రం 'మాస్ జాతర'
## - చిత్ర దర్శకుడు భాను భోగవరపు

**మాస్ మహారాజా** రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార=ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అక్టోబరు 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రం కోసం మాస్ మహారాజా అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు భానుభోగవరపు, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



**మాస్ జాతర ఎలా ఉండబోతుంది? ఏమైనా ప్రత్యేకతలు ఉన్నాయా?** ఇందులో మాస్ అంశాలు ఉంటాయి. అదే సమయంలో ఒక కొత్త పాయింట్ కూడా ఉంటుంది. రైల్వే పోలీస్ నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. ఆ నేపథ్యంలో జరిగే క్రైమ్ కొత్తగా ఉంటుంది. సన్నివేశాలు కూడా కొత్తగా ఉంటాయి. 'మాస్ జాతర' అనే టైటిల్ రవితేజ గారే చెప్పారు. కథ విన్న తర్వాత వినోదంతో పాటు అన్ని అంశాలు బాగున్నాయి అంటూ ఆయన ఈ టైటిల్ సూచించారు. ఆ టైటిల్ తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగింది. మాస్ అంశాలు మరిన్ని జోడించాను. థియేటర్ లో ప్రేక్షకులు కొన్ని సర్ ప్రైజ్ లు చూడబోతున్నారు. **ఏదైనా ప్రేరణతో ఈ రైల్వే పోలీస్ కథను రాసుకున్నారా?** ఇది కల్పిత కథే. అయితే ఈ కథ కోసం ఎంతో రీసెర్చ్ చేశాను. పలువురు రైల్వే పోలీస్ అధికారులను కలిసి వారి అధికారాల గురించి, వారు ఎదుర్కొన్న సంఘటల గురించి తెలుసుకున్నాను. వాటి స్ఫూర్తితో ఈ కథకుతగ్గట్టుగా కొన్ని సన్నివేశాలు రాసుకోవడం జరిగింది. **రవితేజ గారి 75వ చిత్రానికి దర్శకత్వం వహించడం ఎలా అనిపించింది?** ఇది రవితేజ గారి 75వ చిత్రమని మాకు ముందు తెలియదు. రవితేజ గారికి కథ నచ్చి, సినిమా ఓకే అయిన తర్వాత.. అప్పుడు లెక్కేస్తే 75వ సినిమా అని తెలిసింది. కథ బాగుంది, ఈ నెంబర్ల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా సినిమా చేయమని రవితేజగారు నన్ను ఎంతో ప్రోత్సహించారు. **నవీన్ చంద్ర గారి పాత్ర గురించి?** శివుడు అనే శక్తివంతమైన ప్రతినాయక పాత్ర పోషించారు. ఈ పాత్ర కోసం మొదట వేరే ఇద్దరు ముగ్గురు నటుల పేర్లు కూడా పరిశీలించాము. కానీ, సంతృప్తి లేదు. అలాంటి సమయంలో నవీన్ చంద్ర గారిని కలిసి కథ వినిపించాను. ఆయనకు కథ నచ్చి సినిమా చేయడానికి అంగీకరించారు. శివుడు పాత్రకు నవీన్ చంద్ర గారు పూర్తి న్యాయం చేశారు. సినిమా విడుదలైన తర్వాత శివుడు పాత్ర గురించి అందరూ ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. **శ్రీలీల పాత్ర గురించి ఏం చెబుతారు ?** ఇందులో తులసి పాత్ర కోసం వేరే ఏ హీరోయిన్ పేరు మేము అనుకోలేదు. కథ రాస్తున్నప్పుడు నేను, కథ వింటున్నప్పుడు హీరో గారు, నిర్మాతలు మాకు తెలియకుండానే.. హీరోయిన్ శ్రీలీల గారు అని అనుకున్నాం. ధమాకా జోడి కాబట్టి శ్రీలీల గారిని తీసుకోవాలనే ఆలోచనమాకులేదు. ఆమెపాత్రకు సినిమాలో ఎంతో ప్రాధాన్యముంది. గ్యాంగ్ లీడర్‌లో చిరంజీవి గారువిజయశాంతి గారి మధ్య సన్నివేశాలు ఎలాగైతే కామెడీ టచ్ తో మాసీగా ఉంటాయో.. ఇందులో రవితేజ గారుశ్రీలీల గారి మధ్య సన్నివేశాలు అలా ఉంటాయి. **రచయితగా కామెడీలో మంచి ముద్ర వేసిన మీరు, దర్శకుడిగా మాస్ సినిమాతో పరిచయమవ్వడానికి కారణం?** మాస్ జాతరలో కూడా వినోదానికి పెద్ద పీట వేశాము. అదేవిధంగా మాస్ అంశాలు కూడా పుష్కలంగా ఉంటాయి. నిజానికి 'సామజవరగమన' లాంటి రొమాంటిక్ కామెడీ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవ్వాలనుకున్నాను. అయితే ఎక్కువమంది మంచి మాస్ కథ ఉంటే చెప్పు అనేవారు. అలా 'మాస్ జాతర' కథ రాయడం జరిగింది. మాస్ కథ అంటే మొదట గుర్తుకొచ్చే పేరు రవితేజ గారు. ఆయనను దృష్టిలో పెట్టుకునే ఈ కథ రాశాను. రవితేజ గారు పోలీస్ సినిమాలు కొన్ని చేశారు. అందుకే కొత్తగా ఉండేలా ఈ రైల్వే పోలీస్ కథని రాసుకున్నాను. **భీమ్స్ గారి సంగీతం గురించి?** భీమ్స్ గారి పేరుని రవితేజ గారు సూచించారు. వారి కాంబినేషన్‌లో ధమాకా లాంటి చార్ట్ బస్టర్ వచ్చింది. అందుకే నేను కూడా భీమ్స్ గారు సంగీత దర్శకుడు అయితే బాగుంటుంది అనుకున్నాను. 'తు మేరా లవర్' అంటూ ఆయన స్వరపరిచిన మొదటి గీతమే నాకు ఎంతగానో నచ్చింది. **నిర్మాత నాగవంశీ గారి గురించి?** దర్శకుడిగా నాకిది మొదటి సినిమా అయినప్పటికీ నాగవంశీ గారు ఎంతో మద్దతుగా నిలిచారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఖర్చుకి ఎక్కడా వెనకాడకుండా ఆరున్నర కోట్లతో స్టేషన్ సెట్ వేయించారు. ఓ కొత్త దర్శకుడికి ఎక్కడ రాజీపడకుండా ఇంతటి సహకారం అందించడం మామూలు విషయం కాదు.

# 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' అన్ని జోన్లతో కలిపిన హాలీవుడ్ చిత్రం!



**హాలీవుడ్ యాక్షన్ ప్రపంచాన్ని** షేక్ చేయడానికి 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' సిద్ధమైంది. దర్శకుడు డాన్ ట్రాచెన్‌బర్గ్ నుంచి వస్తున్న ఈ సినిమా అంచనాలకు మించి ఉందని ఫస్ట్ స్క్రీనింగ్ రిపోర్ట్స్ తెలియజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిత్రం ఒక సూపర్ హార్ట్ టచింగ్ ఎంటర్టైనింగ్, యాక్షన్ అడ్వెంచర్ అని రిపోర్టులు చెబుతున్నాయి.'బ్యాడ్‌లాండ్స్' కేవలం రక్తపాతం, వేట గురించి మాత్రమే కాకుండా యాక్షన్, సైఫై, మానవ సంబంధాలతో కూడిన ఒక మాస్టర్‌పీస్ అని క్రిటిక్స్ కొనియాడుతున్నారు. ఇది ఫన్, ఎమోషన్ నిండిన గెలాక్సీ రోడ్ మూవీ అని రివ్యూలు దూసుకుపోతున్నాయి. ట్రాచెన్‌బర్గ్ ఈసారి ప్రెడేటర్ యూనివర్స్‌ను మునుపెన్నడూ లేని విధంగా విస్తరించారు. కేవలం సర్వైవల్ గేమ్‌కు పరిమితం కాకుండా, ప్రెడేటర్ హంట్ వెనుక ఉన్న లెజెండ్, యాట్జుజా కల్చర్, వారి కోడ్ ఆఫ్ హానర్ లాంటి లోతైన కథాంశాలను డీల్ చేయడం ఫ్యాన్స్‌కు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ విస్తృత కథనం సిరీస్‌కు కొత్త జీవితాన్ని ఇచ్చింది. ఇక డిమిట్రియస్ షుస్టర్‌కొలోమాటాంగీ ఎల్లెఫ్యానింగ్ జోడీ తెరపై అద్భుతమైన కెమిస్ట్రీని పండించనుంది. ఏలియన్ హంట్ ఉద్రిక్తత మధ్యలో కూడా వారి మధ్య కనిపించే మానవత్వం, ఫ్రెండ్‌షిప్, హ్యూమర్ సినిమాకు సరికొత్త ఫీల్‌ను తెచ్చి, ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా చేస్తుందని రివ్యూల్లో హైలైట్ అవుతోంది. ఈ అసాధారణమైన బజ్ మధ్య 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' భారతీయ అభిమానుల కోసం నవంబర్ 7న థియేటర్స్‌లోకి అడుగుపెట్టబోతోంది. ఈసినిమా ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో విడుదలవుతుంది. డాన్ ట్రాచెన్‌బర్గ్ సృష్టించిన ఈ 'ఎమోషనల్ అడ్వెంచర్ హంట్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తుందో చూడాలంటే నవంబర్ 7 వరకు వేచి చూడాల్సిందే.

# అందాలతో ఆకట్టుకుంటున్న మృణాల్!

**సౌత్ నుంచి నార్త్** వరకు చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. పలు రకాల ఫోటోలు షేర్ చేస్తూ.. ఫాలోవర్స్‌లో పెంచుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గ్లామర్ ఫోటోలుమాత్రమే కాకుండా సినిమాలకు సంబంధించి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు అంశాలను షేర్ చేస్తూ నిత్యం అభిమానులకు టచ్ లో ఉంటున్నారు. ఇకపోతే అలా కొన్ని విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఇటు గ్లామర్‌తో ఆకట్టుకుంటున్న హీరోయిన్స్‌లో మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు. ఈమధ్య సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్న ఈమె.. తాజాగా చీర కట్టులో కనిపించి సాంప్రదాయంగా అభిమానులను అలరించింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా పలు రకాల లవ్, ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈమె ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం అడవి శేషు హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాలో హీరోయిన్గా అవకాశాన్ని దక్కించుకుంది.. నిజానికి ఈ పాత్రలో శృతిహాసన్ ఎంపికైంది. కొంత భాగం షూటింగ్ కూడా కంప్లీట్ చేశారు. కానీ శృతిహాసన్‌కి చిత్ర బృందంతో విభేదాలు ఏర్పడ్డాయని.. అందుకే ఆమె తప్పుకోవడంతో ఆమె స్థానంలో మృణాల్‌ను తీసుకున్నారు అంటూ వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయంపై అడవి శేషు స్పందిస్తూ.. శృతిహాసన్ బిజీ షెడ్యూల్ వల్ల ఈ సినిమాకు ఎక్కువ రోజులు కేటాయించలేకపోతు ఇబ్బంది పడుతున్నారు అందుకే ఆమె తప్పుకోవడం తోనే మృణాల్‌ను తీసుకున్నామని ఆయన క్లారిటీ కూడా ఇచ్చారు.



# కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం

అమరావతి, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి: సమకాలీన సామాజిక వ్యవస్థ సారమంతా ఒక కార్టున్ ద్వారా చెప్పే వచ్చు. హాస్యం, వ్యంగ్యం, నిగ్గదీయడం అన్నింటి ఒక్క సారే కార్టున్ ద్వారా వెల్లడించవచ్చు. అటువంటి కార్టూన్ల ద్వారా తెలుగు భాషా వికాసాన్ని వృద్ధి చేయాలనే కీలక సంకల్పంతో ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కార్టూన్ల పోటీలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ, అమరావతి, గుంటూరు హైవేలో 2026 జనవరి 3, 4, 5 తేదీలలో నిర్వహించబడనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన "కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం" పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. శ్రీరామ్‌శేషు (నెల్లూరు), సునీల్(అమలాపురం), శ్రీసరస (హైదారాబాద్) ప్రథమ. ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. బొమ్మన్(విజయవాడ). పర్శి నాయుడు (మన్యం జిల్లా). కోరాడ రాంబాబుకు ప్రోత్సాహక బహుతులు లభించాయి. వీరందరికి సభలో వాటిని అందజేస్తారు. ఈ పోటీలు తెలుగు భాషా, సంస్కృతి, భావప్రకటనల అభివృద్ధికి కార్టూన్ కళాకారులు అందిస్తున్న సేవలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంగా ఉన్నాయని డా. గజల్ శ్రీనివాస్ అన్నారు.



# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

కాణిపాకం, అక్టోబరు 29 ప్రభాతవార్త: కాణిపాకంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలావున్నాయి. కాణిపాకం ఎస్సీ వాడకు చెందిన చిన పాపమ్మ అనే మహిళ బుధవారం ఉదయం వంటగదిలో టీ తయారు చేసుకోవడానికి వెళ్లి స్టవ్ వెలిగించింది. దీనితో ఉన్నట్టుండి మంటలు చెలరేగి సిలిండర్ పేలడంతో ఆమెకు నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. సిలండర్ పేలుడు దాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన చిన్న పాపమ్మను 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రాణిపేట సిఎంసి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కాణిపాకం ఎస్ఐ నరసింహులు తమ సిబ్బందితో కలసి సందర్శించి సిలెండర్ పేలుడుకు సంబంధించి కారణాలను పరిశీలించారు.



లోకోషెడ్ సీనియర్ డిఇగా నియమితులైన సి.వీరయ్య

# రైల్వే విద్యుత్ అధికారులకు స్థానచలనం

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 29 ప్రభాతవార్త; దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లులో పనిచేస్తున్న విద్యుత్ విభాగం అధికారులకు స్థానచలనం కల్పిస్తూ సంబంధిత ఉన్నత అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గుంతకల్లు సీనియర్ డిఇఇ టిఆర్ ఎస్ఓగా పనిచేస్తున్న సి వీరయ్యను స్థానిక విద్యుత్ లోకోషెడ్‌కు సీనియర్ డిఇఇ టిఆర్ఎస్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంతకల్లు విద్యుత్ లోకోషెడ్ టీఆర్ఎస్ డిఇఇగా పనిచేస్తున ఆర్ నాగేశ్వరరావును గుంతకల్లు డివిజనల్ టిఆర్ఎస్ఓ డిఇఇగా నియమించారు.

## తమిళనాడులో భారీ జాబ్‌స్కామ్

### దర్యాప్తుచేయాలని చెన్నై పోలీసులకు ఇడి లేఖలు

చెన్నై అక్టోబరు 29: తమిళనాడు భారీ జాబ్ స్కామ్ బయటపడింది. రూ.35 లక్షలు లంచం చొప్పున తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు అమ్మేస్తున్న వైనం తాజాగా వెలుగుచూసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ భారీ కుంభకోణం బట్టబయలు అయ్యింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు వరకు ముడుపులు తీసుకుంటున్నారు. ఓ మనీలాం డరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్ బయటపడింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగానికి సంబంధించి 2024లో రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఇందులో అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర పోస్టులు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక పత్రాలు అందజేశారు. దాదాపు 150 మంది అభ్య ర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని తెలి పింది. ఇందు కోసం ఆయా అభ్యర్థుల నుంచి ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు చొప్పున లంచాలు తీసుకున్నట్లు గుర్తించామని చెప్పింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు పోలీస్‌లకు ఈడీ లేఖ రాసింది.





# నష్టపోయిన ప్రతి ఎకరాకు సాయం

## ధాన్యం కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహార్

ఏలూరు/ పెదపాడు, అక్టోబరు 29 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నేలకొరిగిన వరిచేలను రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి మరియు ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు లు కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేశారు. 1318 వరి రకం వేశామని ఒక ఏకరాకు 42 నుండి 44 బస్తాలు దిగుబడి వస్తాయని, గడ్డి కూడా ఎక్కువ వస్తుందని, పశువులకు పనిచేస్తుందని ఆశించామని తెలిపారు. విపత్తులను తట్టుకునే శక్తి 1318 రకానికి ఉందని అయితే రాత్రి కురిసిన భారీ వర్షాలు, భారీ ఈదురు గాలితో వరి పంటలు నేలకొరిగాయని రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఎకరాను పారదర్శంగా నష్టం అంచనాలు వేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని రైతులకు భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, కూటమి ప్రభుత్వం రైతులు ప్రభుత్వం అని మీకు అండగా ఉంటామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతులు ఖాతాలో నగదు జమ చేస్తామని, ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి పంటలకు గిట్టుబాటు ధర అందించటమే మా ప్రథమ కర్తవ్యం అన్నారు. నేలకొరిగిన వరిపంటను దుబ్బులుగా కట్టుకుని వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను డ్రోన్ల ద్వారా స్ప్రే చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు పాటించి పంటలను చేతికి వచ్చేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 1318 వరి రకం ఎటువంటి విపత్తులను తట్టుకునే శక్తి ఉందని ఇక్కడ ఎక్కువ మంది రైతులు 1318 వరి రకం వేసుకున్నారని తెలిపారు. తుపాన్ ప్రభావంతో అధిక వర్షాలు, అధిక గాలులు వీచుటవలన రాత్రికి నేలకొరిగాయని తెలిపారు. ఈ ప్రాంత రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ బాషా, ఎడిఇ ఇ.అనిత కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ ఖాసీమ్, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# నచ్చనేరిలో గిరిజనులతో మమేకమై...

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపానుతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నష్టపోయిన బాధితులను పరామర్శించుకుంటూ, ప్రభుత్వం ప్రకటించిన సహాయాన్ని అందిస్తూ, భారీ వర్షాలతో మత్యువు పాలైన వారి కుటుంబాలను పరామర్శించుకుంటూ బుధవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యటించారు. ఏర్పేడు మండలంలోని నచ్చనేరి గిరిజన కాలనీలో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇక్కడ సుమారు 60కుటుంబాలు నివాసముండగా 25 గుడిసెలు నేలకొరిగాయి. మంగళవారం ఉదయం సమాచారం అందటంతో మహిళా అధికారులైన సకాలంలో స్పందించారు. తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ డాక్టర్ సౌభాగ్యం కాలనీకి చేరుకొని పరిస్థితులను సమీక్షించారు. వెంటనే గుడిసెలు కూలిన వారిని 'పునరావస కేంద్రానికి' చేర్చారు. వారికి భోజన సదుపాయాలు కల్పించారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికార, రాజకీయనాయకులతో నచ్చనేరి చేరుకున్నారు. అక్కడ గిరిజనుల సమస్యలను సావధానంగా విన్నారు. ఓ సాదాసీదా వ్యక్తిగా వారితో కలసి నేలపై కూర్చున్నారు. గిరిజనుల గోడును విన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు నిర్మాణం చేపడతామన్నారు. మీకు ఆదుకోవటానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. అలాగే మీకు సహాయ సహాకారాలు అందించుటకు ఎల్లవేళల్లో నేనున్నానని వివరించారు. నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం ప్రకటించిన 25కిలోల బస్తా బియ్యంతో పాటు నిత్యావసర సరకులను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అందించారు. ఎంఎల్ఏతో పాటు తహశీల్దార్ భార్గవి మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు పొన్నారావు తదితరులున్నారు.

# కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు

గుంతకల్లు, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శిఖర కలశాలకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు. ఉదయం వేదపండితులు శ్రీసీతారామ లక్ష్మణ సహిత నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల ఆరాధన, పరిషత్ విజ్ఞాపన, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, యాగశాల ప్రవేశం, గోపూజ, అగ్ని ప్రతిష్ఠ, రామాయణ, చతుర్వేద పారాయణములు, 18 కలశములకు పంచగవ్య స్నపనం, అర్చన, పూర్ణాహుతి, మంగళా శాసనంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### కన్నుల పండువగా సాగిన నగర శోభాయాత్ర

పాత గుంతకల్లు వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం నుండి నిర్వహించిన హనుమాన్ నగర శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర, రామాయణ, చతుర్వేద పారాయణములు, మహా కుంభ స్థాపన, ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, ఉప కుంభారాధనలు నిర్వహించారు. అగ్నిముఖము దిశగా 18 కలశాలు, ఉత్సవ మూర్తులను అశేష భక్త జనసంద్రం మధ్య ఊరేగించారు. చిన్నారుల వేషధారణ, మహిళల కోలాటం, గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, తహశీల్దార్ రమాదేవి, అనువంశక ధర్మకర్త సుగుణమ్మ, కార్యనిర్వాహక అధికారి మేడేపల్లి విజయరాజు, ఆలయ అధికారులు వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల కన్వీనర్ రామన్నచౌదరి, నాయకులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, బిజెపి నాయకులు శేఖన్న, కొలిమి రామాంజనేయులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నా

### బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత్‌లో స్వేచ్ఛగా ఉండగలుగుతున్నానని, అయితే తన కుటుంబానికి ఎదురయ్యే హింసాత్మక ఘటనల చరిత్రకార ణంగా కొంత అప్రమత్తంగా ఉంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తన పార్టీని నిషేధిస్తే మిలియన్లకొద్దీ బంగ్లాజనాభా ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె హెచ్చరించారు. అంత ర్జాతీయ మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లా డుతూ తనవల్లనే బంగ్లాదేశ్‌లో అశాంతి పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేసారు. 2024 జులై, ఆగస్టునెలల్లో ఎగిసిన నిరసనలకు క్షమాపణలు చెప్పాల్సిన పనిలేదని, ఇదంతా జాతివ్యతిరేక కుట్రలని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో తాను స్వేచ్ఛగా నివసిస్తున్నానని, కుటుంబ గత ఘటనల చరిత్రకారణంగా బయటకు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఆనాటి బంగ్లాదేశ్ ఆర్మీచీఫ్ వకార్‌ఉజ్‌జమాన్ సలహా మేరకు షేక్ హసీనా బంగ్లాను వీడి భారత్‌కు వచ్చేసారు. తాను బంగ్లాదేశ్‌కు వెళ్లబోనని, తన పార్టీని నిషేధించి అధికారంలోకి వచ్చిన ఏపా లనలో అయినా కూడా తాను బంగ్లాదేశ్‌కువెళ్లనని భారత్‌లోనే ఉంటానని ఆమె స్పష్టంచేసారు. అయితే తాను స్వదేశానికి వెళ్లాలని ఎంతగానో తపిస్తున్నట్లు ఆమె చెప్పారు. సహేతుకమైన ప్రభుత్వం అన్ని పార్టీలను గౌరవించేప్రభుత్వం, రాజ్యాంగ నిబద్ధతను కాపాడే ప్రభుత్వం ఉన్నట్లయితే కచ్చితంగా తాను బంగ్లాదేశ్‌కు వెళతానని చెప్పారు.



# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా కార్తీకమాస పూజలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 29 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని బుధవారం హైకోర్టు నూతన న్యాయమూర్తి సుభేందు సమేత దంపతులు దర్శించుకున్నారు. వారికి ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ముచ్చటించారు.

# ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న



**హైదరాబాద్,అక్టోబరు 29,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీల కురాలిగా అదితా స్వప్న నియమితుల య్యారు. ఈమేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీ లకురాలిగా బి.అదితా స్వప్నను నియమిస్తూ బుధవారం ఉత్త ర్వులు అందించారు.గతంలో అదితా స్వప్న బీహార్, పుదుచ్చేరి ,అండమాన్,నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా విజయవం తంగా పని చేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యంను కాంగ్రెస్ అగ్రనేతల రాహుల్ గాంధీ గుర్తించి, ఆంధ్రప్రదేశ్ బాధ్యతను ఇప్పుడు ఆమెకు అదనంగా అప్పగిం చాలని సూచించడంతో ఈ నియామకం జరిగింది. అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగించినందుకు రాహుల్ గాంధీకి, అల్కా లాంబాకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలి పారు. ఆమె నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికత, నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.



బైక్‌రైడ్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్

# సామాజిక సేవలో యువత భాగస్వామ్యం

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, అక్టోబరు 29 ప్రభాతవార్త: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్లశ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పంకు చెందిన ముగ్గురు యువకులు కుప్పం నుంచి శ్రీకాకుళం దాకా చేపట్టిన గ్రేట్ ఆంధ్రా రైడ్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కుప్పం యువకులు తమ పర్యటనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ప్లాస్టిక్ ఫ్రీ లక్ష్యంతో అవగాహన కల్పిస్తారని ఇది మంచి కార్యక్రమం అన్నారు. యువకుల యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్‌సురేష్‌బాబు, కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్,తిరుమగళ్,రెస్కో డైరెక్టర్ ఆర్ముగం,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీ విస్తృతదిశగా ముందడుగు

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎపి ఉపాధ్యక్షుడు ఆచార్య డా. మునిరత్నంనాయుడు

### ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానం



హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 29 ప్రభాతవార్త : తెలుగు విశ్వవిద్యాలయం కేవలం ఇరు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్త విస్తృ తదిశగా అడుగులు వేసేందుకు కృషిచేస్తున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పడడం శుభసూచక మన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాల యంలో బుధవారం సాయంత్రం 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పుర స్కారాల ప్రదానోత్సవం జరిగింది. విశ్వవిద్యాల యం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు ఎస్. రమేష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి తదితరులతో కలిసి 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథ రచయితలను ఘనంగా సత్కరించి సాహితీ పురస్కారాలు, ఒక్కొక్కరికి రూ.20,116 నగదు పారితోషికం ప్రదానంచేసి అభినందించి ప్రసంగించారు. ముందుగా హను మంతరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేయగా రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

చివరిగా ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న రింగు రామమూర్తిని ఉపాధ్యక్షుడు ఘనంగా సత్క రించారు.సాహితీ పురస్కార గ్రహీతలలో పద్యకవిత ప్రక్రియలోని ఉత్తమ గ్రంథం ధర్మపురీ వైభవం రచయిత ఒజ్జల నరహరిశర్మ; వచన కవిత నేను యౌగిక కావ్యం విశ్వర్షి వాసిలి; గేయకవిత తెలంగాణ రుబాయిలు డా. ఏనుగు నరసింహారెడ్డి; బాలసాహిత్యం చందమామ చెప్పిన కథలు డా. ఎం.హరికిషన్; కథ నా నుండి మన వరకు డా. టి.సం పత్‌కు మార్; నవల మాదిగ కొలుపు ఆచార్య పులికొండ సుబ్బాంచారి; సాహిత్య విమర్శ ద్విక్చక్రం ఆదెపు లక్ష్మీపతి; నాటకం రచ్చబండ రావుల పుల్లాచారి; అనువాదం మృత్యుంజయుడు డా. టి.సి.వసంత; వచన రచన తిరుపతి కథలు ఆచార్య వేట శ్రీనివాసులురెడ్డి; రచయిత్రి ఉత్తమ గ్రంథం స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి డా. జంధ్యాల కనకదుర్గలు ఉన్నారు.

# మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత్ ఫైనల్ చేరేనా?

## వర్షం ఎఫెక్ట్: ఆసిస్‌తో నేటి సెమీస్ సందిగ్ధం!





**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్-2025 ఫైనల్‌కు చేరుకునే విషయంలో టీమిండియా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. నేడు ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉండగా, వర్షం కారణంగా అది జరగడంపై సందిగ్ధత నెలకొంది. మర్నాడు రిజర్వ్ డే రోజున కూడా వర్షం పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 30న జరుగుతుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగే ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు మైదానంలో తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఇంతలో, ఈ మ్యాచ్ గురించి వాతావరణ శాఖ కీలక సమాచారం అందించింది. వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. కొంకణ్‌కు దక్షిణంగా ఉన్న అల్పపీడన ప్రాంతం కారణంగా ముంబైలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 48-72 గంటల్లో ముంబైలో బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఇది భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండవ సెమీఫైనల్‌ను ప్రభావితం చేసే వీలుంది. ఈ నెల 30న మ్యాచ్ జరిగే సమయంలో నవీ ముంబైలో మధ్యాహ్నం వర్షం పడే అవకాశం 69 శాతం ఉంది. ఈ రోజు మొత్తం 3.8 మి.మీ. వర్షం పడే వీలుంది. అయితే సెమీఫైనల్స్, ఫైనల్స్ కోసం నిర్వాహకులు రిజర్వ్ డేలు కేటాయించారు. కానీ, అక్టోబర్ 31న నవీ ముంబైలో కూడా వర్షం పడే అవకాశం ఉంది. దీని వలన మ్యాచ్‌రద్దు అయ్యే అవకాశం ఉంది. రిజర్వ్‌డే రోజున వర్షం కారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగకపోతే, అది ఆస్ట్రేలియాకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుంది. ఎందుకంటే, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు వారు ఒక్క మ్యాచ్‌కూడా ఓడిపోలేదు. వర్షంకారణంగా మ్యాచ్‌రద్దు అయితే, పాయింట్ల పట్టిక ఆధారంగా ఫైనల్ నిర్ణయించబడుతుంది. అంటే, అత్యధిక పాయింట్లు సాధించిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ విధంగా, ఆస్ట్రేలియా 13 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, భారతదేశం 6 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉంది. ఈ సందర్భంలో, ఆస్ట్రేలియా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో సెమీఫైనల్ జరిగే రోజున వర్షం రాకుండా ఉండాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.



## ఆట

## కెనడియన్ మహిళల ఓపెన్

# అనాహత్ సంచలన విక్టరీ

**న్యూఢిల్లీ:** కెనడియన్ మహిళల ఓపెన్-2025లో భారత్‌కు చెందిన టీనేజ్ సంచలనం అనహాత్ సింగ్ సంచలన విజయం సాధించింది. 2025 కెనడియన్ ఉమెన్స్ ఓపెన్‌లో అనాహత్ సింగ్ ప్రపంచ నం.7 బెల్జియంకు చెందిన టిన్నె గిలిస్‌ను ఓడించి మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. 17 ఏళ్ల ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ మరియు మాజీ ప్రపంచ క్రీడల ఛాంపియన్ బెల్జియన్ సూపర్ స్టార్‌ను వరుస గేమ్‌లలో 12-10, 11-9, 11-9 తేడాతో ఓడించి తన తొలి పిఎస్ఎ సిల్వర్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇది అనాహత్ కెరీర్‌లో అతిపెద్ద విజయమే కాకుండా మొదటిసారిగా, ఆమె ప్రపంచంలోనే టాప్10 ర్యాంక్‌లో ఉన్న క్రీడాకారిణిని ఓడించింది. 16వ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మెలిస్సా అల్వేస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టాప్ 20లో ఉన్న క్రీడాకారిణిపై 3-1 తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ టోర్నమెంట్‌లో అనాహత్ సాధించిన రెండవ ప్రధాన విజయం ఇది. ఇప్పుడు సెమీఫైనల్‌లో, అనహాత్ ఇంగ్లాండ్‌కు చెందిన 4వ సీడ్ గినా కెన్నెడీతో తలపడనుంది, ఆమె కెనడియన్ నంబర్ 1 హోలీ నాటన్‌పై విజయం తర్వాత ఇంటి ఆశలను తుడిచిపెట్టుకుంది.

# పారిస్ మాస్టర్స్‌లో అల్కరాజ్ ఘోర ఓటమి



**న్యూఢిల్లీ:** పారిస్ మాస్టర్స్‌లో ప్రపంచ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఓటమిపాలయ్యాడు. కామెరాన్ నోరీ చేతిలో ఘోర పరాజయం చెందాడు. బ్రిటన్‌కు చెందిన కామెరాన్ వరల్డ్ టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుని ఎటిపి మాస్టర్స్ 1000 స్థాయిలో స్పెయిన్ ఆటగాడు 17 మ్యాచ్‌ల విజయ పరంపరకు ముగింపు పలికాడు. టోక్యోలో సీజన్‌లో తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత, ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ తన ఆటకు దూరంగా ఉన్నాడు. తదుపరి పారిస్ మాస్టర్స్‌లో కామెరాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 అనవసర తప్పిదాలు చేశాడు. మొదటి సెట్ గెలిచిన తర్వాత, అల్కరాజ్ జోరును కొనసాగించడంలో విఫలమయ్యాడు. అయితే నోరీ క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు. ప్రపంచ 31వ ర్యాంక్ ఆటగాడైన కామెరాన్ చివరి సెట్‌లోని ఏడవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు మరియు రెండు గంటల 22 నిమిషాల తర్వాత మ్యాచ్‌ను కైవసం చేసుకోవడానికి సర్వ్‌ను పట్టుకున్నాడు. మార్చి తర్వాత ఫైనల్‌కు ముందు అల్కరాజ్ ఓటమి మొదటిసారి. మయామి ఓపెన్ వరకు సాగిన అతని ఆధిపత్యం మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌తో నిలిపివేసాడు, ఈ సమయంలో అతను మోంటే కార్లో, రోమ్ మరియు సిన్సినాటి టైటిళ్లను గెలుచుకున్నాడు. ఈ వారం ఇటలీకి చెందిన జానిక్ సిన్నర్ పారిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంటే అల్కరాజ్ సంవత్సరాంతపు ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

## వరుణుడి ఎఫెక్ట్

# ఆసీస్‌తో తొలి టి20 రద్దు

### భారత్ 9.4 ఓవర్ల 97 రన్స్ వద్ద బ్రేక్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్థంతరంగా రద్దు అయ్యింది. కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేది కగా బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్ వరుణుడు అడ్డుతగలడంతో, రెండు పవర్‌హౌస్ జట్ల మధ్య పోరు అర్థంతరంగా నిలిచిపోయింది. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత జట్టు ఇన్నింగ్స్ ప్రారంభమైన కాసేపటికే వర్షం అంతరాయం



కలిగించింది. కొంత విరామం తర్వాత ఆటను ఒక్కో జట్టుకు 18 ఓవర్లకు కుదించారు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (19 పరుగులు) త్వరగా ఔటైనా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించారు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ ఆస్ట్రేలియా బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 39 పరుగులు) తనదైన శైలిలో సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను ఉర్రూతలూగించాడు. గిల్ (20 బంతుల్లో 37 పరుగులు) కూడా అతనికి చక్కటి సహకారం అందించాడు. భారత జట్టు 9.4 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 97 పరుగులు చేసిన తరుణంలో, వర్షం మళ్లీ ప్రారంభమైంది.

ఈసారి వర్షం తీవ్రత ఎక్కువగా ఉండడంతో, ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గుముఖం పడుతుందని ఎదురుచూసినప్పటికీ తగ్గకపోవడం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండవ టీ20 మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 31 న జరగనుంది.

# ఆసియా యూత్ గేమ్స్‌లో ఫైనల్స్‌కు ఆరుగురు బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. ఐదుగురు బాలికలు మరియు ఒక బాలుడు సహా ఆరుగురు బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. అలాగే పురుషుల విభాగంలో అనంత్ దేశ్‌ముఖ్ బలమైన సెమీఫైనల్ పరుగు తర్వాత భారత్ ఒక కాంస్య పతకాన్ని కూడా నిర్ధారించింది. బహ్రెయిన్‌లోని మనామాలో జరిగిన బాలికల సెమీఫైనల్స్లో, ఖుషీ చంద్ (46 కిలోలు) మంగోలియాపై 5:0 తేడాతో విజయం సాధించి భారత ఆధిపత్య పరుగును ప్రారంభించింది. ఆ తర్వాత చంద్రిక భోరేషి పూజారి (54 కిలోలు) తన ప్రత్యర్థి కజకిస్తాన్‌పై 5:0 తేడాతో విజయం సాధించగా, హర్నూర్ కౌర్ (66 కిలోలు) అద్భుతమైన సంయమనం, ఎదురుదాడి ప్రదర్శించి చైనీస్ తైపీని (5:0) ఓడించగా, అన్విక (+80 కిలోలు) మరో క్లీన్ స్వీప్‌లో చైనాను చిత్తు చేసింది. ఇక సెషన్ 2లో, అహానా (50 కిలోలు) ఉజ్బెకిస్తాన్ నుండి వచ్చిన కఠినమైన సవాలును అధిగమించి పట్టుదలను ప్రదర్శించి 3:2 తేడాతో గెలిచింది. అలాగే బాలుర విభాగంలో లాంచెన్‌బా సింగ్ మోయిబుంగ్‌ఖోంగ్‌బామ్ (50 కిలోలు) పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియాపై 5:0 ఏకగ్రీవ విజయంతో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు.



అలాగే అనంత్ దేశ్‌ముఖ్ (66 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన బలమైన ప్రత్యర్థిపై పోరాడినా సెమీఫైనల్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. దీంతో ఆరుగురు ఫైనలిస్టులతో పాటు, ఒక కాంస్య పతకంతో భారత్ అత్యంత విజయవంతమైన యూత్ బాక్సింగ్ ప్రచారంలో ఒకటిగా నమోదు చేసింది.

# ఐపిఒకు సిద్ధమవుతున్న ఆకాశ ఎయిర్‌లైన్స్

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** దేశీయ విమానయాన సంస్థ ఆకాస ఎయిర్ వచ్చే ఐదేళ్లలో ఐపిఒకు రావాలనినిర్ణయించింది. వచ్చే ఏడాది రెండో అర్ధసంవత్సరంనుంచి కూడా పైలట్లను నియమించుకునేందుకు కసరత్తులు ప్రారంభించినట్లు సంస్థ సిఇఒ వెల్లడించారు. నష్టాల్లో నడుస్తున్న ఆకాశ భారత్‌లో మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్‌గా నిలుస్తోంది. బోయింగ్‌నుంచి విమానాల డెలివరీలో ఉన్న జాప్యం కారణంగా పైలట్లకు సరిపడా విధుల్లేవు.
అంతేకాకుండా వారానికి ఏడురోజులవ నిపై వర్క్‌ఫోర్స్ సమ్మెకూడా సంస్థకు కొంత సమస్యలు తెచ్చిపెట్టింది. బోయింగ్ జాప్యాలే తమకు ప్రధాన సమస్యగా ఉన్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్‌లు చెపుతున్నారు. వచ్చే 60 రోజుల్లో పైలట్లు నూరుశాతం పనిగంటలు



నిర్వర్తిస్తారని, వారంతా కాక్‌పిట్‌లోకి రాగలరని ఆకాశ సిఇఒ వినయ్‌దూబే వెల్లడించారు. ఐపిఒకు ముందు మూలధన సేకరణ అవసరం లేదని ఇప్పటికే రహస్యమార్గంలో నిధులు కొంతమేర సేకరించినట్లు సిఇఒ వివరించారు. మాకు 30 విమానాలు రావాల్సి ఉందని చెప్పిన సిఇఒ ఈ ఏడాది ఆకాశ ఎన్ని విమానాలు రాబడుతుందనన్నది మాత్రం చెప్పలేదు. 2026 అక్టోబరునాటికి ఆకాశకు మొత్తం 54 విమానాలు ఉంటాయని తెలుస్తోంది. 2027 మార్చి నాటికి అయితే మొత్తం 72 విమానాలు తమ సంస్థపేరిట ఉంటాయన్న ధీమాతో ఉంది.

## వాణిజ్యం

# ఈక్విటీ సూచీలకు ఎనర్జీ, మెటల్ స్టాక్స్ మద్దతు

### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 29:** స్టాక్ మార్కెట్లు మరోసారి లాభాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్‌దోరణులు, ఇన్వెస్టర్ సెంటిమెంట్లు బలపడటంతో కొనుగోళ్లపెరిగాయి. అంతేకాకుండా అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలపైనా ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించారు. వీటితోపాటుగానే అమెరికా చైనా వాణిజ్య ఒప్పందం వంటివి కీలకం అయ్యాయి. నిఫ్టీ 26,050 స్థాయిని దాటింది. ఇంధనం, మెటల్‌స్టాక్స్ లాభాలకు మద్దతిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 368.97 పాయింట్లుపెరిగి 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 117.70 పాయింట్లుపెరిగి 26,053.90 పాయింట్లవద్ద నిలిచింది. ఆదాని పోర్ట్స్ అండ్ సెజ్ 2.78శాతం, ఆదాని



ఎ ంటర్‌ప్రైజెస్ 1.65శాతం, రిలయన్స్ 1.14శాతం పెరిగి సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.68శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.56శాతం పెరిగింది. బిఎస్ఇలో 2446 స్టాక్స్ పెరిగితే 1727 స్టాక్స్ దిగజారాయి. 162 కంపెనీలు యధాతథంగా నిలిచాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.29గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.55శాతంపెరిగి 1,21,530కి చేరాయి. అలాగే అమెరికా పదేళ్ల బాండ్లు 0.18శాతంపెరిగి 3.990గా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు డిసెంబరు కాంనరటాక్టుల్లో 11 సెంట్లు లాభపడి 17శాతంపెరిగి బ్యారెల్‌కు 63.94 డాలర్లుగా నడిచింది. వరుణ్ బేవరేజెస్ 9.31శాతం పెరిగితే టాటాక్యాపిటల్ 1.37 శాతం క్షీణించింది. శ్రీసిమెంట్ 2.16శాతం, ఆదాని గ్రీన్ ఎనర్జీ 10.80 శాతం, ఆదాని టోటల్ గ్యాస్ 2.15శాతం, గో డిజిటల్‌జనరల్ ఇన్సూరెన్స్ 1.23శాతం, మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 6.07శాతం పెరిగాయి. ఫిషర్ మెడికల్ వెంచర్స్ 7.24శాతం దూసుకువెళ్లింది. డిసిఎం శ్రీరామ్ కూడా 2.17శాతం, పిఎన్‌జిఎస్ గార్గి ఫ్యాషన్ జ్యూవెలరీ 20శాతం ఒక్కసారిగాపెరిగాయి. ఐపిఒలపరంగా ఓర్క్లా ఇండియా 1,24,14,260 షేర్లకు బిడ్లు సాధించింది. ఆఫర్‌లో 1,59,99,104 షేర్లను ప్రకటించింది. ఇష్యూలో 0.78రెట్లు కొనుగోళ్లు జరిగాయి.




# డిజిటల్ చెల్లింపుల్లో 'యుపిఐ' రికార్డు

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌యూపీఐ తన రికార్డులు సృష్టిస్తోంది. 2025 మొదటి అర్ధభాగంలో యూపీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగి 106.36 బిలియన్లకు చేరింది. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 143.34 లక్షల కోట్లుగా నమోదైంది.
దేశంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలను వరల్డ్‌లైన్ సంస్థ తన ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ (బీ1 2025)ఖిలో బుధవారం వెల్లడించింది. యూపీఐ ద్వారా జరిగే సగటు లావాదేవీ విలువ తగ్గడం గమనార్హం.
2024 ప్రథమార్థంలో సగటున రూ. 1,478గా ఉన్న లావాదేవీ విలువ, 2025 ఇదే కాలంలో రూ. 1,348కి తగ్గింది. టీ కొట్టు, కిరాణా దుకాణం నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు చిన్న చిన్న, రోజువారీ కొనుగోళ్లకు ప్రజలు యూపీఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది సూచిస్తోంది. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి (పి2బి) చేసే లావాదేవీలు 37 శాతం వృద్ధితో 67.01 బిలియన్లకు చేరాయి. దేశంలోని చిన్న, సూక్ష్మ వ్యాపారాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో భారత్‌లో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మర్చంట్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఈ వృద్ధికి అనుగుణంగా చెల్లింపుల మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. దేశంలో క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 2024 జనవరితో పోలిస్తే 111 శాతం పెరిగి 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరింది.
అలాగే, పాయింట్‌ఆఫ్‌సేల్ (పీఓఎస్) టెర్మినళ్ల సంఖ్య 29 శాతం వృద్ధితో 11.2 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు క్రెడిట్ కార్డుల వాడకం ప్రీమియం ఖర్చులకు సాధనంగా మారుతోంది. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 23 శాతం పెరిగింది.
అయితే, చిన్న చెల్లింపులు యూపీఐ వైపు మళ్లడంతో పీఓఎస్ వద్ద డెబిట్ కార్డుల వాడకం దాదాపు 8 శాతం తగ్గింది. మొత్తం మీద మొబైల్ చెల్లింపులు 30 శాతం వృద్ధితో 98.9 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వీటి విలువ రూ. 209.7 ట్రిలియన్లుగా ఉంది.

# విదేశీ పసిడినిల్వలను భారత్‌కు తరలిస్తున్న ఆర్బీఐ



**ముంబయి, అక్టోబరు 29:** భారత రిజర్వ్ బ్యాంక్ తన బంగారు నిల్వలను భారీగా స్వదేశానికి తరలిస్తోంది. విదేశీ ఖజానాల్లో దాచిన పసిడిని తిరిగి భారత్‌కు తీసుకు రావడంపై దృష్టి సారించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇతర దేశాలు విధిస్తున్న ఆర్థిక ఆంక్షల నుంచి తమ ఆస్తులను కాపాడుకునేందుకే ఆర్‌బీఐ ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఆర్‌బీఐ సుమారు 64 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించింది. సెప్టెంబర్ చివరి నాటికి భారత్ వద్ద మొత్తం 880.8 టన్నుల బంగారం నిల్వలు ఉండగా, అందులో 575.8 టన్నులు ఇప్పుడు దేశీయ ఖజానాల్లోనే భద్రంగా ఉన్నాయి. మిగిలిన 290.3 టన్నుల పసిడిని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద ఉంచారు. మరో 14 టన్నులు గోల్డ్ డిపాజిట్ స్కీమ్‌లలో ఉన్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఆఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత జీ7 దేశాలు ఆయా దేశాల విదేశీ మారక నిల్వలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత 2023 మార్చి నుంచి ఆర్‌బీఐ విదేశాల నుంచి ఏకంగా 274 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తీసుకొచ్చింది. విదేశాల్లోని ఆస్తుల భద్రతపై ఆందోళనల కారణంగానే ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. బుధవారం భారత మార్కెట్లలో బంగారం ధరలు పెరిగాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయం వెలువరించనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరలు పెరగడం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో 10 గ్రాముల బంగారం ధర ఫ్లాట్‌గా రూ.1,19,647 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 0.34 శాతం (రూ.401) పెరిగి రూ.1,20,047 వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర కూడా కిలోకు 0.69 శాతం (రూ.989) పెరిగి రూ.1,45,331కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సుపై 0.2 శాతం పెరిగి 3,957.42 డాలర్ల వద్ద ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 52 శాతం పెరిగాయి. అక్టోబర్ 20న ఔన్సుకు 4,381.21 డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, వడ్డీ రేట్ల కోతపై అంచనాలు, ఆర్‌బీఐ వంటి కేంద్ర బ్యాంకులు కొనుగోళ్లు కొనసాగించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

# రూ.1500 కోట్ల ఐపిఒకు బోట్ సిద్ధం!

**ముంబయి, అక్టోబరు 29:** దేశీయ ఎలక్ట్రానిక్స్ కంపెనీ బోట్ రూ.1500 కోట్ల పబ్లిక్ ఆఫరింగ్‌కు సెబీ ఆమోదం సాధించింది. ఐపిఒ తాజా ఇష్యూగారూ.500 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. అలాగే ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా రూ.1000 కోట్లు ప్రస్తుత ఇన్వెస్టర్లనుంచి సమీకరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఒఎఫ్ఎస్ విభాగంలో సమీర్ అశోక్ మెహతా రూ.75 కోట్లవిలువైన షేర్లను విక్రయిస్తారు.



అలాగే అమన్ గుప్తా రూ.225 కోట్లు, సౌత్‌లేక్ ఇన్వెస్ట్‌మెంట్ రూ.500 కోట్లు షేర్లను విక్రయిస్తుండగా రూ.150 కోట్లు ఫైర్‌సైడ్ వెంచర్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్-1, మరో 50 కోట్లు క్వాల్‌కామ్ వెంచర్స్ ఐపిఒలో విక్రయించనున్నాయి. 2013లో గురుగ్రామ్‌లో స్థాపించిన బోట్ ఆడియోగేర్లు, స్మార్ట్ వేరబుల్స్, వ్యక్తిగత గ్రూమింగ్ ఉత్పత్తులతోపాటు మొబైల్ యాక్సెసరీస్‌ను కూడా తయారీ విక్రయాలుచేపట్టింది. గతంలో రూ.2వేల కోట్ల ఐపిఒకు దరఖాస్తుఉచేసింది. ఇందులో 900 కోట్లు తాజా ఇష్యూగాను, ఒఎఫ్ఎస్ 1100 కోట్లుగాను ప్రకటించింది. అయితే బోట్ 2025లో లాభదాయకత సంస్థగా మారింది. నష్టాలను తగ్గించుకుంటూ వస్తోంది. రూ.60 కోట్లనుంచి తగ్గూత వస్తోంది. రాబడులు 3098 కోట్లకు పెరిగాయి. ఆడియోవిభాగంలోనే అమ్మకాలు పెరగడంతో విపరీతమైన రాబడులు సాధించగలిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.